శుక్రవారం 30.10.2026

పేజీలు : 12 వెల : రూ. 5/-

వెలుతురు

సంపుటి : 09
సంచిక : 137

తెలుగు దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD

www.velthuru.com

Follow :

పోలీసుల లాఠీలకు భయపడొద్దు..

నవంబర్1న ర్యాలీకి తరలిరండి.. ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 29:

నవంబర్ 1న ఇండీ కూటమి తలపెట్టిన చలో ఢిల్లీ ర్యాలీలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పోలీసులు, లాఠీలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తమ కుతంత్రాలను ప్రయోగించే దమ్ము బీజేపీకి లేదన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి, దేశాన్ని కాపాడుకోవడానికి కలిసికట్టుగా నడుద్దామని రాహుల్ గాంధీ అన్నారు. ముఖ్యంగా రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా విద్యార్థి సంఘాలన్నీ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు. ఇదో అద్భుతమైన మార్చ్ కాబోతుందని అన్నారు. ఇది కేవలం ఒక నిరసన మాత్రమే కాదని, ఈ దేశ ఆత్మ కోసం చేస్తున్న ప్రదర్శనగా రాహుల్ గాంధీ అభివర్ణించారు.

ఖర్గే నివాసంలో ఇండీ కూటమి నేతల మీటింగ్

మరోవైపు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో 'ఇండీ' కూటమికి చెందిన ఎంపీలు సమావేశమయ్యారు. ఖర్గేతో పాటు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, గౌరవ్ గొగోయ్ సహా ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు. శుక్రవారం జరగబోయే 'మాక్ పార్లమెంట్'తో పాటు ర్యాలీ ఏర్పాట్లపై చర్చించారు. మాక్ పార్లమెంట్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌పై ప్రతీకాత్మకంగా 'అభిశంసన' ప్రక్రియను చేపట్టాలని వారు భావిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పార్లమెంటరీ కార్యకలాపాల తరహాలో నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం ప్రక్రియ ఒక పార్లమెంటు సమావేశంలా ఉంటుందని, ఇందులో అధికార, ప్రతిపక్షాలు ఉంటాయని పార్టీ వర్గాలు చెప్పాయి. సుమారు 40 మంది వక్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఈ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఈ 'మాక్ పార్లమెంట్' తర్వాత నవంబర్ 1న భారీ బహిరంగ సభ (ర్యాలీ) జరగనుంది.

ఆ 550 ఎకరాలు ప్రభుత్వానివే..

- మియాపూర్ భూముల కేసులో సుప్రీం తీర్పు
- తెలంగాణ ప్రభుత్వం విజయం
- ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేత
- ప్రభుత్వం చూపిన చొరవకు ప్రశంసలు

- వివరాలు 12 లో..

తెలంగాణకు

పెట్టుబడుల వెల్లువ

కేంద్ర సర్కార్ పూర్తి సహకారం

వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి తెలంగాణ కీలక భాగస్వామి

వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని సాధించేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, అన్ని రంగాలు కలిసికట్టుగా ముందుకు సాగాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం 2047 నాటికి రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఢిల్లీలో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

- రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని స్వాగతించిన పీయూష్ గోయల్
- 30 ట్రిలియన్ డాలర్లలో 10 శాతాన్ని తెలంగాణ కంట్రిబ్యూట్ : సీఎం రేవంత్
- జీసీసీ, ఏఐ, లైఫ్ సైన్సెస్‌లో హైదరాబాద్ ముందంజ
- ఆర్ఆర్ఆర్ నిర్మాణం హైదరాబాద్‌కు మరో గేమ్ ఛేంజర్
- డిసెంబర్ ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలకు శ్రీధర్‌బాబు ఆహ్వానం

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 29:

పండుగల రోజుల్లో ఇన్వెస్ట్ తెలంగాణ సన్నాహక కార్యక్రమం నిర్వహించడం కూడా మరో పండుగ వాతావరణాన్ని తలపిస్తోందని గోయల్ అన్నారు. సుమారు 700 ఏళ్ల క్రితమే కాకతీయ గణపతి చక్రవర్తి మోటుపల్లి శాసనం ద్వారా నౌకా వాణిజ్యానికి ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. అప్పట్లోనే వ్యాపారులు పెట్టుబడులకు భద్రత, విధానాల్లో స్థిరత్వాన్ని కోరుకున్నారని, నేటి పారిశ్రామికవేత్తల ఆకాంక్షలు కూడా అవేనని చెప్పారు. భారత్ ప్రపంచంలోని తొలి ఐదు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచిందని, అంచనాలకు మించి వేగంగా ఆర్థిక వృద్ధిని సాధిస్తోందని గోయల్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ సంప్రదాయ అంచనాలను అధిగమించి ఎగుమతులను పెంచుతున్నామని చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రతి రాష్ట్రం తన సామర్థ్యాన్ని చాటాలని, ప్రతి పెట్టుబడి, ప్రతి ఉద్యోగం దేశ ప్రగతికి దోహదపడుతుందని అన్నారు.

హైదరాబాద్ సామర్థ్యంపై ప్రశంసలు

జీసీసీ, ఏఐ, లైఫ్ సైన్సెస్ - మిగతా 11 లో..

డిజిటల్ మోసాలకు బ్యాంకులదే బాధ్యత

- బ్యాంకు నిర్లక్ష్యంతో మోసం జరిగితే బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి
- అసాధారణ లావాదేవీలను నిలిపివేసి.. పోలీసులను అప్రమత్తం చేయాలి
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 29:

డిజిటల్ మోసాలు, ముఖ్యంగా 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న సైబర్ నేరాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బ్యాంకుల నిర్లక్ష్యం కారణంగానే మోసం జరిగినట్లు తేలితే బాధితులకు నష్టపరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలని స్పష్టం చేసింది. బాధితులకు తగిన పరిహారం అందేలా ప్రతిపాదిత నియంత్రణ వ్యవస్థలో తప్పనిసరి నిబంధనలు ఉండాలని పేర్కొంది.

డిజిటల్ అరెస్టు మోసాలపై సుమోటోగా విచారణ జరుపుతున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. డిసెంబర్ 31 నుంచి అమల్లోకి రానున్న ఆర్‌బీఐ కేవైసీ సవరణ ఆదేశాలను కూడా పరిశీలిస్తామని తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థలు, బాధితులకు పరిహారం అందించేందుకు తీసుకుంటున్న చర్యల వివరాలను సమర్పించాలని ఆర్‌బీఐని ఆదేశించింది.

అసాధారణ లావాదేవీలపై నిఘా

ఖాతాదారుల సాధారణ లావాదేవీల సరళికి భిన్నంగా జరిగే అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడం, - మిగతా 11 లో..

బాహుదా ఉగ్రరూపం..

హైవేపై వరద

- చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై రాకపోకలు బంద్
- రైల్వే ట్రాక్‌లపైకి వరదనీరు.. 9 రైళ్లు రద్దు, 14 దారి మళ్లింపు
- మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- జలదిగ్బంధంలో పలు గ్రామాలు

శ్రీకాకుళం, వెలుతురు అక్టోబర్ 29:

అర్నబ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తిన వరదలతో శ్రీకాకుళం జిల్లా అతలాకుతలమైంది. ముఖ్యంగా బాహుదా నది ఉగ్రరూపం దాల్చడంతో ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకర రంగా మారింది. ఒడిశాలోని బగలతి డ్యామ్ నుంచి భారీగా నీటిని విడుదల చేయడంతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో బాహుదాలోకి వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. అధికారులు నదికి మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

హైవేపై వరద ఉద్ధృతి

బాహుదా వరద నీరు జాతీయ రహదారి-16పైకి చేరడంతో చెన్నై-కోల్‌కతా హైవేపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పలు గ్రామాలకు రహదారి సంబంధాలు తెగిపోయాయి. వరద ఉద్ధృతి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు.

రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం

వరద ప్రభావం రైల్వే మార్గాలపైనా పడింది. సోంపేట మండలం తల్లాభద్ర వద్ద, కంచిలి మండలం జాదుపూడి - మిగతా 2 లో..

ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- లక్షిత వర్గాలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందించడమే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ లక్ష్యం
- అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలి
- ప్రత్యేక అభివృద్ధి నిధుల ఖర్చులపై శాఖల వారీగా సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

నీటి వృథాను అరికట్టేందుకు 'పానీ' యాప్

- ప్రతి పౌరుడూ వాటర్ వారియర్ కావాలి
- ప్రతి కుటుంబం 20 శాతం నీటి వినియోగం తగ్గించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

2

జవహర్‌నగర్ డంప్ యార్డ్ సమస్యపై

బీజేపీ పోరుబాట

ఈటల రాజేందర్ పాదయాత్రకు బీజేపీ పూర్తి మద్దతు

కీసర నుంచి రాంపల్లి వరకు పాదయాత్రలో పాల్గొన్న ఏలేటి మహేశ్వర్ రెడ్డి

జవహర్‌నగర్, వెలుతురు అక్టోబర్ 29 :

జవహర్‌నగర్ డంప్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతూ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్రకు బీజేపీ పూర్తి మద్దతు తెలుపుతుందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని కీసర నుంచి రాంపల్లి వరకు సాగిన పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వరకు పలువురు నాయకులు జవహర్‌నగర్ డంప్ యార్డ్ సమస్యపై హామీలు ఇచ్చినా, ప్రజలకు ఇప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని విమర్శించారు. మల్కాజిగిరి ఎంపీగా, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు కూడా నెరవేరలేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక పోరాటాలు చేసిన అనుభవం ఈటల రాజేందర్‌కు ఉందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేపట్టిన పాద యాత్రకు బీజేపీ అండగా నిలుస్తుందని తెలిపారు.

అవినీతి పునాదులపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిందని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలను ప్రస్తావించినప్పుడు ముఖ్యమంత్రి సమాధానం చెప్పకుండా ప్రతిపక్ష సభ్యుల మైకులు కట్ చేస్తున్నారని ఆరోపించారు. గతంలో రైతులు, విద్యార్థుల సమస్యలపై ఈటల రాజేందర్ పోరాటాలకు మద్దతు తెలిపారని - మిగతా 11 లో..

కాంగ్రెస్ ప్రభుత్వానికే హాలిడే ఇవ్వాలి

- ఓ వైపు పంటలు ఎండిపోతుంటే.. మూసీ సుందరీకరణ ఎందుకు?
- డీపీఆర్ లేకుండానే లక్షన్నర కోట్ల దోపిడీకి స్కెచ్
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

2

మోదీ కంచుకోటల్లో బీజేపీకి బిగ్ షాక్

- ప్రజా వ్యతిరేకతకు ఎమ్మెల్సీ ఫలితాలే నిదర్శనం : మహేష్ కుమార్ గౌడ్
- నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ జెండా.. వారణాసిలో బీజేపీకి పరాభవం
- నవంబర్ 1 ఢిల్లీలో భారీ ర్యాలీ జరిగి తీరుతుందని వెల్లడి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29:

బీజేపీ అగ్రనేతల కంచుకోటల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఓటమి పాలవడం ప్రధాని మోదీ పాలనపై పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతకు నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఎన్ని స్థానాలు గెలిచామన్నది కాదు, ఎక్కడ గెలిచామన్నది ముఖ్యమని వ్యాఖ్యానించారు. మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో బీజేపీ అభ్యర్థి ఓటమి, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్‌లో కాంగ్రెస్ విజయం బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ అని పేర్కొన్నారు. ఫడ్నవీస్ సొంత నగరంలో కాంగ్రెస్ గెలుపు బీజేపీ కంచుకోటలో తమ సత్తాకు నిదర్శనమన్నారు. లక్నోలో సమాజ్‌వాదీ పార్టీ, పాట్నాలో ఆర్జేడీ, పుణెలో ఎన్సీపీ అభ్యర్థుల విజయాలు బీజేపీపై పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. గోరఖ్‌పూర్‌లో బీజేపీ - మిగతా 11 లో..

ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- లక్షిత వర్గాలకు మరిన్ని సంక్షేమ ఫలాలు అందించడమే ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ లక్ష్యం
- అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలి
- ప్రత్యేక అభివృద్ధి నిధుల ఖర్చులపై శాఖల వారీగా సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29:

ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి మరింత ఊతమిచ్చేలా ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ నిధులను సమర్థవంతంగా వినియోగించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లక్షిత వర్గాలకు గరిష్ఠ ప్రయోజనం చేకూర్చడంతోపాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా నిధుల వినియోగంలో వేగం పెంచాలని సూచించారు. వ్యవసాయం, విద్యుత్, గృహ వసతి, సామాజిక మౌలిక సదుపాయాలు, వైద్య సేవలు వంటి కీలక రంగాల్లో అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం వ్యవసాయ, ఇంధన, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సాంఘిక సంక్షేమ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హాజరయ్యారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని తొలి రెండు త్రైమాసికాల్లో జరిగిన వ్యయం, అమలవుతున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందిన ప్రయోజనాలను సమీక్షిస్తూ.. నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించేందుకు డిప్యూటీ సీఎం పలు కీలక సూచనలు చేశారు.

రైతు భరోసా, సబ్సిడీ విత్తనాల పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాల అమలుపై సమీక్ష సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ రైతులకు వర్తించే పథకాల ద్వారా అందుతున్న ప్రయోజనాలను సమగ్రంగా విశ్లేషించాలని, భూమి యాజమాన్యం ఆధారంగా అమలవుతున్న పథకాల కారణంగా ప్రత్యేక అభివృద్ధి నిధుల వినియోగంలో ఏర్పడుతున్న వ్యత్యాసాలను గుర్తించాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వ్యవసాయ పథకాల ద్వారా అందుతున్న సహాయం, సాధారణ పథకాల వ్యయంతో పోలిస్తే ఎంత మేరకు ఉందో స్పష్టమైన గణాంకాలతో నివేదికలు రూపొందించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న పథకాల నిబంధనల కారణంగా ప్రత్యేక అభివృద్ధి నిధులను పూర్తిస్థాయిలో వినియోగించలేని పరిస్థితులు ఉంటే, వాటిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

అవసరమైన చోట అర్హులైన ఎస్సీ రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చే ప్రత్యేక పథకాల రూపకల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖలు అమలు చేస్తున్న పథకాల లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించాలని ఆదేశించారు. సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యంత్రాల పంపిణీ వంటి పథకాలలో లబ్ధి పొందిన రైతుల పేర్లు, గ్రామాలు, సామాజిక వర్గాలు, అందించిన సహాయం తదితర వివరాలతో సమగ్ర జాబితాలను సిద్ధం చేయాలన్నారు. ప్రతి శాఖ తన పరిధిలోని పథకాల కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎంతమేర ప్రయోజనం అందించిందో స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. ఈ వివరాలను డిజిటల్ విధానంలో నమోదు చేసి, నిధుల వినియోగాన్ని నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ల నుంచి అందిన సమాచారం ప్రకారం రాష్ట్రంలో సుమారు 1,300ఎకరాల మేర ఖాళీగా ఉన్న భూమి అందుబాటులో ఉందని అధికారులు వివరించారు. ఈ భూమిని అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే అవకాశాలను పరిశీలించాలని, ఇప్పటికే గుర్తించిన స్థలాలను అర్హులైన కుటుంబాలకు అందించేందుకు అవసరమైన అనుమతులు, తదుపరి చర్యలను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. గృహ స్థలాలు లేని అర్హులైన కుటుంబాలకు స్థలాల కొనుగోలు కోసం భూసేకరణకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా పరిశీలించాలని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికలు వంటి మౌలిక సదుపాయాల అవసరాలను గుర్తించాలని భట్టి విక్రమార్క సూచించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి, వివిధ శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, మౌలిక సదుపాయాలను విస్తరించడం, విద్యుత్, గృహ వసతి, వైద్య సేవలను మెరుగుపరచడం ద్వారా సమగ్ర అభివృద్ధికి బాటలు వేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు, విద్యుత్ సదుపాయాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూచించారు. విద్యుత్ వైరింగ్, స్తంభాల ఏర్పాటు తదితర పనులను చేపట్టేలా కార్యాచరణ సిద్ధం చేస్తే, ఆయా ఆవాసాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని పేర్కొన్నారు. ఏజెన్సీ ఏరియాలో వైద్య సేవల విస్తరణకు మొబైల్ వైద్య యూనిట్ల ఏర్పాటుపై ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. వైద్యులు, అవసరమైన మందులను ప్రజలకు చేరువ చేయడం, అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్య సహాయం అందించడం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని అన్నారు. ఈ సమావేశంలో ఉన్నత అధికారులు నవీన్ మిట్టల్, సందీప్ కుమార్ సుల్తానియా, సురేంద్రమోహన్, సిక్తా పట్నాయక్, క్రిస్టినా, విజయేంద్ర బోయి, గోపి, గుగులోతు రవి నాయక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా నుంచి తరలి వెళ్లిన ఎస్పీడీసీఎల్ ఉద్యోగులు

ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణ విద్యుత్ సహాయక బృందాలు

- ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూల స్పందన
- సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి సహాయక బృందాలను పంపించేందుకు అధికారులకు ఆదేశాలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29:

తుఫాన్ ప్రభావంతో విద్యుత్ వ్యవస్థ దెబ్బతిని ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అండగా నిలిచేందుకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం మానవీయ దృక్పథంతో ముందడుగు వేసింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎపి విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవిలు గురువారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ఫోన్ చేసి తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన సహకారం అందించాలని కోరారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు.

తుఫాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను చంద్రబాబు నాయుడు భట్టి విక్రమార్కకు వివరించారు. తుఫాన్ కారణంగా పంటలకు నష్టం వాటిల్లడంతో పాటు విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 16 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, వందల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వివరించారు. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్తు సిబ్బంది, యంత్రాలు అవసరమని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వ సహాయాన్ని కోరారు. విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు టెక్నికల్ సహాయక బృందాలను, క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను త్వరగా పునరుద్ధరించేందుకు కావాలసిన యంత్రాలను సమకూర్చాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి విద్యుత్తు అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశాలు

తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన సహకారం అందించడానికి సహాయక బృందాలను పంపించాలని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు కోరిన విషయమై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సిఎం రేవంత్ రెడ్డితో చర్చించిన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు సహాయక బృందాలను పంపించాలని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఎన్ పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డిలను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరిన సహాయాన్ని అందించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

విపత్తు వేళ తెలుగు ప్రజలకు తెలంగాణ అండ

ప్రకృతి విపత్తుల సమయంలో ప్రాంతీయ భేదాలకు అతీతంగా బాధితులకు అండగా నిలవాలనే మానవీయ దృక్పథంతో తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. చంద్రబాబు నాయుడు చేసిన విజ్ఞప్తికి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించడం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదర భావానికి, ప్రజల మధ్య ఉన్న ఆత్మీయ బంధానికి నిదర్శనంగా నిలుస్తోంది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, ప్రజలకు సాధారణ జీవన పరిస్థితులను త్వరగా కల్పించేందుకు ఈసహకారం దోహదపడనుంది.

కాంగ్రెస్ ప్రభుత్వానికే హాలిడే ఇవ్వాలి

- ఓ వైపు పంటలు ఎండిపోతుంటే.. మూసీ సుందరీకరణ ఎందుకు?
- డీపీఆర్ లేకుండానే లక్షన్నర కోట్ల దోపిడీకి స్కెచ్
- మూసీ ప్రాజెక్టును వెంటనే ఆపి.. ఆ లక్షన్నర కోట్లతో ప్రజలను ఆదుకోవాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29:

420 హామీలకు హాలిడే.. ఆరు గ్యారెంటీలకు హాలిడే.. క్రాప్ హాలిడే, పవర్ హాలిడే, పీఆర్సీకి హాలిడే, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు హాలిడే.. ఇలా అన్నింటికీ హాలిడే ప్రకటించిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే మనం హాలిడే ఇస్తే దరిద్రం పోతుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడేమో రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పంటలు తామే కాపాడుకుంటామని రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన దుస్థితి నేడు తెలంగాణలో ఏర్పడిందని మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన కరువు వల్ల జెనరేటర్లు, ట్యాంకర్లతో తెలంగాణ రైతులు పంటల్ని కాపాడుకుంటున్నారని రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. రైతులు తమ పంటల్ని తామే తగలబెట్టుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్ని రంగాలకూ హాలిడే ప్రకటించిన కాంగ్రెస్‌కు ప్రజలే హాలిడే ఇవ్వాలి

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కరువు పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులు విడుదల చేయాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో చేపట్టిన ప్రాజెక్టును వెంటనే నిలిపివేసి, ఆ లక్షన్నర కోట్ల రూపాయలను ప్రజల సంక్షేమానికి, రైతుల ఉపశమనానికి వినియోగించాలని కోరారు. అన్ని పథకాలకు, అన్ని రంగాలకు హాలిడే ప్రకటిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు హాలిడే ఇస్తే రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోతుందని కేటీఆర్ పిలుపునిచ్చారు.

పంటలు ఎండిపోతుంటే.. లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ ఎందుకు?

సాగునీళ్లు లేక, కరెంట్ కోతలతో ఓవైపు పంటలు ఎండిపోతుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం కమీషన్ల కోసం మూసీ సుందరీకరణ జపం చేస్తున్నారని కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఎవరు అడిగారు మూసీ సుందరీకరణ? డీపీఆర్ లేకుండానే లక్షన్నర కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరుతో రేవంత్ రెడ్డి ఆడుతున్న డ్రామాలను వెంటనే బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి నివేదికలు, ప్రజల అంగీకారం లేకుండా తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్న ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ ఎలాంటి లాభం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఒకవైపు ప్రజలను నరకయాతనకు గురిచేస్తూ, హాలిడేల పేరుతో వారి జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీ నేతలు, రేవంత్ రెడ్డి తదితరులు కమీషన్లతో జాలీ డేస్ గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్టును వెంటనే ఆపి, ఆ లక్షన్నర కోట్లతో ప్రజలను ఆదుకోవాలని కోరారు.

రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ తెచ్చిన కరువు

రాష్ట్రంలో వర్షాలు లేక, కరువు పరిస్థితులు నెలకొని రైతాంగం అల్లాడిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో తాగు, సాగునీరు లేక రైతులు అల్లాడిపోతుంటే, ఖజానాలో పైసలు లేవని చెబుతూనే మూసీ సుందరీకరణ పేరుతో కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.

నీటి వృథాను అరికట్టేందుకు 'పానీ' యాప్

- ప్రతి పౌరుడూ వాటర్ వారియర్ కావాలి
- ప్రతి కుటుంబం 20 శాతం నీటి వినియోగం తగ్గించాలి : మంత్రి పొన్నం ప్రభాకర్
- నీటి దుర్వినియోగంపై ఫిర్యాదు చేయండి : మంత్రి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29:

భవిష్యత్తులో తాగునీటి కొరతను సమర్థంగా ఎదుర్కోవాలంటే నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబం నీటి వినియోగాన్ని కనీసం 20 శాతం తగ్గించుకోవాలని, ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ఒక 'వాటర్ వారియర్'గా మారాలని కోరారు. తాగునీటి వృథాను అరికట్టి, నీటి దుర్వినియోగాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు హైదరాబాద్ జలమండలి రూపొందించిన 'పానీ' మొబైల్ యాప్ (వాటర్ వారియర్స్)ను ఆయన జలమండలి ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ఒత్తిడి పెరగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. నీరు మనందరి ఉమ్మడి సంపదని, దాన్ని పొదుపుగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు.

ఫొటోతో ఫిర్యాదు.. వివరాలు గోప్యం

పరిసరాల్లో ఎక్కడైనా నీరు వృథా అవుతున్నా, తాగునీటిని దుర్వినియోగం చేస్తున్నా ప్రజలు PAANI యాప్ ద్వారా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి వివరించారు. ఆసక్తి ఉన్న పౌరులు ప్రభుత్వ గుర్తింపు పత్రంతో జలమండలి వెబ్‌సైట్‌లో Save Water Volunteerగా నమోదు చేసుకుని, అనంతరం గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. నీటి వృథాకు సంబంధించిన ఫొటోలను యాప్ ద్వారా పంపి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రతి ఫిర్యాదుకు ఎస్ఎంఎస్ ఆధారిత ధ్రువీకరణ ఉంటుందని, ఫిర్యాదు చేసిన వాలంటీర్ల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి జరిమానాలు విధిస్తారని వివరించారు. నీటి సంరక్షణలో చురుగ్గా పాల్గొనే ఉత్తమ వాలంటీర్లను ముఖ్యమంత్రి స్వయంగా కలిసి అభినందిస్తారని మంత్రి తెలిపారు. ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీ నుంచి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

తాగునీటిని వాహనాలు కడగడానికి వాడొద్దు

తాగునీటిని వాహనాలు కడగడానికి, ఫ్లోరింగ్ శుభ్రం చేయడానికి వినియోగించవద్దని మంత్రి సూచించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు పొంగిపొర్లకుండా చూసుకోవాలని, పైపుల లీకేజీలను వెంటనే అరికట్టాలని చెప్పారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టే వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో వర్షపు నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. గతంలో 2024 అక్టోబర్ 2న ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని, ప్రస్తుతం నీటి సంరక్షణ అవసరం మరింత పెరిగిందని తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి ఫామ్ పాండ్, ప్రతి గ్రామానికి ఊరుకుంట వంటి ఏర్పాట్ల ద్వారా నీటిని సంరక్షించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

నిర్మాణాలు, పరిశ్రమలకు శుద్ధి చేసిన నీరు

తాగునీటిపై ఒత్తిడిని తగ్గించేందుకు నిర్మాణ రంగం, పరిశ్రమలు, పార్కులు, గార్డెనింగ్ వంటి అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్‌టీపీ) ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని మంత్రి సూచించారు. భవన నిర్మాణాలకు అవసరమైన నీటిని సాధ్యమైనంత వరకు రీసైకిల్ చేసిన నీటి నుంచే సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నవంబర్ 1 నుంచి భవన నిర్మాణ అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. నగరంలో ఎస్‌టీపీల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, వాటి ద్వారా శుద్ధి చేసిన నీటిని సరైన విధంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో వాహనాల వాషింగ్ కేంద్రాల్లోనూ నీటి వినియోగాన్ని తగ్గించే ప్రత్యామ్నాయ విధానాలను ప్రోత్సహించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

బాహుదా ఉగ్రరూపం..

(మొదటిపేజీ తరువాయి) వద్ద రైల్వే ట్రాక్‌లపైకి నీరు చేరడంతో రైళ్ల రాకపోకలను నిలిపివేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 9 రైళ్లను రద్దు చేసి, మరో 14 రైళ్లను దారి మళ్లించింది. రద్దయిన రైళ్లలో భువనేశ్వర్–విశాఖపట్నం వందే భారత్, భువనేశ్వర్–విశాఖ ఇంటర్‌సిటీ, విశాఖ–సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లు ఉన్నాయి. నీటిమట్టం తగ్గి ట్రాక్, వంతెనలు సురక్షితమని అధికారులు నిర్ధారించిన తర్వాతే రైళ్ల రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

జలదిగ్బంధంలో గ్రామాలు.. పంటలకు నష్టం

బాహుదాతోపాటు వంశధార, నాగావళి, మహేంద్రతనయ నదులు కూడా ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాల్లోకి వరదనీరు చేరింది. కొన్నిచోట్ల ప్రజలు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. వేల ఎకరాల్లో వరి తదితర పంటలు నీటమునిగినట్లు సమాచారం. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని విద్యాసంస్థలకు కూడా సెలవు ప్రకటించారు. మరో రెండు రోజులపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రైళ్ల రద్దుతో వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన ప్రయాణికులకు రైల్వే అధికారులు ఆహారం, తాగునీరు అందిస్తున్నారు. అదనపు సిబ్బందిని నియమించి ప్రయాణికులకు సమాచారం, సహాయం అందిస్తున్నారు. వరద పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

మల్లన్న సాగర్ కట్ట సమీపంలో అక్రమ బ్లాస్టింగ్స్

- భద్రతపై హరీశ్ రావు ఆందోళన
- బ్లాస్టింగ్స్‌తో తిప్పారం గ్రామంలో ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని ఆరోపణ
- అనుమతులు లేకుండా పనులు చేస్తున్నారని విమర్శ
- అసైన్డ్ రైతులకు ఎకరాకు కనీసం రూ. 20 లక్షల పరిహారం చెల్లించాలని కోరిన మాజీ మంత్రి

సిద్దిపేట జిల్లా, వెలుతురు, అక్టోబర్ 29:

మల్లన్న సాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్) అధికారులు పైప్‌లైన్లు, పంప్‌హౌస్ నిర్మాణం కోసం అనుమతులు లేకుండా భారీ బ్లాస్టింగ్స్ నిర్వహిస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. ఈ పేలుళ్లతో రిజర్వాయర్ కట్ట భద్రతకు ముప్పు ఏర్పడటంతో పాటు సమీపంలోని తిప్పారం గ్రామంలో ఇళ్లు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

తిప్పారం గ్రామ సర్పంచ్ భద్రప్పతో పాటు గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు హరీశ్ రావు మల్లన్న సాగర్ వద్దకు చేరుకుని రిజర్వాయర్ కట్టను, బ్లాస్టింగ్స్ జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన వెంట దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, బక్కి వెంకటయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ మూసీ సుందరీకరణ కోసం మల్లన్న సాగర్ నుంచి నీటిని తరలించేందుకు సంపు, పంప్‌హౌస్ నిర్మాణ పనులు చేపడుతున్నారని తెలిపారు. అయితే, రిజర్వాయర్ కట్టకు కేవలం 150 మీటర్ల దూరంలోనే, సుమారు 16 నుంచి 20 మీటర్ల లోతున భారీ బ్లాస్టింగ్స్ చేస్తున్నారని ఆరోపించారు. ఇరిగేషన్ నిబంధనల ప్రకారం కట్ట ఎత్తుకు పది రెట్ల దూరం వరకు బ్లాస్టింగ్స్, నిర్మాణాలు చేపట్టకూడదని, మల్లన్న సాగర్ కట్ట ఎత్తు 40 మీటర్లు కావడంతో 400 మీటర్ల పరిధిలో ఇలాంటి పనులు చేయరాదని పేర్కొన్నారు.

ఇరిగేషన్, పోలీస్ శాఖల అనుమతులు లేకుండానే జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి గత రెండు మూడు నెలలుగా బ్లాస్టింగ్స్ నిర్వహిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ఈ పేలుళ్ల కారణంగా తిప్పారం గ్రామంలోని ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని, రాత్రివేళ మట్టి పెళ్లలు విరిగి పడుతున్నాయని, ఇంట్లోని వస్తువులు కింద పడుతున్నాయని గ్రామస్తులు తనకు వివరించినట్లు తెలిపారు.

బ్లాస్టింగ్స్ జరిగిన తర్వాత రిజర్వాయర్ కట్ట పక్కన సీపేజీ పెరిగిందని, కట్ట సమీపంలోని రాళ్లు కదిలి పడిపోయాయని గ్రామస్తులు చెబుతున్నట్లు పేర్కొన్నారు. కిలోమీటరు దూరంలో ఉన్న గ్రామంలోని ఇళ్లకే నష్టం జరుగుతుంటే, కేవలం 150 మీటర్ల దూరంలో ఉన్న రిజర్వాయర్ కట్ట పరిస్థితిపై ఆందోళన కలుగుతోందన్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో కట్ట భద్రతను నిపుణులైన ఇంజినీర్లతో పరిశీలించాలని డిమాండ్ చేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు ద్వారా పలు జిల్లాల్లోని 16,23,000 ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్‌తో సహా పది జిల్లాలకు తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఇలాంటి కీలక ప్రాజెక్టు భద్రతను ప్రమాదంలోకి నెట్టడం సరికాదన్నారు.

అసైన్డ్ రైతులకు పరిహారంలో అన్యాయం జరిగిందని ఆరోపణ

మల్లన్న సాగర్ సమీపంలో సుమారు 60 ఎకరాల భూసేకరణలో దళిత అసైన్డ్ రైతులకు అన్యాయం జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. కలెక్టర్, గజ్వేల్ ఆర్డీవో రైతులను బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసి ఎకరాకు రూ. 10 లక్షల పరిహారానికే అంగీకరించేలా చేశారని పేర్కొన్నారు.

2013 భూసేకరణ చట్టం ప్రకారం పట్టా రైతులు, అసైన్డ్ రైతులకు ఒకే విధమైన పరిహారం అందించాలని, పెరిగిన రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అసైన్డ్, పట్టా భూములనే తేడా లేకుండా ప్రతి రైతుకు ఎకరాకు కనీసం రూ. 20 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. పరిహారంపై అధికారులు తక్షణమే సమీక్షించకపోతే రైతుల పక్షాన బీఆర్ఎస్ ప్రత్యక్ష పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

బ్లాస్టింగ్స్ నిలిపివేయాలని డిమాండ్

మల్లన్న సాగర్ రిజర్వాయర్ భద్రతపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాస్తున్నట్లు హరీశ్ రావు తెలిపారు. మంత్రి తక్షణమే స్పందించి బ్లాస్టింగ్స్‌పై సమీక్ష నిర్వహించాలని, నిపుణులైన ఇంజినీర్లతో కట్టను పరిశీలించి భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.

అనుమతులు లేకుండా జరుగుతున్న బ్లాస్టింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని, తిప్పారం సర్పంచ్, గ్రామస్తుల ఫిర్యాదుపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి సంబంధిత కాంట్రాక్టర్, ఏజెన్సీపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రాహుల్ గాంధీ నాయకత్వంలో

నవంబర్ 1న 'చలో ఢిల్లీ'

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలిరావాలి
- టీపీసీసీ రాష్ట్ర నాయకులు పోలగాని వెంకటేష్ గౌడ్



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29 : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ రాష్ట్ర నాయకులు పోలగాని వెంకటేష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు."మన ఓటు.. మన హక్కు.. మన ప్రజాస్వామ్యం" అనే నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఐక్యతను చాటాలని ఆయన కోరారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, ఆ హక్కును పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పోలగాని వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రతి కాంగ్రెస్ కార్య కర్త అండగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఈ కార్యక్రమంలో యువత, పార్టీ నాయ కులు, కార్యకర్తలు ఉత్సాహంగా భాగస్వాములు కావా లని ఆయన విజ్ఞప్తి చేశారు.

టామ్‌కామ్‌ను టామ్‌స్కామ్‌గా మార్చారు

- బాధితులకు ఫీజులు తిరిగి చెల్లించాలి
- జాబ్ క్యాలెండర్ పేరుతో స్కాం క్యాలెండర్ నడుపుతున్నారు
- ఫేర్ స్ట్రీట్ కంపెనీపై కేసులు నమోదు చేయాలని డిమాండ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29 : తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, జాబ్ క్యాలెండర్‌కు బదులుగా స్కాం క్యాలెండర్‌ను అమలు చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టామ్‌కామ్ విదేశీ ఉద్యోగాల నియామక ప్రక్రియలో నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వాన్ని నమ్మి లక్షల రూపాయలు చెల్లించిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

టామ్‌కామ్ పేరుతో నిరుద్యోగులకు అన్యాయం

2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం విదేశీ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను బ్రోకర్ల మోసాల నుంచి రక్షించేందుకు టామ్‌కామ్‌ను ఏర్పాటు చేసిందని ప్రవీణ్ కుమార్ తెలిపారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ వ్యవస్థ ద్వారా అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా తదితర దేశాల్లో ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇచ్చి, ఒక్కో అభ్యర్థి నుంచి రూ.4.1 లక్షలు వసూలు చేశారని పేర్కొన్నారు. జర్మన్ భాష శిక్షణ అనంతరం బీ1 స్థాయి పరీక్ష కోసం అదనంగా రూ.20 వేలు చెల్లించాలని కోరినట్లు తెలిపారు. వందలాది మంది శిక్షణ పొందినా, పది మందిని కూడా జర్మనీకి పంపలేదని ఆరోపించారు. అభ్యర్థులతో చేసుకున్న ఒప్పందాల్లో టామ్‌కామ్ పేరు కాకుండా ఫేర్‌స్ట్రీట్ కంపెనీ పేరు ఉండటంపై అనుమానాలు వ్యక్తం చేశారు.

మంత్రి వివేక్‌పై చర్యలు తీసుకోవాలి

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో అభ్యర్థులకు ఇచ్చిన హామీలకు, వాస్తవంగా కల్పించిన పనులకు పొంతన లేదని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. టెక్నికల్ ఉద్యోగాలని చెప్పి ఇతర పనులు అప్పగించారని, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లిన కొందరు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. బాధితులు తమ డబ్బులు తిరిగి అడిగితే టామ్‌కామ్ అధికారులు ఫేర్‌స్ట్రీట్ కంపెనీని సంప్రదించాలని చెబుతున్నారని విమర్శించారు. అభ్యర్థులు ప్రభుత్వాన్ని నమ్మి డబ్బులు చెల్లించారని, కాబట్టి బాధితులందరికీ పూర్తి ఫీజులు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫేర్‌స్ట్రీట్ కంపెనీపై కేసులు నమోదు చేయడంతోపాటు, బాధితులను బెదిరిస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు కల్పించినట్లు చెబుతున్న ప్రభుత్వం, ఎవరికి, ఏ దేశంలో, ఎలాంటి ఉద్యోగాలు ఇచ్చిందో వివరాలు వెల్లడించాలని సవాల్ విసిరారు.

కార్మిక శాఖలో అవకతవకలపై విచారణ జరపాలి

కార్మిక శాఖలో రూ.150 కోట్ల బీమా వ్యవహారంలోనూ అవకతవకలు జరిగాయని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బతికున్న వారిని చనిపోయినట్లు చూపిస్తూ, నకిలీ ఎఫ్ఐఆర్‌లను అప్‌లోడ్ చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శించారు. ఈ ఆరోపణలపై మంత్రి వివేక్ ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. కార్మిక శాఖలో ఔట్‌సోర్సింగ్ నియామకాల కోసం ఒకే ఏజెన్సీకి ప్రాధాన్యం ఇవ్వడంపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ ఏజెన్సీ అర్హతలు, అనుభవం, ఎంపిక విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడంతోపాటు, చట్టపరమైన పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం వద్ద నిధులు లేకపోతే మంత్రి వివేక్ తన వ్యాపార సంస్థల నుంచి అయినా బాధితులకు డబ్బులు చెల్లించాలని వ్యాఖ్యానించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో నిరుద్యోగులు కాంగ్రెస్ నేతలను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తుంగబాలు, నారాయణ, రఘురాం, అరుణ, యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్లు

- నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేసుకోవాలి : మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29 : కోకాపేటలో మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించిన నేపథ్యంలో, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కల్చరల్ సెంటర్‌లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ధన్యవాదాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, వినయ్ కుమార్, బొంతు రామ్మోహన్, గాలి అనిల్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించిందని, నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేసుకోవాలని సూచించారు. అదనంగా నిధులు కేటాయించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. కులంలో ఐక్యత ఉండాలని, ఉన్నత స్థాయిలో ఉన్నవారు కుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని అన్నారు. తాను వేములవాడకు వెళ్లినప్పుడు మున్నూరు కాపు సత్రంలోనే బస చేసేవాడినని గుర్తుచేశారు. దాతల సహకారంతో 40 ఏసీ గదులతో వేములవాడలో గౌడ సత్రాన్ని నిర్మించామని, అది అందరికీ ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.మున్నూరు కాపు కార్పొరేషన్ ద్వారా యువతలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు, స్వయం ఉపాధి శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. త్వరలో రాజీవ్ యువ వికాసం పథకం ప్రారంభం కానుందని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కులవృత్తుల్లోనూ మార్పులు రావాలని సూచించారు.రాష్ట్రంలో కులగణన నిర్వహించామని, జనాభాకు సంబంధించి ప్రామాణిక లెక్కలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. కుల సర్వే నివేదిక ఆధారంగా పరిశీలించినప్పుడు ఉన్నత విద్య అభ్యసించిన కుటుంబాలు ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్నట్లు వెల్లడైందన్నారు.గుజరాత్‌లోని పాటీదార్ భవన్‌లో యువతకు నాణ్యమైన శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు చేపడుతున్నామని, తమ పిల్లలకు నాణ్యమైన శిక్షణ ఇప్పించాలని కోరారు.ముఖ్యమంత్రి చెప్పినట్లుగా, గతంలో మాదిరిగా ప్రజలకు ఆస్తులు, భూములు పంచేందుకు ప్రభుత్వానికి ప్రస్తుతం తగినంత భూమి, ధనం లేవని, భవిష్యత్తుకు ఉపయోగపడే పెట్టుబడి విద్య మాత్రమేనని మంత్రి పేర్కొన్నారు. కులంలో రాజకీయ చైతన్యం పెరగాలని, అందరూ ఐక్యంగా ఉండి అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

డిప్యూటీ సీఎంకు 'శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం'

ఆహ్వాన పత్రిక అందజేత

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29 : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆయన నివాసమైన ప్రజాభవన్‌లో 'శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం' ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా నవంబర్ 4న జరగనున్న సదర్ సమ్మేళన ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. నవంబర్ 4వ తేదీన లోయర్ ట్యాంక్‌బండ్ వద్దగల ఎన్టీఆర్ స్టేడియంలో ఉదయం 11:00 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు యాదవ సోదరుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు డిప్యూటీ సీఎంకు వివరించారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు కార్పొరేటర్ శంకర్ యాదవ్, పాండు యాదవ్, ప్రసాద్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, రాజేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక ఫోకస్

- 77 నియోజకవర్గాలకు 233 మంది ఇన్‌చార్జిల నియామకం
- కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యాచరణ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29 : నల్లగొండ--వరంగల్--ఖమ్మం, రంగారెడ్డి--హైదరాబాద్--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ వికలాంగుల విభాగం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల పరిధిలోని 77 నియోజకవర్గాలకు మొత్తం 233 మంది ఇన్‌చార్జిలను నియమించినట్లు కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం చైర్మన్ ముట్టినేని వీరయ్య తెలిపారు.ఈ సందర్భంగా గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షులు, గౌరవ ఎమ్మెల్సీ శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు, సభ్యత్వ నమోదు కోసం కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం చేపడుతున్న చర్యలను వివరించారు.ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షులు వికలాంగుల విభాగం చేస్తున్న కృషిని అభినందిస్తూ, క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. పార్టీ వార్‌రూమ్, కనెక్ట్ సెంటర్‌తో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని, పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలుగా నియమితులైన ప్రతి ఒక్కరూ వికలాంగ పట్టభద్రులతో పాటు ఇతర పట్టభద్రుల ఓటర్ల నమోదు, సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ముట్టినేని వీరయ్య పిలుపునిచ్చారు. పార్టీ నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా సమన్వయంతో పనిచేస్తూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి క్షేత్రస్థాయిలో విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు.

రాహుల్ సభకు సంగారెడ్డి సై

కార్యకర్తల బస్సులను జెండా ఊపి ప్రారంభించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 29: నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగే రాహుల్ గాంధీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో బయలుదేరారు. సంగారెడ్డి ఐబీ వద్ద బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. సదాశివపేట మండలం నుంచి సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిద్దన్న, శ్రీనివాస్ యాదవ్‌లతో కలిపి మొత్తం 46 మంది బయలుదేరారు. కొండాపూర్ మండలం నుంచి ఆత్మ చైర్మన్ ప్రభు, నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డిలతో కలిపి 26 మంది ఢిల్లీ పయనమయ్యారు.నిర్మల జగ్గారెడ్డి, భరత్ సాయిరెడ్డిలతో సహా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి మొత్తం 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరుకానున్నారు. బస్సుల ప్రారంభ కార్యక్ర మంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, బబ్బు తదితరులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమేనా?

-నిబంధనల పాలన సూచీలో భారత్ 88వ స్థానం.. రాజ్యాంగ విలువలకు పరీక్ష!

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు నిర్వహించడం మాత్రమే కాదు.. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం రాజ్యాంగానికి లోబడి పాలించడం, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవడం, చట్టం ముందు అందరినీ సమానంగా చూడటం, పౌరుల హక్కులను కాపాడటం, సామాన్యుడికి సకాలంలో న్యాయం అందించడం! ఈ ప్రమాణాలపై భారత పాలనా వ్యవస్థను అంతర్జాతీయ సూచీ మరోసారి పరిశీలనకు నిలిపింది. ప్రపంచ నిబంధనల పాలన సూచీ--2026లో భారత్ 143 దేశాలు, అధికార పరిధుల్లో 88వ స్థానానికి పడిపోయింది. గత ఏడాది 86వ స్థానంలో ఉన్న భారత్ రెండు స్థానాలు దిగజారింది. మొత్తం స్కోరు 0.49 నుంచి 0.48కు తగ్గింది. అక్టోబరు 21న విడుదలైన ప్రపంచ న్యాయ ప్రాజెక్టు నివేదికలోని ఈ గణాంకాలు దేశ పాలనా వ్యవస్థలోని బలాలు, బలహీనతలను సమీక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి.భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా గర్వపడుతుంది. రాజ్యాంగం పౌరులకు ప్రాథమిక హక్కులను కల్పించింది.

స్వతంత్ర న్యాయవ్యవస్థ, శాసనసభలు, ఎన్నికల సంఘం, సమాచార హక్కు, న్యాయ సమీక్ష వంటి వ్యవస్థలు ప్రజాస్వామ్యానికి రక్షణ కవచాలుగా ఉన్నాయి. అయినప్పటికీ ఈ సంస్థలు కాగితాలపై ఉండటం ఒక్కటే సరిపోదు. వాటి స్వతంత్రత, పనితీరు, ప్రజలకు అందుతున్న ఫలితాలే అసలు ప్రమాణాలు. చట్టాలు ఉన్నాయా అనేదానికంటే అవి ఎంత నిష్పక్షపాతంగా అమలవుతున్నాయి? హక్కులు ఉన్నాయా అనేదానికంటే వాటిని వినియోగించుకునే అవకాశం అందరికీ సమానంగా ఉందా? న్యాయస్థానాలు ఉన్నాయా అనేదానికంటే పేదవాడికి కూడా న్యాయం అందుబాటులో ఉందా? అన్న ప్రశ్నలే కీలకం.ప్రపంచ న్యాయ ప్రాజెక్టు సూచీ ప్రభుత్వ అధికారాలపై పరిమితులు, అవినీతి నియంత్రణ, బహిరంగ పాలన, ప్రాథమిక హక్కులు, శాంతిభద్రతలు, నియంత్రణ అమలు, పౌర న్యాయం, క్రిమినల్ న్యాయం అనే ఎనిమిది అంశాలను పరిశీలిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 2.15 లక్షలకు పైగా కుటుంబ సర్వేలు, 3,400 మంది న్యాయ నిపుణులు, ఇతర రంగాల నిపుణుల అభిప్రాయాల ఆధారంగా ఈ సూచీ రూపొందుతుంది. స్కోరు సున్నా నుంచి ఒకటి వరకు ఉంటుంది; ఒకటికి దగ్గరగా ఉంటే నిబంధనల పాలన మరింత బలంగా ఉన్నట్లు అర్థం. అయితే ఇది ఒక అంతర్జాతీయ అంచనా సాధనం మాత్రమే. ఒక్క ర్యాంకుతోనే దేశంలోని ప్రతి న్యాయస్థానం పనితీరును, ప్రతి ప్రభుత్వ శాఖను లేదా ప్రతి పౌరుడి అనుభవాన్ని నిర్ణయించలేం. అయినప్పటికీ విధానపరమైన లోపాలను గుర్తించడానికి ఇది ఉపయోగపడుతుంది. భారత్ ఉపసూచీలను పరిశీలిస్తే పరిస్థితి మరింత స్పష్టమవుతుంది. బహిరంగ పాలనలో 45వ స్థానం, ప్రభుత్వ అధికారాలపై పరిమితుల్లో 64వ స్థానం సాధించడం కొంత మెరుగైన అంశాలు. కానీ అవినీతి నియంత్రణలో 96వ స్థానం, ప్రాథమిక హక్కుల్లో 103వ స్థానం, శాంతిభద్రతల్లో 115వ స్థానం, పౌర న్యాయంలో 116వ స్థానం, క్రిమినల్ న్యాయంలో 90వ స్థానం ఆందోళన కలిగించే అంశాలు. నియంత్రణల అమలులో భారత్ 77వ స్థానంలో ఉంది. ముఖ్యంగా పౌర న్యాయంలో వెనుకబాటుతనం సామాన్యుల జీవితాలను నేరుగా ప్రభావితం చేసే సమస్యలను ముందుకు తెస్తోంది. ఒక భూమి వివాదం పరిష్కారం కావడానికి ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తే, చిన్న వ్యాపారి తనకు రావాల్సిన బకాయిల కోసం న్యాయపోరాటం చేయలేకపోతే, కుటుంబ హింసకు గురైన మహిళకు రక్షణ పొందడం కష్టమైతే, కార్మికుడికి వేతనం అందక న్యాయం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే చట్టం ఉన్నదనే భరోసా మాత్రమే అతనికి సరిపోదు. న్యాయం అందుబాటులో ఉండాలి, ఖర్చు భరించగలిగేలా ఉండాలి, నిర్ణయం సకాలంలో రావాలి. న్యాయం ఆలస్యమైతే బాధితుడికి నష్టం మాత్రమే కాదు, వ్యవస్థపై విశ్వాసం కూడా దెబ్బతింటుంది. అవినీతి నియంత్రణలో 96వ స్థానం కూడా సమగ్ర చర్యల అవసరాన్ని సూచిస్తోంది. ప్రభుత్వ కార్యాలయంలో చిన్న పని కోసం లంచం అడగడం నుంచి పెద్ద స్థాయి ఆర్థిక అక్రమాల వరకు అవినీతి ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. పారదర్శకమైన టెండర్లు, ప్రభుత్వ కొనుగోళ్ల వివరాల వెల్లడింపు, స్వతంత్ర దర్యాప్తు సంస్థల సమర్థత, ఫిర్యాదుదారుల రక్షణ, దోషులకు సకాలంలో శిక్ష వంటి చర్యలు బలపడాలి. అవినీతి ఆరోపణ వచ్చినంత మాత్రాన ఎవరినీ దోషిగా ప్రకటించలేం; అదే సమయంలో ఆరోపణలను నిష్పక్షపాతంగా విచారించకుండా వదిలేయడమూ సరికాదు. చట్టం రాజకీయ అనుబంధం, హోదా, ఆర్థిక స్థితి ఆధారంగా మారకూడదు.

ప్రాథమిక హక్కుల్లో భారత్ 103వ స్థానంలో ఉండటం మరింత ఆత్మపరిశీలన కోరుతోంది. భావప్రకటనా స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, వివక్షకు వ్యతిరేక రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి రాజ్యాంగ హామీలు ప్రజాస్వామ్యానికి ప్రాణం. ప్రభుత్వాన్ని విమర్శించడం శత్రుత్వంగా భావించకూడదు. అదే సమయంలో హక్కుల పేరుతో హింసను లేదా చట్టవిరుద్ధ చర్యలను సమర్థించలేం. హక్కుల పరిరక్షణ, చట్టబద్ధమైన బాధ్యతల అమలు రెండూ సమతుల్యంగా సాగాలి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్వరం బలహీనపడితే అధికార దుర్వినియోగాన్ని గుర్తించడం కూడా కష్టమవుతుంది. ఇక్కడ ప్రభుత్వానిదే కాకుండా న్యాయవ్యవస్థ, పోలీసు వ్యవస్థ, శాసనసభలు, స్థానిక సంస్థలు, పౌర సమాజం, మీడియా అందరిదీ బాధ్యత. పోలీసు దర్యాప్తులు నిష్పక్షపాతంగా సాగాలి. విచారణ ఖైదీల హక్కులు కాపాడాలి. న్యాయస్థానాల్లో ఖాళీలను భర్తీ చేయాలి; కేసుల పెండింగ్‌ను తగ్గించేందుకు సాంకేతికతతోపాటు మానవ వనరులను పెంచాలి. ఉచిత న్యాయ సహాయం నిజంగా అర్హులైన పేదలకు చేరాలి. సమాచార హక్కు ద్వారా ప్రజలకు ప్రభుత్వ నిర్ణయాలు, నిధుల వినియోగం, పథకాల అమలుపై వివరాలు అందుబాటులో ఉండాలి. నిబంధనల పాలన అనేది కేవలం న్యాయశాఖకు సంబంధించిన అంశం కాదు. పెట్టుబడిదారులు వ్యాపారం ప్రారంభించడానికి, చిన్న పరిశ్రమలు విస్తరించడానికి, ఉద్యోగాలు సృష్టించడానికి, ప్రజలు తమ హక్కులపై నమ్మకంతో జీవించడానికి స్థిరమైన చట్టపరమైన వాతావరణం అవసరం. చట్టాలు స్పష్టంగా ఉండి, అందరికీ సమానంగా అమలైతే ఆర్థిక కార్యకలాపాలకు విశ్వాసం పెరుగుతుంది. అదే విధంగా న్యాయం ఆలస్యం, అవినీతి, అనిశ్చితమైన నియంత్రణలు ప్రజలకూ వ్యాపారాలకూ అదనపు భారాన్ని మోపుతాయి. భారత్ ర్యాంకు రెండు స్థానాలు దిగజారిందని మాత్రమే ఆందోళన చెందడం సరిపోదు; దాన్ని రాజకీయ విమర్శలకు ఆయుధంగా మార్చడం కూడా పరిష్కారం కాదు. ఈ సూచీని ఆధారంగా తీసుకుని ఏ రంగాల్లో మెరుగుదల అవసరమో గుర్తించి, కొలవగల లక్ష్యాలతో సంస్కరణలు చేపట్టాలి. ప్రతి ఏడాది స్కోరు ఎలా మారింది? కేసుల పరిష్కారానికి పట్టే సమయం తగ్గిందా? అవినీతి ఫిర్యాదులపై చర్యలు పెరిగాయా? పోలీసు దర్యాప్తుల నాణ్యత మెరుగైందా? పౌర హక్కుల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలకు ప్రభుత్వాలు గణాంకాలతో సమాధానం చెప్పాలి. రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన హక్కులు పాలకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకూడదు. చట్టం ముందు సామాన్యుడికీ శక్తిమంతుడికీ ఒకే ప్రమాణం ఉండాలి. న్యాయం కొనగలిగినవారికే కాదు, న్యాయం కోసం ఎదురుచూసే ప్రతి పౌరుడికీ అందాలి. ప్రపంచ నిబంధనల పాలన సూచీలో 88వ స్థానం భారత్ ప్రజాస్వామ్యానికి అంతిమ తీర్పు కాదు; కానీ నిర్లక్ష్యం చేయదగిన హెచ్చరిక కూడా కాదు. ఎన్నికల్లో గెలవడం ప్రభుత్వానికి అధికారం ఇస్తుంది.. రాజ్యాంగానికి లోబడి పాలించడం ఆ అధికారానికి నైతికతను ఇస్తుంది. అధికారం చట్టానికి లోబడినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది; న్యాయం అందరికీ అందినప్పుడే రాజ్యాంగం నిజమైన అర్థంలో జీవిస్తుంది!

-కాలగిరి శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్, సెల్: 9010128884)

ధర్మ సంస్థాపనకై శ్రమించిన తాపసి దయానంద సరస్వతి

అక్టోబర్ 30... దయానంద సరస్వతి వర్ధంతి

నవీన భారతదేశ సంస్కర్తలలో అగ్రగణ్యుడు దయానంద స్వరాజ్ నినాదాన్ని తొలిసారి నినదించి భారతీయుల మనసులలో చొప్పించిన దేశభక్తుడు దయానంద సరస్వతి జయంతి. స్వామి దయానంద సరస్వతి (ఫిబ్రవరి 12, 1824 – అక్టోబర్ 30, 1883) ఆర్య సమాజ్ స్థాపకుడు, అజ్ఞా నాంధకారం, దారిద్ర్యం, అన్యాయన్ని ఎదురించి పోరాడిన ముని. హిందు ధర్మ సంస్థాపనకు నడుం బిగించిన ఋషి. 1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించి, ఎందరో స్వాతంత్ర్య సమర యోధులకు ప్రేరణ అయిన దేశ భక్తుడు. భారతదేశం భారతీయులకే అనే "స్వరాజ్" నినాదాన్ని మొదటి సారిగా ప్రవచించినది ఆయనే. వేదాలను అంత చక్కగా అధ్యయనం చేసిన వారు భారత దేశంలో మరొకరు లేరు అని ఈయన గురించి స్వయంగా అ-రవిందుల వారే అన్నారు. దయానంద సరస్వతి ఫిబ్రవరి 12, 1824లో గుజరాత్ లోని ఠంకార అనే గ్రామంలో ఒక వర్తక కుటుంబంలో జన్మించారు. ఆయన అసలు పేరు మూలశంకర్. ఆయన తండ్రి ఒక మహా శివ భక్తుడు. పద్నాలుగేళ్ల ప్రాయంలో ఒక శివరాత్రి నాడు శివలింగంపై విసర్జిస్తున్న మూషి కాలను చూసి, ధర్మం పేరిట జరిగే మోసాలు మూఢనమ్మకాలు గ్రహించి 1846లో భగవంతుడిని వెతకడానికి ఇల్లు వదిలి వెళ్లారు. ఆ ప్రయాణంలో ఎందరో యోగులు మునుల సాంగత్యంలో గడిపి దయానంద అన్న నామం పొందారు. భగవంతుని తపనలో భ్రమిస్తూ మథురలోని స్వామి విరజానంద సరస్వతి వద్దకు చేరుకున్నారు. అక్కడే వేదోపనిషత్తులను ఔపోసనం పట్టి గురువు ఆజ్ఞ మేరకు దేశమంతట ప్రబోధించుటకు బయలు దేరారు. ఆయన తన వాదనలను, ఉద్యమాన్ని సమర్థిస్తూ అథర్వణ, యజుర్వేదం వంటివి భాష్యం చేసిన వేద భాష్యకారుడైనారు. ప్రయాణ మార్గమున దేశ స్థితిగతులు, దీనమైన శోచనీయమైన హిందు సమాజమును అవగాహన చేసుకున్నారు. భారతావని బ్రిటిష్ పాలనలో ఉంది. ఒకప్పుడు విశ్వమానవ సామ్రాజ్యానికి, ధర్మ సంస్కృతులకు కేంద్రమైన భారతదేశం ఆ సమయం లో అపారమైన దరిద్రంలో స్వయం వినాశనానికి పరుగులి డుతుండడం చూసి శోకించారు. హిందు సమాజం ఎటువైపు నుండి చూసినా కుల, మత వర్గ విభేదాలతో ఖండములగు చుండడాన్ని చూసి చలించిపోయారు. అంధ విశ్వాసం, అంటరానితనం, సతి, బాల్య వివాహాలు ధర్మం పేరుతో జరుగుతున్న అవాంఛనీయమైన ఆచారాలు చూసి ఆవేదనకు గురై, వాటిని ఛేదించడానికి 'పాఖండ ఖండిని ' అన్న పతాకాన్ని ఆవిష్కరించారు. భారత దేశాన్ని, హిందు సమాజాన్ని జాగృత పరచాలని సంకల్పించి ఎన్నో పురోగామి సంస్కరణలు చేపట్టారు. అందులో భాగంగా సతి, బాల్య వివాహాలు, అంటరానితనం, వరకట్న దురాచారాన్ని బహిష్కరించారు. స్త్రీ విద్య పరిచయం చేసారు. ధర్మ సంస్థాపనకు శాశ్వత సంస్థగా, దేశ సంఘ సంస్కరణకు పునాదిగా, 10 ఏప్రిల్ 1875 న ముంబాయి నగరంలో మొదటి ఆర్యసమాజము స్థాపించారు. మేడంకామా, గురుదత్ విద్యార్థి, వినాయక్ దామోదర్ సావర్కార్, లాలా హర్‌దయాళ్, మదన్‌లాల్ ధింగ్రా, రాంప్రసాద్ బిస్మల్, మాహాదేవ గోవిందరనడే, స్వామి శ్రద్ధానంద, మహాత్మా హంసరాజ్, లాలా లజపతిరాయ్ తదితరులు ఆయనచే ప్రభావితు లైనారు. ఆయన రచించిన సత్యార్థ ప్రకాష్ గ్రంథం సుప్రసిద్ధమైనది. మత మార్పిడిలు చేసిన వారిని తిరిగి హిందూ మతంలోకి రప్పించడానికి శుద్ధి ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో దయానంద సరస్వతి పెక్కుమందికి కంట్లో నలుసు అయినారు. ఏడు సార్లు విష ప్రయోగాలు జరిగిననూ బస్తి, న్యోళి అనే యోగ ప్రక్రియ ద్వారా ప్రేగులను ప్రక్షాళనము చేసుకుని వాటిని విఫలము చేసినను, చివరి సారిగా అక్టోబర్ 30, 1883 దీపావళి సాయంత్రము జరిగిన విష ప్రయోగంతో క్షీణిస్తూ ఓంకార నాదంతో సమాధి అవస్థలో మోక్షాన్ని పొందారు. 30 అక్టోబరు, 1883న దయానంద సరస్వతి మరణించారు.

-రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్

భారతదేశ అణు శక్తి పితామహుడు

హోమీ జహంగీర్ భాభా

అక్టోబర్ 30... హెచ్ జె భాభా జయంతి

హోమీ జహంగీర్ భాభా భారతదేశ అణు శక్తి రంగానికి పునాది వేసిన గొప్ప శాస్త్రవేత్త. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, అణుశక్తిని శాంతియుత విధానాల్లో వాడేలా మార్గదర్శకత్వం చేసిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందాడు. ఆయన భారత దేశపు అణు శక్తి పితామహుడు అని సత్కరించ బడ్డాడు. హోమీ భాభా 1909 అక్టోబరు 30 న బొంబాయి లోని (ముంబై) సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పటి నుంచే ఆయనకు చదువు, శాస్త్రాల మీద ఆసక్తి ఉండేది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఆయన చదువులో ప్రతిభ చూపాడు. హోమీ భాభా తన ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాల యానికి వెళ్లాడు. అక్కడ రాధర్‌ఫోర్డ్ లేబొరేటరీలో శాస్త్రవేత్తలతో కలిసి కేంద్రక భౌతిక శాస్త్రం (చీబషశ్రీమ్రుతీూష్త్రఎంఅఎం) రంగంలో తన పరిశోధనలను ప్రారంభిం చాడు. కేంబ్రిడ్జ్‌లో ఉన్నత స్థాయి విద్యను పొందిన తరువాత, ఆయన పరిశోధనల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో, భాభా అమెరికాలోని మాంహట్టన్ ప్రాజెక్ట్‌లో కూడా పాల్గొన్నాడు. ఈ ప్రాజెక్ట్ ప్రపంచపు మొట్టమొదటి అణుబాంబు అభివృద్ధికి సంబంధించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆయనకు అణు శక్తి రంగంలో ఉన్న విస్తృత అవకాశాలపై అవగాహన పెరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత భాభా భారత దేశానికి తిరిగి వచ్చాడు. దేశానికి సేవ చేయాలనే తపనతో, భారత దేశంలో శాస్త్రీయ పరిశోధనలు అభివృద్ధి చెందాలన్న ఆశయంతో ముందుకు సాగాడు. దేశంలో సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం భాభా టాటా ట్రస్ట్ సహకారంతో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌ను 1945లో స్థాపించాడు. ు×ఖీ= భారతదేశంలో ప్రాథమిక శాస్త్ర, భౌతిక శాస్త్ర, అంతరిక్ష పరిశోధనలు మొదలైన రంగాల్లో ముఖ్య భూమికను పోషించింది. 1948లో భారత దేశం అణు శక్తి రంగంలో ముందుండాలని భావించి అణుశక్తి కమిషన్ను స్థాపించాడు. ఈ కమిషన్ ద్వారా అణుశక్తి పరిశోధనలకు బలమైన పునాది వేసి, శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తి వినియోగం ఎలా ఉండాలో ప్రణాళికలు రూపొందించాడు. ఆయన అణుశక్తిని విద్యుత్ ఉత్పత్తి, వైద్యం, వ్యవ సాయం వంటి రంగాల్లో వినియోగించడానికి మార్గదర్శకత్వం అందించాడు. 1954లో, ముంబై సమీపంలోని ట్రాంబేలో భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్ ను స్థాపించాడు. ఈ సంస్థ అణుశక్తి పరిశోధనలకు కేంద్రంగా మారింది. దీూ=జ ద్వారా స్వదేశీ అణు శక్తి పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఆయా విధానాలను అనుసరించి, అణు శక్తిని విద్యుత్ ఉత్పత్తిలో వినియోగించే విధంగా ప్రణాళికలు రూపొందించాడు. భాభా అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధిని కోరుకున్నాడు. ఆయన ప్రణాళికలు భారతదేశం అణుబాంబును అభివృద్ధి చేయడానికి బాటలు వేశాయి. భారత దేశానికి అత్యవసర సమయంలో సైనిక శక్తిని ప్రదర్శించడానికి అణు శక్తి అవసరమని, అలాగే దీన్ని శాంతియుత కార్యక్రమాల్లో కూడా ఉపయోగించవచ్చని ఆయన భావించాడు. భారత దేశానికి అణు శక్తి రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. ఇది భారత శాస్త్రజ్ఞులకు ఆయన అందించిన ప్రేరణకు గుర్తింపు లాంటిది. భారతదేశపు అణు శక్తి కార్యక్రమానికి చేసిన కృషిని గుర్తిస్తూ, ఆయనను భారతదేశపు అణు శక్తి పితామహుడు అని సత్కరించారు. ఆయన నిరంతరం శాస్త్రీయ అభివృద్ధి కోసం ప్రయత్నించి, దేశానికి శక్తి స్వావలంబనను అందించే ప్రయత్నం చేశారు. భాభా స్థాపించిన ు×ఖీ= మరియు దీూ=జ సంస్థలు ఇప్పటికీ భారతదేశంలో శాస్త్రీయ పరిశోధనలకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. ఆయన అభిప్రాయాలే దేశానికి శక్తి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థితిని తెచ్చాయి. భారతదేశం అణు శక్తి రంగంలో ప్రగతిని సాధించడానికి ఆయన చూపిన మార్గం నేటి వరకు మార్గదర్శకంగా నిలిచింది. హోమీ జహంగీర్ భాభా భారతదేశంలో అణు శక్తి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాడు. ఆయన దృష్టి, పట్టుదల, మరియు శాస్త్రీయ దార్శనికత భారతదేశాన్ని అణు శక్తి రంగంలో ప్రపంచ పటంలో నిలిపింది.

-రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

గోదావరి పారుతోంది..

తెలంగాణ ఎందుకు ఎండుతోంది?

ప్రాజెక్టులున్నా రైతుకు నీటి కష్టాలా?
జలాల లెక్కలు చెప్పాలి..
పాలన మేల్కొనాలి!

గోదావరి పారుతున్నా.. గోరంత నీటికై రైతు ఎదురుచూపులెందుకు? ప్రాజెక్టులున్నా పొలాలు ఎండిపోవడమెందుకు? జలాల లెక్కలు ప్రజలకు తెలియకపోవడమెందుకు? నడులున్న తెలంగాణలో రైతు కన్నీటికి పరిష్కారమెప్పుడు? కరువు ప్రకృతి పరీక్ష.. నీటి నిర్వహణ పాలనకు అగ్నిపరీక్ష! ఒకవైపు భారీ ప్రాజెక్టులు, బ్యారేజీలు, ఎత్తిపోతల పథకాలు.. మరోవైపు ఎండుతున్న పొలాలు, తగ్గుతున్న సాగు విస్తీర్ణం, ఆందోళనలో అన్నదాతలు! వర్షాన్ని నియంత్రించడం ప్రభుత్వానికి సాధ్యం కాకపోవచ్చు. కానీ అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా నిల్వ చేయడం, అవసరాలను బట్టి పంపిణీ చేయడం, నీటి కొరతను ముందుగానే అంచనా వేసి ప్రత్యామ్నాయాలు సిద్ధం చేయడం మాత్రం పాలనా బాధ్యత. ప్రాజెక్టుల నిర్మాణంతోనే బాధ్యత ముగియదు.. వాటి ప్రయోజనం రైతు పొలానికి చేరినప్పుడే సార్థకత!

2026 అక్టోబరు చివరి వారంలో వెలువడిన వార్తా నివేదికల ప్రకారం, తెలంగాణలోని 31 జిల్లాల్లో 365 మండలాలను వానాకాలం కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. వీటిలో 111 మండలాలు తీవ్ర కరువు, 254 మండలాలు మధ్యస్థ కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. జూన్ నుంచి సెప్టెంబరు వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 740.6 మి.మీ. కాగా, 615.5 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే 17 శాతం లోటు. ఇదే సమయంలో వానాకాలం పంటల సాగు విస్తీర్ణం 139.28 లక్షల ఎకరాల నుంచి 126.06 లక్షల ఎకరాలకు తగ్గింది. వరి సాగు విస్తీర్ణం 69.19 లక్షల ఎకరాల నుంచి 57 లక్షల ఎకరాలకు పడిపోయింది. ఇవి కేవలం గణాంకాలు కావు.. రైతు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడికి సూచనలు. కరువు మండలాల్లో రైతులకు నీరు, పంట నష్టపరిహారం, పెట్టుబడి సాయం, పశువులకు మేత వంటి అవసరాలపై ప్రభుత్వం ఎంత వేగంగా స్పందిస్తుందన్నదే ఇప్పుడు ముఖ్యం.

తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారిక వివరాల ప్రకారం, గోదావరి నదిలో రాష్ట్రానికి 967.94 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ హక్కు ప్రతి ఏడాది అంతే పరిమాణంలో నీరు అందుబాటులో ఉంటుందని అర్థం కాదు. నదీ ప్రవాహాలు, నీటి కేటాయింపులు, తాగునీటి అవసరాలు, పర్యావరణ పరిమితులు, ప్రాజెక్టుల నిల్వ సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, కాళేశ్వరం పరిధిలోని బ్యారేజీలు, దేవాదుల వంటి పథకాలు రాష్ట్ర జలవనరుల నిర్వహణలో కీలకమైనవి. అయితే ప్రాజెక్టు సామర్థ్యం వేరు.. ప్రస్తుత నిల్వ వేరు.. సాగునీటికి విడుదల చేయగల నీరు వేరు. ప్రతి ప్రాజెక్టులో ఎంత నీరు అందుబాటులో ఉంది? ఎంత సాగుకు విడుదల చేయవచ్చు? అనే వివరాలను ప్రభుత్వం తేదీతో సహా ప్రజలకు వెల్లడించాలి.

ప్రతి ప్రాజెక్టులో ప్రస్తుతం ఎంత నీరు ఉంది? ఈ వానాకాలంలో ఎంత వచ్చి చేరింది? ఎంత నీటిని సాగుకు, ఎంత తాగునీటికి విడుదల చేశారు? కాలువల చివరి ఆయకట్టు వరకు నీరు చేరిందా? ఎత్తిపోతల కేంద్రాలు, పంపింగ్ వ్యవస్థలు పనిచేస్తున్నాయా? నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న గ్రామాలు, చెరువులెన్ని? ఈ ప్రశ్నలకు గణాంకాలతో సమాధానాలు రావాలి. గోదావరి నీటిని ప్రతి చెరువుకూ నేరుగా మళ్లించడం సాధ్యం కాకపోవచ్చు. భౌగోళిక పరిస్థితులు, కాలువల మార్గాలు, విద్యుత్ ఖర్చు, నీటి కేటాయింపులు పరిమితులు విధిస్తాయి. అయినప్పటికీ ఇప్పటికే ఉన్న ప్రాజెక్టులు, కాలువలు, పంపింగ్ కేంద్రాలు, చెరువులను సమన్వయంతో ఉపయోగించి ఎక్కడ నీటిని అందించవచ్చో శాస్త్రీయంగా పరిశీలించాలి. మరమ్మతులతోనే నీరు చేరే కాలువలు, తూములు, పంపింగ్ కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువుల కట్టలు, అలుగులు, అనుసంధాన కాలువలను పరిశీలించి వర్షపు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంచాలి.

ప్రభుత్వం తక్షణం ఐదు చర్యలు చేపట్టాలి. మొదట, ప్రాజెక్టులు, బ్యారేజీల వారీగా నిల్వలు, ప్రవాహాలు, విడుదలలు, వినియోగానికి సంబంధించిన వివరాలను తేదీతో సహా ప్రజలకు అందుబాటులో ఉంచాలి. రెండోది, నీటి కొరత ఉన్న మండలాలు, గ్రామాలు, చెరువులను గుర్తించి ప్రాధాన్య క్రమంలో జాబితా ప్రకటించాలి. మూడోది, కాలువలు, తూములు, పంపింగ్ కేంద్రాల్లోని లోపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలి. నాలుగోది, చెరువుల పూడిక తొలగింపు, కట్టల పటిష్ఠత, వర్షపు నీటి సంరక్షణ పనులను అవసరాన్ని బట్టి చేపట్టాలి. ఐదోది, ఏ ప్రాంతానికి ఎంత నీరు విడుదల చేశారు, ఎన్ని ఎకరాలకు ప్రయోజనం కలిగింది, ఎక్కడ ఇంకా కొరత ఉందో తెలిపే నెలవారీ నివేదికను విడుదల చేయాలి. తాగునీటికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తూనే పర్యావరణ అవసరాలు, చట్టబద్ధమైన నీటి కేటాయింపులు, ప్రాజెక్టుల భద్రతను విస్మరించకూడదు. కరువు సహాయం, పంట నష్టపరిహారం, ఉపాధి కల్పనతోపాటు నీటి కొరతను తట్టుకునే దీర్ఘకాలిక ప్రణాళిక, భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రాధాన్యం ఇవ్వాలి. జగిత్యాల జిల్లా వంటి శ్రీరాంసాగర్ ఆయకట్టు ప్రాంతాల్లో కాలువల చివరి వరకు నీరు అందని గ్రామాలను గుర్తించి, వాటి సమస్యలను విడిగా పరిశీలించాలి. ఎక్కడ నీటి విడుదల సరిపోవడం లేదు? ఎక్కడ కాలువల మరమ్మతులు అవసరం? ఎక్కడ ప్రత్యామ్నాయ నీటి వనరులు ఉపయోగపడతాయి? అన్న అంశాలపై స్థానిక రైతుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. గోదావరి తెలంగాణ గుండా ప్రవహించడం ఒక్కటే రైతుకు నీటి భరోసా కాదు. ఆ జలాలను ఎక్కడ నిల్వ చేస్తున్నాం? ఎంత వినియోగిస్తున్నాం? ఏ ప్రాంతాలకు చేరుస్తున్నాం? ఎక్కడ అడ్డంకులు ఎదురవుతున్నాయి? అన్నదే అసలు లెక్క. ప్రాజెక్టుల ఘనతలు చాటుకోవడం, గత పాలకులపై నిందలు వేయడం మాత్రమే పరిష్కారం కాదు. కరువు ప్రకృతి వైపరీత్యం కావచ్చు.. కానీ అందుబాటులో ఉన్న నీటి వినియోగంపై ప్రణాళిక, పారదర్శకత, జవాబుదారీతనం ప్రభుత్వ బాధ్యత. గోదావరి ప్రవహిస్తుంటే పల్లె ఎందుకు ఎండిపోతోంది? ప్రాజెక్టులున్నా రైతు ఎందుకు బోర్లపై ఆధారపడాలి? ప్రభుత్వం ఈ ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం చెప్పాలి. రైతుకు కావా ల్సింది ప్రకటన కాదు.. పొలానికి చేరే నీరు! పాలనకు కావాల్సింది ప్రచారం కాదు.. ప్రజలకు కనిపించే ఫలితం!

-శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు
9133947176

కళా తపస్వి శాంతారామ్

శాంతారాం రాజారాం వణకుద్రే (నవంబరు 18, 1901 – అక్టోబరు 30, 1990) భారత దేశపు చలన చిత్ర రంగంలో చరిత్ర సృష్టించిన అద్భుత చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు వి. శాంతారామ్. ఆయన ఒక కళా తపస్వి. శాంతారామ్ దాదాపు ఏడు దశాబ్దాలుగా చిత్ర నిర్మాతగా వృత్తిని కలిగి చలనచిత్ర మాధ్య మాన్ని సాంఘిక మార్పుకు సాధనంగా వినియోగించు కోవడానికి ప్రయత్నం చేశారు. ప్రారంభ చిత్రనిర్మాతలలో ఆయన ఒక వైపు మానవతా వాదాన్ని సమర్థించడానికి, మరో వైపు మూర్ఖత్వం మరియు అన్యాయాన్ని బహిర్గతం చేయ డానికి చిత్రాలను విజయ వంతంగా ఉపయోగించారు. ఆయన "డా.కోట్నిస్ కీ అమర్ కహానీ" (1946), "అమర్ భూపాలి" (1951), "దో ఆంఖె బారహ్ హాథ్" (1957), "నవ రంగ్" (1959), "దునియా నా మానే" (1937),"పింజ్రా" (1972) వంటి చిత్రాల తో అందరికి పరిచితుడు. ఆయన తీసిన చిత్రాలన్నీ ఆణి ముత్యాలే. ప్రతీ చిత్రంలో ఏదో ఒక కళకు ప్రాముఖ్యత ఇచ్చి నిర్మించారు' ఝనక్ ఝనక్ పాయల్ బాజేలో' నృత్యానికి, 'నవరంగ్' లో కవిత్వానికి, 'గీత్ గాయా పత్తరోన్' చిత్రంలో (తెలుగులో 'అమరశిల్పి జక్కన' చిత్రానికి ఆధారం. సాంఘిక చిత్రంగా మలిచారు) శిల్పానికి, ఇలా ఎన్నో కళలని దృశ్య కావ్యాలుగా మనకి అందించారు. వారి చిత్రాలలో పాటలు అమృత గుళికలు. 'జల్ బిన్ మచిలీ' చిత్రంలో ఒక పాము డాన్స్ చాలా అద్భుతం గా ఉంటుంది. అది మన తెలుగుచిత్రం 'అగ్నిపూలు' లో జయప్రద చేశారు. అంతే కాదు వారి చిత్రాలు సందేశాత్మకంగా ఉండి ప్రజలని ఆలోచింప జేసేలా ఉంటాయి.

-రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్

మరకత శివాలయ సన్నిధిలో హైకోర్టు సెకండ్ బెంచ్ జడ్జి సుమలత రెడ్డి

శంకర్‌పల్లి, వెలుతురు అక్టోబర్ 29 :
శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలసిన 11వ శతాబ్దానికి చెందిన పురాతన మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయ సన్నిధిలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు సెకండ్ బెంచ్ జడ్జి సుమలత రెడ్డి గురువారం కుటుంబ సభ్యులతో కలిసి, స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్ జడ్జి కుటుంబీకులను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా జడ్జి సుమలత రెడ్డి మాట్లాడుతూ పురాతన ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని కితాబు ఇచ్చారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ సిహెచ్ నర్సింలు, కోశాధికారి ప్రశాంత్ గౌడ్, అన్న ప్రసాద కమిటీ చైర్మన్ కడకంచి అంజయ్య, వెంకటస్వామి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సుభాషిని

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 29 :
శంకర్పల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సుభాషిని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలిసి ఆమె వీబీ గ్రామ్ జి పనులు, 'ఎల్ నినో' ముందస్తు కార్యక్రమాలపై సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఉపాధి హామీ పథకం అమలుపై అధికారులకు ఆమె పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా జలసిరి పథకంలో భాగంగా చేపట్టాల్సిన పనులు, లేబర్ మొబిలైజేషన్ , ఇంకుడు గుంతల నిర్మాణం, పశువుల తొట్ల నిర్మాణం, మరియు నూతన మేట్ల నియామకం వంటి అంశాలపై నిశితంగా చర్చించారు. గ్రామీణ ప్రగతి పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో శంకర్పల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి. ప్రవీణ్ కుమార్, మండల పరిషత్ అధికారి గిరిరాజు, సహాయ ఉపాధి హామీ అధికారి నాగభూషణం, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ జనార్దన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ యాదయ్య మరియు కంప్యూటర్ ఆపరేటర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల కూరగాయల మార్కెట్ రైతులతో చైర్మన్ హన్మంత్ రెడ్డి సమావేశం

- కూరగాయల మార్కెట్లో రైతులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసాం
- రైతులందరూ మార్కెట్లో కూరగాయలు విక్రయించాలి
- మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి

మంచాల వెలుతురు అక్టోబర్ 29:
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో నిర్మించిన కూరగాయల మార్కెట్ ను సందర్శించి కూర గాయలు అమ్ముకునే రైతులతో సమావేశం ఏర్పాటు చేసిన మంచాల వ్యవసాయ సహకారసంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి ఈ సమావేశానికి గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉప సర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ఇందిరమ్మ కమిటీ సభ్యుడు చెరుకు నరసింహగౌడ్ హాజరైనా రు ఈసందర్భంగా చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ఆరుట్ల గ్రామంలో కూరగాయల మార్కెట్ అన్ని సౌకర్యాలతో నిర్మించి చాలా రోజులవుతున్న రైతులు మాత్రం రోడ్లపైనే కూరగా యలు విక్రయిస్తున్నారు అనే విషయం తెలుసుకున్న మంచాల వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ వెదిరె హన్మంత్ రెడ్డి రైతులతో సమావేశమై మాట్లాడుతూ రైతులు రోడ్లపైనకూరగాయ లు విక్రయిస్తూ ఎండకు వానకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకునే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో రైతుల కోసం అన్ని వసతులతో కూరగాయల మార్కెట్ నిర్మించాం అని అన్నా రు కానీ రైతులు కూరగాయల మార్కెట్లో కూరగాయలు అమ్ము కోవడానికి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రై తులను అన్నివిధాలుగా ఆదుకోవడానికి సిద్ధంగా ఉంది అన్నారు ఆరుట్ల కూరగాయల మార్కె ట్లో ఇంకేమన్నా సౌకర్యాలు కావాలన్నా సౌకర్యాలు కల్పించడానికి మంచాల వ్యవసాయ సహ కార సంఘం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది అని అన్నారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కల వకుండా చర్యలు తీసుకుంటాం అనిఅన్నారు రైతులు ప్రతిరోజు కూరగాయల మార్కెట్ లోనే కూరగాయలు విక్రయించాలి అని అన్నారు అప్పుడే చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు ఆరుట్ల గ్రామంలో పెద్ద కూరగాయల మార్కెట్ ఉన్నది అని తెలుస్తుంది అన్నారు అప్పుడే వేరే ప్రాంతాల నుండి కూడా ప్రజలు వచ్చి కూరగాయలు కొనుక్కునే అవకాశం ఉంటుంది అని అన్నారు రైతులకు కూరగాయలు ఎక్కువ అయితే మంచాల సహకార సంఘం నుండి హైదరాబాద్ మార్కెట్ కు తరలించే చర్యలు తీసుకుంటాం అని అన్నారు. సహకార సంఘం ఎల్లప్పుడూ రైతుల శ్రేయ స్సు కోసమే పనిచేస్తుంది అని అన్నారు రైతులందరూ సహకార సంఘానికి సహకరించి సంఘం బలోపేతానికి కృషి చేయాలి అని అన్నారు ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభా కు మార్ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ మాట్లాడుతూ ఆరుట్ల గ్రామంలో కూరగాయలు పం డించే ప్రతిరైతు కూరగాయల మార్కెట్లో విక్రయించి లాభం పొందాలి అని అన్నారు ప్రతిరైతు రో డ్ల పైన విక్రయించకుండా కూరగాయల మార్కెట్ లోనే కూరగాయలు విక్రయించాలి అనిఅన్నా రు ఈ కార్యక్రమంలో ఆరుట్ల మాజీ సర్పంచ్ సుంకరి పండరీనాథ్ గౌడ్ మంచాల సహకార సం ఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి అర్చన రమేష్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పంది శేఖర్ కొండిగారి శ్రావణ్ కుమార్ మంద మాధవి మోహన్ రెడ్డి పున్నం రాము మాడుగుల బాల మని కృష్ణ గౌడ్ మొగ్రిపద్మ ఐలయ్య గ్రామస్తులు గుడ్డిమల్ల చంద్రయ్యముదిరాజ్ చిందంరఘుప తి ప్రజాగలం భూపాల్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మహమ్మద్ అష్రఫ్ కావలి రమేష్ ముదిరాజ్ నూకం శేఖర్ ముదిరాజ్ రైతులు పాల్గొన్నారు

కన్న కూతురినే హత్య చేసిన తల్లి!

మొబైల్ ఫోన్ ఎక్కువగా వాడుతోందని, మాట వినడం లేదనే కారణంతో కన్న కూతురినే గొంతు నులిమి హత్య చేసిన తల్లిని కొత్తూరు పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. బాలిక మృతిని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. షాద్‌నగర్ జోన్ డీసీపీ సి. శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరులోని హనుమాన్ టెంపుల్ కాలనీకి చెందిన ముయ్యాది విజయలక్ష్మి (34) కుమార్తె సువర్ణ అలియాస్ లల్లీ (14) స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. మొబైల్ ఫోన్ అధికంగా వినియోగించడం, తల్లి మాట వినకపోవడం వంటి కారణాలతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ నెల 27న సాయంత్రం మరోసారి తల్లీకూతుళ్ల మధ్య వివాదం జరగడంతో విజయలక్ష్మి బాలిక గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అనంతరం చీరతో ఉరివేసుకున్నట్లు కనిపించేలా చేసి, ఘటనను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. బాలికను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదికలో గొంతు నులిమి హత్య చేసినట్లు నిర్ధారణ కావడంతో కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేపట్టారు. వైద్య నివేదిక, ఇతర ఆధారాల ఆధారంగా విజయలక్ష్మిని అరెస్ట్ చేసి, ఆమె మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో విద్యార్థులకు రోల్ ప్లే పోటీలు

మెదక్ వెలుతురు అక్టోబర్ 29:
జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి రోల్ ప్లే పోటీ లు నిర్వహించారు. చైల్డ్ రైట్స్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ లో భాగంగా తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ఈ పోటీ నిర్వహించారు జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో విద్యార్థులు విలువలు, ఆరోగ్యం సమానత ,భద్రత వంటి అంశాలపై రోల్ ప్లే చేసి అందరినీ ఆకట్టుకున్నారు ఈ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజ్ పల్లి విద్యార్థులు ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. రెండవ స్థానం హవేలీ ఘనపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పొందగా మూడవ స్థానం కేజీబీవీ కొల్చారం విద్యార్థులు సాధించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి రాజు మెమెంటోలు ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్నిట్లో ముందు ఉండాలని, రాష్ట్రస్థాయి రోల్ ప్లే పోటీల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుద ర్శన మూర్తి న్యాయ నిర్ణేతలు రామేశ్వర ప్రసాద్ , అంజాగౌడ్ ,స్టెలా ,వంశీకృష్ణ పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన భారీ బాణసంచా స్వాధీనం ఒకరి అరెస్ట్

యాచారం మండల పోలీస్ అధికారి ఎస్ హెచ్ఓ నందీశ్వర్ రెడ్డి

యాచారం వెలుతురు అక్టోబర్ 29:
యాచారం మండల మాల్ గ్రామంలో అనుమతులు లేకుండా కనీస రక్షణ చర్యలు తీసుకోకుం డా నివాసగృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ బాణసంచా ఫైర్ క్రాకర్స్ ని యాచారంపోలీ సులు గురువారం స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్ గ్రామప్రధాన రహదారిపై పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగామల్ మార్కెట్ వి.టి.నగర్ లోని ఒక ఇంట్లో ఎలాంటి భద్రతాప్రమాణాలు పాటించకుండా భారీగా బాణసంచా నిల్వ ఉంచినట్లు నమ్మదగిన సమాచారం అందింది దీనితో పోలీసులు వెంటనే స్పందించి సద రు గృహంపై ఆకస్మిక దాడి రైడ్ నిర్వహించారు ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 60 షాట్స్30 షాట్స్1000 వాలాహైడ్రోజన్ బాంబ్స్ ఫ్లవర్ పాట్స్ మరియు లూజ్ క్రా కర్స్ తో కూడిన సుమారు 70 కి పైగా బాణసంచా పెట్టెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నా రు. ప్రమాదకర రీతిలో వీటిని నిల్వ ఉంచిన మల్ గ్రామానికి చెందిన కొమ్మ?శెట్టి పురుషోత్తం 32 అనే వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు ప్రజా ప్రాణాలకు ఆస్తులకు నష్టం వాటిల్లేలా నిర్లక్ష్యంగా బాణసంచా నిల్వ చేసినందుకు సదరు వ్యక్తిపై యాచారం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీపావళి పండుగ వేళ నిబం ధనలు ఉల్లంఘించి అక్రమంగా బాణసంచా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే భూ సర్వే లక్ష్యం

గ్రామాల్లో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూముల హద్దులపై స్పష్టత తీసుకురావడం, భూ రికార్డుల్లో పారదర్శకత పెంపొందించడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం భూ రీ సర్వే చేపడుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామంలో గురువారం గ్రామ భూ రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూ సర్వే ద్వారా భూముల వివరాలను కచ్చితంగా నమోదు చేసి, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, సర్వే వివరాల్లో స్పష్టత తీసుకురావడం ద్వారా రైతులకు భూ యాజమాన్యానికి సంబంధించిన సమస్యలు తగ్గే అవకాశం ఉందని ,భూముల రికార్డుల్లో వ్యత్యాసాలు, సరిహద్దుల వివాదాలు, ఇతర భూ సంబంధిత సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు రీ సర్వే దోహదపడుతుందన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.అనంతరం గ్రామంలో నూతనంగా లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. .

ఆరుట్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో అఖిలపక్షం సమావేశం

- బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఏర్పాట్ల సమీక్ష
- సమావేశనికి పాలక మండలికి సమాచారం ఇవ్వకపోవడంపై రగడ ఆరుట్ల ప్రజల ఆందోళన

మంచాల వెలుతురు అక్టోబర్ 29:
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో గ్రామపంచాయతీ కా ర్యాలయంలో గ్రామసర్పంచ్ మాని పాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నుకం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వరస్వామి జాతర ఏర్పాట్ల సమీక్ష సమావేశానికి గ్రామపంచాయతీ పాలకమం డలి సభ్యులకు సర్పంచ్ కు సమాచారం ఇవ్వనందుకు అఖిలపక్షం పార్టీల వివిధ కుల సంఘా లతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో పలువురు గ్రామపెద్దలు మాట్లాడుతూఆరు ట్ల బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయానికి ఎంతో చరిత్ర ఉంది అన్నారు ప్రతి ఏడాది లక్షలా దిమంది భక్తులు బుగ్గ రామలింగేశ్వర జాతరకు విచ్చేసి బుగ్గ రామలింగేశ్వర స్వామినిదర్శించు కుంటున్నారు అన్నారు ప్రతి ఏడాది గ్రామ సర్పంచ్ పాలకమండలి ఆధ్వర్యంలో జాతర ఏర్పా ట్లు చూసుకునే వాళ్ళు గత ఎమ్మెల్యే బుగ్గరామలింగేశ్వరస్వామి జాతర ఏర్పాట్లపై బుగ్గ రామ లింగేశ్వర సన్నిధిలోని సమీ క్ష సమావేశం నిర్వహించేవారు కానీ నేడు ఆరుట్ల గ్రామ సర్పంచ్ ఎ స్టీ మహిళ కావడంతో సర్పంచికిఅధికారులు ఎమ్మెల్యే సరైన గౌర వం ఇవ్వకుండా బుగ్గరామ లింగేశ్వర స్వామి జాతర ఏర్పాట్ల సమీక్ష సమావేశం ఇబ్రహీంపట్నంలో నిర్వహించి ఆరుట్లగ్రా మంలో జరిగే బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర సమీక్ష సమావే శానికి అరుట్ల సర్పంచి గారికి సమాచారం ఇవ్వకపోవడం సరైన పద్ధతి అయిన పద్ధతి కాదు అన్నారు గ్రామ ప్రజల ఓట్లతో గె లిచిన గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ గారికి ఒక ప్రజాప్రతినిధిని సమీక్ష సమావేశానికి సమాచారం ఇవ్వకపోవడంతో ఆరుట్ల గ్రామప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు గతప్రభుత్వం లో ఎమ్మెల్యే బుగ్గరామలింగేశ్వరస్వామి జాతర ఏర్పాట్ల విషయంలో గ్రామసర్పంచ్ పాలకమం డలి సభ్యులతో చర్చించి బుగ్గరామలింగేశ్వర స్వామి సన్నిధిలోని సమీక్ష సమావేశం నిర్వహిం చి గ్రామసర్పంచికి సరైన గౌరవం ఇచ్చేవారు అన్నారు బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయ క మిటీ ఏర్పాటు విషయంలో గ్రామపెద్దలు ప్రజాప్రతినిధులకు తెలియకుండా దొంగ చాటుగాదేవా లయ కమిటీని ఏర్పాటు చేసి ఆరుట్ల గ్రామ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని అన్నారు ఈ సం దర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ మా ట్లాడుతూ ఈరోజు ఒక ఎస్టీ మహిళ గ్రామ సర్పంచిగా కొనసాగు తున్నందుకే సరైన గౌరంఇవ్వ కుండా ఆరుట్ల గ్రామంలో నిర్వహించవలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఏర్పాట్ల సమీ క్ష సమావేశం ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు అన్నారు అదే రెడ్డి బిసి సర్పంచి అయినట్టయి తే ఈరోజు సమీక్ష సమావేశం ఇబ్రహీంపట్నంలో నిర్వహించేవార అని ప్రశ్నించారు ఆరుట్ల బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయ దేవాదాయ శాఖ కమిటీ అవసరం లేదు అన్నారు గత సర్పం చ్ పాలన చేసినప్పుడు దేవాదాయ శాఖలో కలపాలని అప్పుడెందుకు గుర్తుకు రాలేదు అని ఈ సందర్భంగా గుర్తు చే శారు మాజీ ఎంపిటిసి చీరాల ర మేష్ మాట్లాడుతూ ఏదైనా ప్రభుత్వ కార్యక్రమం ఏర్పాటు చేసినప్పుడు పార్టీలకతీతంగా కార్యక్రమాలు ఏర్పాటు చేసు కోవాలి కానీ అధికారులను లెక్కచే యకుండా కాంగ్రెస్ పార్టీ ప్రచారం లాగా ఇంటి ఇంటికి వెళ్లి ఇందిరమ్మ క మిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు రేషన్ కార్డులు పంపిణీ చేయడం ఇందిరమ్మ ఇండ్లుస ర్పంచ్ ప్రమేయం లేకుండా మంజూరు చేయటం దొంగ చాటుగా బుగ్గ రామలింగేశ్వర స్వామి దే వాలయ ఎండోమెంట్ కమిటీ ఏర్పాటు చేయడం కమిటీ పేర్లు గ్రామపంచాయతీ బోర్డులో పెట్టక పోవడం సరైన పద్ధతి కాదు అన్నారు ఏదైనా రాజకీయాలు చే యాలనుకుంటే ఎన్నికల సమ యంలో చేసుకుందాం కానీ అభివృద్ధి కార్యక్రమాల విషయంలో అందరం కలిసిమెలిసి అభివృద్ధి చేద్దాం అని అన్నారు ప్రజలకు అమలు అయ్యే ప్రతి సంక్షేమ పథకం విషయంలో గ్రామ సర్పం చి గారికి సంప్రదించాలి గ్రామపంచాయతీ సంతకం ఉండాలి అని అన్నారు ఆరుట్ల గ్రామ సర్పం చి గారికి ఎక్కడ కూడా సరైన గౌరవం దక్కడంలేదు అని మండిపడ్డారు ఇప్పటికైనా అధికారు లు స్పందించి బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఏర్పాట్లపై గ్రామసర్పంచి గారితో కలిసి సమీ క్ష సమావేశం బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయం వద్దనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చే శారు లేని పక్షంలో ఆరుట్ల గ్రామ ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తాం అని అన్నారు ఈ సం దర్భంగా గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమంలో గానీ ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాల విషయంలో కానీ నాకు సరైన గౌరవం ఇవ్వటంలేద ని తన ఆవేదన వ్యక్తం చేశారు నేను ఒక ఎస్టి మహిళా సర్పంచ్ అయినందుకేనా నాకు సరైన గౌరవం ఇవ్వకపోవడం అని అన్నారు నేను గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి గ్రామ ప్రజల ఓ ట్లతో గెలిచిన గ్రామసర్పంచిని ప్రజలు నాకు ఓట్లు వేసి బారి మెజార్టీతో నన్నుసర్పంచిగా గెలిపిం చారు ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు నా ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు కాంగ్రె స్ పార్టీ నాయకులకు చెప్పిన వాళ్ళకే అమలు చేస్తూ ఉంటే ప్రజలు నాదగ్గరకు వచ్చినాకు ఇం దిరమ్మ ఇళ్లు కావలి రేషన్ కార్డు కావలి పింఛన్ కావాలి అని అడుగుతుంటే నేను ప్రజలకుఎలా సమాధానం చెప్పాలి అని మండిపడ్డారు ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి సర్పంచి గా నాకు ఇచ్చే గౌరవం ఇవ్వకుంటే పై అధికారులను కలిసి ఫిర్యాదు చేస్తాను అని ఉచ్చరించా రు ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి చిలుకల వెంకటేష్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు పంది శేఖర్ కొండిగారి శ్రావణ్ కుమార్ మంకు మమత వినోద్ మంద మాధవి మోహ న్ రెడ్డి పున్నం రాము రావుల జంగయ్యమహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ మాడుగుల బాలమణికృష్ణ గౌడ్ మొగ్రి పద్మ ఐలయ్య లాలగారి మణెమ్మ సాతిరి సత్యం బిజెపి పార్టీ నాయకులు కొంగర వెంకటరె డ్డి తంగడిపల్లి నరేందర్ గౌడ్ సిపిఎం పార్టీ నాయకులు పుల్ల గళ్ళ గోపాల్ ఆనుపాటి గణేష్ ప్రజాగలం దామర భూపాల్ గ్రామ పెద్దలు దంటు మధుసూదన్ రెడ్డి లొంగరి మారయ్య తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు అనంగళ్ళ పరమేష్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చిందం ర ఘుపతి మహమ్మద్ జానీ పాషా చిందం జంగయ్య మంకు వినోద్ మహమ్మద్ సద్దాం గ్రామస్తు లు వివిధ కుల సంఘాల పెద్ద ఎత్తున పాల్గొన్నారు

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

మునుగోడు,అక్టోబర్ 28 (వెలుతురు):
వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు మాదనబోయిన పరమేష్ యాదవ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ లేదా సమానమైన విద్యార్హత పూర్తిచేసిన వారు ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. అర్హులైన వారు నవంబర్ 6లోగా ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు సైతం ప్రస్తుత ఎన్నికలకు కొత్తగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాంకు ఖాతాదారులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్‌బీఐ ఏజీఎం హేమలత, ఎల్‌డీఎం వీరన్న

గుండాల అక్టోబర్ 29(వెలుతురు):
సామాజిక భద్రతా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం హేమలత సూచించారు. బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి ఒక్కరూ అర్హతను బట్టి బీమా పథకాల్లో చేరి ఆర్థిక భద్రత పొందాలని యాదాద్రి భువనగిరి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వీరన్న కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో ఎస్‌బీఐ, ఎస్ఎస్‌టీ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఆర్థిక అంశాలు, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌బీఐ ఏజీఎం హేమలత మాట్లాడుతూ, బ్యాంకింగ్ సేవలను వినియోగించుకునే ప్రతి ఒక్కరూ సామాజిక భద్రతా పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. బ్యాంకు అధికారులు ఫోన్ ద్వారా ఖాతాదారుల వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు అడగరని స్పష్టం చేశారు. అపరిచిత వ్యక్తులకు ఫోన్ ద్వారా బ్యాంకు వివరాలు వెల్లడించవద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వీరన్న మాట్లాడుతూ, అర్హులైన వారు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాల్లో చేరాలని తెలిపారు. అలాగే అర్హత కలిగిన వారు అటల్ పెన్షన్ యోజనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ ప్రీమియంతో అందుబాటులో ఉన్న ఈ పథకాలు ఆపద సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని వివరించారు. ఎస్‌బీఐ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, రైతులు తమ వ్యవసాయ రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఖాతాలు నిలిచిపోయిన వారు రీ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసి ఖాతాలను పునరుద్ధరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం కె. ఝాన్సీ రాణి, ఏఎల్‌డీఎం వంశీ, టీజీబీ మేనేజర్ నరేష్, సర్పంచ్ ఆలకుంట్ల సుధాకర్, ఉపసర్పంచ్ పెద్దిరాజు, ఎస్ఎస్‌టీ కౌన్సిలర్లు పురుగుల మల్లేష్, నోముల ప్రవీణ్, ఈడీసీ మేనేజర్ రంజిత్, పంచాయతీ కార్యదర్శి సోఫియా, సీసీ వెంకటేశ్వర్లు, ఎస్‌బీఐ సీఎస్‌పీ మారోజు మధు, వీవోఏ నర్సమ్మతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యకు విముక్తి

- మొదటి విడతగా 17 కోట్ల నిధులు మంజూరు
- డంపింగ్ యార్డ్ కోసం కోతిరాంపూర్ చౌరస్తా లో పార్టీలకతీతంగా సంబరాలు నిర్వహించిన రాజకీయ నేతలు, స్థానిక ప్రజలు
- కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, బండి సంజయ్ కుమార్ , మేయర్ కోలగాని శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపిన స్థానిక కార్పొరేటర్ మాసం గణేష్

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 29:
కరీంనగర్ నగరవాసులను దశాబ్ద కాలంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న డంపింగ్ యార్డ్ దుర్గంధం, కాలుష్య సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారదిశగా అడుగులు లభించింది. "డంపింగ్ యార్డ్‌కు ఇక బై.. బై.." అని చెప్పే రోజు రానే వచ్చింది. గతంలో కరీంనగర్ పర్యటన సందర్భంగా నగర ప్రజలకు ఇచ్చిన మాటను కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నిలబెట్టుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నిరంతర కృషి, పట్టుదలతో ఈ సుదీర్ఘ సమస్యకు విముక్తి కోసం ముందడుగు డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాల తొలగింపు (బయో మైనింగ్), నగర పారిశుద్ధ్య ఆధునీకరణ కోసం స్వచ్ఛ భారత్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం మొదటి విడతగా రూ. 17 కోట్ల నిధులను మంజూరు చేసింది.

మాట నిలబెట్టుకున్న 'కమలం' పార్టీ:

కరీంనగర్ ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కరీంనగర్ పర్యటనకు వచ్చిన సందర్భంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సమస్య తీవ్రతను గ్రహించి, త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారమే స్వచ్ఛ భారత్ మిషన్ కింద రూ. 17 కోట్లు విడుదల చేయడంతో కరీంనగర్ ప్రజల నమ్మకాన్ని కమలం పార్టీ నిలబెట్టుకుందని స్థానికులు మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డంపింగ్ యార్డ్ కోసం కోతిరాంపూర్ చౌరస్తా లో ఘనంగా సంబరాలు

దశాబ్దాల నాటి తీవ్రమైన రోగాల బారి నుండి, దుర్గంధం నుండి ఉపశమనం లభించనుండడంతో బిజెపి కార్పొరేటర్ మాసం గణేష్ ఆధ్వర్యంలో డంపింగ్ యార్డ్ సమీపంలో వివిధ వర్గాల ప్రజలు, స్థానికులు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ... కరీంనగర్ ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతుందని నగరవాసులకు నరకం చూపించిన డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సహాయ పడిన కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్, బండి సంజయ్ కుమార్, మరియు మేయర్ కోలగాని శ్రీనివాస్ , నగరపాలక సంస్థ ప్రతినిధులకు, అధికారులకు , జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం స్వచ్ భారత్ మిషన్ కింద 17 కోట్ల నిధులు మంజూరు కావడం తో.బయో మైనింగ్ ప్రక్రియ శరవేగంగా పూర్తవుతుందని, రానున్న రోజుల్లో 80 కోట్ల నిధులతో డంపింగ్ యార్డ్ కు శాశ్వత విముక్తి లభించనుందని తెలిపారు. అతి త్వరలోనే కరీంనగర్ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సుందర నగరంగా మారడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

డంపింగ్ యార్డ్ విషయంలో బిఆర్ఎస్ ఇంకా రాజకీయాలు చేస్తున్నందుకు సిగ్గుండాలి...

డంపింగ్ యార్డ్ విషయంలో అనవసర రాజకీయాలు చేస్తున్న బిఆర్ఎస్ పార్టీకి సిగ్గు ఉండాలని కార్పొరేటర్ మాసం గణేష్ ఘాటుగా విమర్శించారు. గత పదేళ్లు టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉందని , కరీంనగర్ మూడుసార్లు ఎమ్మెల్యే , రాష్ట్ర మంత్రిగా పనిచేసిన గంగుల కమలాకర్ డంపింగ్ యార్డ్ తరలింపు విషయంలో నిర్లక్ష్యం గా వ్యవహరించి ఇప్పుడు రాజకీయాలు చేస్తున్నందుకు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. కరీంనగర్ డంప్ యార్డ్ ను మరణ శాసనమ్ ల తయారు చేసింది ఎవరని. ? గత దశాబ్ద కాలంగా డంపింగ్ యార్డ్ సమస్య కోసం ప్రజలంతా శాశ్వతంగా పరిష్కారానికి మార్గాలు చూపమని కోరితే , కేటీఆర్ కెసిఆర్ వచ్చినప్పుడల్లా అర్ధారాత్రుళ్ళు అరెస్ట్ లు చేసి నియంత పాలన కొనసాగించారన్నారు. పార్టీ జెండాలు పక్కన పెట్టి ప్రజల అరోగ్యం, జీవితాన్ని కాపాడుకోవడానికి గత బిఆర్ఎస్ ను ప్రాధేయపడితే చేసింది ఏంటి . ప్రశ్నిస్తే గత బి ఆర్ ఎస్ నాయకులతో అక్రమ కేసులు పెట్టింది వాస్తవం కాదా..అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ కృషితో ఇప్పుడు డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారమైతే చూసి ఓర్వలేక మళ్ళీ చిల్లర రాజకీయలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.. ఇకనైనా బి ఆర్ ఎస్ నేతలు పనికిమాలిన రాజకీయాలు మానుకొవాలనీ హెచ్చరించారు. నగర ప్రజల నమ్మకాన్ని బిఆర్ఎస్ పూర్తిగా కోల్పోయిందని , ప్రజల నమ్మకంతోనే బల్దియా ఎన్నికల్లో బీజేపీ కి మద్దతుగా నిలిచారని, ప్రజలు బిజెపి పై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తుంటే జీర్ణించుకోలేని స్థితిలో బిఆర్ఎస్ ఉందన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ తన బుద్ధిని మార్చుకోవాలని హితవు పలికారు . ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు ఏపీపీ చంద్ర, తోట అనిల్ , మ్యకల వెంకటేష్ , వివిధ డివిజన్ ప్రజలు , ఆటోనగర్ ప్రజలు, ఆటో యూనియన్ నాయకులు బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలపై అవగాహన కల్పించాలి

ఎస్సీ,ఎస్టీ వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రత్యేక అభివృద్ధి నిధులను సమర్థవంతంగా వినియోగించాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. నిధుల ఖర్చు కే పరిమితం కాకుండా ఆయా వర్గాల ప్రజల ఆదాయం, ఆస్తులు, జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గురువారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధుల వినియోగం, చేపట్టిన పనుల పురోగతిని సమీక్షించారు.

నిధుల వినియోగంపై పర్యవేక్షణ

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించి ప్రతి శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, కార్యక్రమాల వివరాలను అర్హులైన లబ్ధిదారులకు తెలియజేయాలని వేముల వీరేశం సూచించారు. నిధుల కేటాయింపు నుంచి పనుల అమలు వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రతి నెలా సమీక్షలు నిర్వహించి పురోగతిని అంచనా వేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

విద్య,వైద్యానికి ప్రాధాన్యం

ప్రజలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. యంగ్ ఇండియా స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ద్వారా విద్యావ్యవస్థను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి వినియోగం, వ్యవసాయ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని వేముల వీరేశం సూచించారు. కరువు పరిస్థితులను ముందుగానే అంచనా వేసి కార్యాచరణ రూపొందించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని, పొలాల వద్దే ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారుల కార్యకలాపాలపై పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు. రైతులకు నష్టం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, సంబంధిత అంశాలను ప్రభుత్వ విప్‌కు వివరించారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శశికళ అధికారులు పాల్గొన్నారు.

మహాత్మా నగర్‌లో నూతన అంగన్వాడీ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్

తిమ్మాపూర్ వెలుతురు అక్టోబర్ 29:
తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్-1 గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఘనంగా ప్రారంభించారు. భవన ప్రారంభోత్సవం అనంతరం అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు శ్రీమంతాల వేడుకను, చిన్న పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారు మాట్లాడుతూ... గర్భవతులు సరైన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యకరమైన పిల్లలు జన్మిస్తారని పేర్కొన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఐరన్, క్యాల్షియం మాత్రలు ఉపయోగించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి సరస్వతి, సర్పంచ్ పొన్నాల సంపత్, ఉపసర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి, మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్ , శిశు అభివృద్ధి పథక అధికారిణి శ్రీలత, సహాయ శిశు అభివృద్ధి పథక అధికారిణి సాయి గీత, జిల్లా కార్యనిర్వాహక పంచాయతీ రాజ్ ఇంజనీర్ మంజుల, సహాయ కార్యనిర్వాహక పంచాయతీ రాజ్ ఇంజనీర్ స్నేహజ్యోతి, సమగ్ర శిశు అభివృద్ధి సేవల పర్యవేక్షకురాలు పద్మ, పోషణ్ అభియాన్ బిసి ప్రణీత, డేటా ఎంట్రీ ఆపరేటర్ సుప్రియ, ప్రజాప్రతినిధులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లులు చిన్న పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌ను వెంటనే కరువు మండలంగా ప్రకటించాలి

- మండలంలో కరువు పరిస్థితులు,రైతుల ఆవేదన, కన్నీళ్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకి కనిపించడం లేదా..?
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 29:
పంటలు లేక, తీవ్రమైన నీటి కరువుతో అల్లాడుతున్న తిమ్మాపూర్ మండలాన్ని ప్రభుత్వం వెంటనే "కరువు మండలం"గా ప్రకటించి, నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల బిజెపి శాఖ అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో
గురువారం రోజున ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట హైదరాబాద్ రాజీవ్ రహదారి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వానికి , స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకో వల్ల రాజీవ్ రహదారిపై ట్రాఫిక్కు తీవ్ర అంతరాయం కలగడంతో పోలీసులు జోక్యం చేసుకొని బిజెపి నాయకులను కార్యకర్తలతో రాస్తారోకో విరమింప చేశారు. అనంతరం బిజెపి నేతలు మండల తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల ప్రకటనపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "మండలంలో నీటి కరువు రావడం వల్ల రైతులు సాగుకు దూరమై తీవ్ర మనోవేదనకు గురవుతున్నారనీ ,పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు మున్నీరు అవుతుంటే, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి ఏం చేస్తున్నారు? నియోజకవర్గంలో తాండవిస్తున్న కరువు పరిస్థితులు, రైతుల అవస్థలు ఎమ్మెల్యే కంటికి కనిపించడం లేదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో తిమ్మాపూర్ మండలం లేకపోవడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కరువు మండలాల జాబితాను కేవలం మొక్కుబడిగా మాత్రమే ప్రకటించిందన్నారు. కరువు మండలాలను ఎంపిక చేయడానికి ఉపయోగించిన అధికారిక గణాంకాలు సరిగా లేవనీ,జాబితాను చూస్తేనే ఇది ఎంత అశాస్త్రీయంగా తయారుచేశారో అర్థమవుతోందనీ ఘాటుగా వ్యాఖ్యానించారు..తీవ్రమైన లోటు వర్షపాతం నమోదు కావడం, పొలాలన్నీ బీళ్లుగా మారి రైతులు నీటికి తల్లడిల్లుతున్నా ఆ మండలాలను జాబితాలో చేర్చకపోవడం బాధాకరమన్నారు. మానకొండూరు నియోజకవర్గంలో అనేక మండలాల్లో అత్యల్ప వర్షపాతం నమోదై , సాగునీరు లేక తీవ్ర కరువు పరిస్థితులు తలెత్తాయన్నారు. ఆయా మండలాలు కరువు జాబితాలోకి వచ్చే అర్హత కలిగి ఉన్నాయనీ, . అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయికి వచ్చి రైతులతో మాట్లాడితేనే అసలు వాస్తవాలు తెలుస్తాయన్నారు. ముఖ్యంగా ఆ మండలాలను తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలనీ, ఎండిపోయిన పంటలకు తగిన నష్టపరిహారం చెల్లించడంతో పాటు, రైతాంగానికి వెంటనే ప్రత్యామ్నాయ సాగునీటి సౌకర్యాలు కల్పించాలనీ ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు రాజకీయ లబ్ధిని, రాజకీయ ప్రయోజనాలను పక్కన పెట్టి, వాస్తవికత ఆధారంగా కరువు ప్రభావిత రైతులకు భరోసా కల్పించే చర్యలు చేపట్టాలనీ,రైతుల సమస్యలపై ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించకపోతే, బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. తక్షణం తిమ్మాపూర్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వర చారి, జిల్లా నాయకులు, మావురపు సంపత్,బూట్ల శ్రీనివాస్, బోనాల మోహన్, మండల నాయకులు గొట్టుముక్కల తిరుపతిరెడ్డి, తమ్మనవేని రాజు, తూర్తి సంతోష్, వేల్పుల ఓదెలు, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, బుర్ర శ్రీనివాస్ గౌడ్, పడాల శ్రీనివాస్ గౌడ్, గడ్డం అరుణ్, రాపర్తి రవి, ఎలుకపల్లి స్వామి, చింతం లక్ష్మణ్, దొనపాటి ప్రదీప్ రెడ్డి, బుడిగ మహేష్, బుడిగ నరేష్, రామిడి మహేందర్ రెడ్డి, ఈశ్వర చారి, దురిశెట్టి అజయ్, కన్నం సాయి కృష్ణ కొక్కిస రమేష్, నరేష్ రవి, నరసయ్య,వేల్పుల నరేష్,ప్రశాంత్.పలువురు మండల నాయకులు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కర్ణాటక రత్న పునీత్ రాజ్ కుమార్ 5వ వర్ధంతి

వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 29 :
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణం పునీత్ రాజ్ కుమార్ అభిమానుల సంఘం డాక్టర్ డి ఓం ప్రకాష్ గారి ఆధ్వర్యంలో పునీత్ రాజ్ కుమార్ వర్ధంతి నిర్వహించడం జరిగింది ఓం ప్రకాష్ మాట్లాడుతూ అతి చిన్న వయసులో అనేక సేవా కార్యక్రమం చేసినటువంటి పునీత్ రాజకుమార్, కర్ణాటక రత్న, కన్నడ సూపర్ స్టార్, మరియు అనాధాశ్రయాలు, చిన్నపిల్లల ఉచిత విద్య, గోశాలలు, అనేక సేవా కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజల గుండెలో నిల్చరని ఓం ప్రకాష్ అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబు, ఖైసర్ భాయ్,విశ్వనాథ సర్, సురేష్ గౌడ్, శశికాంత్, వివేకానంద స్వామి తదితరులు పాల్గొన్నారు

పీఎం శ్రీ భుజరంపేట్ పాఠశాలలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్

కొడిపల్లి వెలుతురు అక్టోబర్ 29:
మండల పరిధిలోని పి ఎం శ్రీ ఎంపీపీ ఎస్ భుజరంపేట్ ప్రాథమిక పాఠశాలలో ఈరోజు "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' 'కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యార్థులకు హర్యానా రాష్ట్రం యొక్క ఆచారాలు,సాంప్రదాయాలు, వేష భాషలు, వారి యొక్క ఆహార నియమాలు మరియు హర్యానా రాష్ట్ర ప్రముఖుల గురించి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు మరియు హర్యానా రాష్ట్ర వేషధారణ ఆకట్టుకుంది. మరియు విద్యార్థులకు డిక్షనరీలను, ఐడి కార్డులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పట్లోళ్ల శ్రీనివాస్, పాఠశాల ఏఏపీసీ చైర్మన్ ఇసంపల్లి లక్ష్మి, గ్రామ వార్డ్ మెంబర్లు చింతల పెంటయ్య, మంగలి లక్ష్మయ్య తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గన్య, ఉపాధ్యాయులు నరేశ్, వేణుగోపాల్, ప్రసాదరావు,మహేష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ వర్షపాతంలో ఉద్యాన పంటల సంరక్షణపై అవగాహన

మల్చింగ్‌కు ఎకరానికి రూ.8 వేల సబ్సిడీ

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 29:
తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ఉద్యాన పంటలను సంరక్షించుకోవడం, నీరు, ఎరువులను సమర్థవంతంగా వినియోగించుకోవడంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కోహీర్ మండలం వెంకటాపూర్ రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్, ఆలు పంటలు సాగు చేస్తున్న రైతులకు పంటల సంరక్షణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వరరావు మాట్లాడుతూ.. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగిస్తూ పంటలకు అవసరమైన నీటిని సకాలంలో అందించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూక్ష్మ సేద్య పథకాలను సద్వినియోగం చేసుకొని డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవాలని తెలిపారు. మల్చింగ్ విధానం ద్వారా నేలలో తేమను కాపాడుకోవచ్చని, పంటల పెరుగుదలకు అనుకూల పరిస్థితులు కల్పించవచ్చని వివరించారు. మల్చింగ్‌ను ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు ఎకరానికి రూ. 8,000 సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా కూరగాయల నారును సబ్సిడీపై అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జహీరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు వైద్యనాథ్ మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నీటి యాజమాన్యంతో పాటు ఎరువుల యాజమాన్యంపై కూడా రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారులు అందించే పంటల వారీ సలహాలను పాటిస్తూ, పంట అవసరాలకు అనుగుణంగా నీరు, ఎరువులను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ ఉద్యాన శాఖ అధికారులు పండరి, కోహీర్ ఉద్యాన శాఖ అధికారి సునీత, వ్యవసాయ అధికారి నవీన్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్, ఉద్యాన విస్తరణ అధికారులు విట్టల్, రవీందర్, శైలజ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించాలి

బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పోక్సో చట్టంపై న్యాయమూర్తుల అవగాహన

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 29:
సురక్ష బచపన్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు జహీరాబాద్‌లోని పలు పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. అల్లీపూర్‌లోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవితాదేవి, షాహిన్ పాఠశాలలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ ఖలీల్, భవన్స్ పాఠశాలలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, చదువుపై శ్రద్ధ వహిస్తూ పెద్దలను, తోటి వారిని గౌరవించాలని సూచించారు. విద్యతో పాటు సాధారణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. బాలికలు, మహిళల పట్ల అసభ్యంగా లేదా దురుసుగా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించి, లైంగిక వేధింపుల నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో అవగాహన కల్పించారు. బాల్యవివాహాల నిరోధక చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, లైంగిక నేరాల నుండి బాలల రక్షణ చట్టం (పోక్సో) గురించి వివరించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఉపాధ్యాయుల సహకారంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఎలాంటి వ్యసనాలకు లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో న్యాయవాదులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అందుగులపల్లి నుండి కొడిపల్లి వరకు బస్సును నడపాలని విద్యార్థుల ధర్నా, రాస్తారోకో

- సంఘీభావం తెలిపి ధర్నాలో పాల్గొన్న బిజెపి జిల్లా నాయకుడు రాజేందర్

కొడిపల్లి వెలుతురు అక్టోబర్ 29:
కొడిపల్లి మండల కేంద్రంలో జాతీయ రహదారి 765 డి పైన వెల్మకన్న, కొట్లాల, లింగంపల్లి, మరియు అందుగులపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు కొడిపల్లి లోని కళాశాలలో చదువుకోవడానికి రోజు డబ్బులు పెట్టుకుని ఆటోలలో రావడం జరుగుతుందని వారికి బస్సు సౌకర్యం కల్పించాలని ఈరోజు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. విద్యార్థులు మాట్లాడుతూ అందుగులపల్లి నుండి కొడిపల్లిలో ఉన్న కళాశాలకు రావడానికి బస్సు సౌకర్యం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తక్షణమే వారికి అందుగులపల్లి నుండి కొడిపల్లి వరకు ఆర్టీసీ వారు బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకున్నారు. ఈ ధర్నాలో పాల్గొన్న జిల్లా బిజెపి నాయకులు రాజేందర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా ఆర్టీసీ డిపో మేనేజర్ పరమేశ్వర గారికి ఇదివరకే మెమోరాండం ఇవ్వడం జరిగిందని ఆమె రెండు రోజులలో బస్సును నడపని ఎడల ఇదే విద్యార్థులతో మెదక్ డిపో ముందర పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడికి సన్మానం

పోల నవీన్ కుమార్ ను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

కొడిపల్లి వెలుతురు అక్టోబర్ 29:
తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మెదక్ జిల్లా యూత్ అధ్యక్షునిగా నూతనంగా ఎంపికైన కొడిపల్లి గ్రామానికి చెందిన యువ నాయకుడు పోల నవీన్ కుమార్ ను నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని, నిరుపేద యువత ఉపాధి కల్పన, ఆర్థిక, సామాజిక రాజకీయ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిప్పే శెట్టయ్య మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు పిప్పే నర్సింలు, సంఘం నాయకులు పురుషోత్తం, జనార్దన్, దుర్గయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో రూ.5.16 కోట్లతో పలు వార్డుల్లో అభివృద్ధి పనులు

- 21వ వార్డులో రూ.1.20 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం
- జహీరాబాద్ పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట
- బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి అంతంతే..21వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహమ్మద్ గౌస్ విమర్శ

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 29:
పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పట్టణ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా రూ.5.16 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్,మాజీ మంత్రివర్యులు ,జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ ఎ. చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా 21వ వార్డులో సుమారు రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా 21వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ.. సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగడంతో పాటు వర్షాకాలంలో రహదారులపై ఏర్పడే సమస్యలు తగ్గుతాయని తెలిపారు. సీసీ డ్రైనేజీ నిర్మాణంతో మురుగునీరు సక్రమంగా ప్రవహించి పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కార్యరూపంలోకి తీసుకువస్తూ పట్టణంలోని ప్రతి వార్డును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని నాయకులు తెలిపారు. అభివృద్ధి పనులకు సహకరిస్తున్న ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్, మాజీ మంత్రివర్యులు,జహీరాబాద్ ఇంఛార్జి డాక్టర్ ఎ.చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్‌లకు మహమ్మద్ గౌస్ కృతజ్ఞతలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు జరగలేదని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి బ్యాచ్ మిత్రుల ఆర్థిక చేయూత

గుండాల: అక్టోబర్ 29 (వెలుతురు):
స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు పదో తరగతి బ్యాచ్ మిత్రులు. గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన కచ్చిగళ్ల యాదయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆయన కుమారుడు కచ్చిగళ్ల మధును పరామర్శించిన పదో తరగతి 2006--2007 బ్యాచ్‌కు చెందిన స్నేహితులు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రూ.17,600 ఆర్థిక సహాయాన్ని అందించి తమ స్నేహభావాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితుల ఔదార్యాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్యాచ్ మిత్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

పీఆర్సీ నివేదిక ఆధారంగా ఫిట్‌మెంట్ ప్రకటించాలి

- డీఎస్సీ--2003 ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలి
- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ డిమాండ్

జహీరాబాద్ వెలుతురు, అక్టోబర్ 29:
ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ జహీరాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు.
ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ పీఆర్సీ గడువు ముగిసి దాదాపు నెల రోజులు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు నివేదిక ప్రభుత్వానికి అందకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, దాని ఆధారంగా ఉపాధ్యాయులకు మెరుగైన ఫిట్‌మెంట్ ప్రకటించాలని కోరారు. వేతన సవరణ విషయంలో ప్రభుత్వం ఇకనైనా జాప్యం చేయకుండా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు.
అలాగే డీఎస్సీ--2003 నియామితులైన ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో నంబర్ 57, హైకోర్టు తీర్పు ప్రకారం పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన విధంగానే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించి, సంబంధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.
ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)పై వెంటనే కమిటీ ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు టీపీటీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ మండల శాఖ అధ్యక్షుడు ఎస్.కె. గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిరెడ్డి, జనార్దన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ జీవన్ రావు, జిల్లా కార్యదర్శి రామిరెడ్డి నర్సింలు, జహీరాబాద్ జోన్ నాయకులు పి. జగదీశ్వర్, శ్రీనివాస్, సంగారెడ్డి, శర్మ, ఫజల్ అహ్మద్, నాగరాజు, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పోలీసు సేవలను చేరవేయడమే 'సురక్ష' లక్ష్యం

- సాంకేతికతతో మారుతున్న సమాచార వ్యవస్థ
- పోలీసు వ్యవస్థలోని త్యాగాలు, సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: డిజిపి సి.వి. ఆనంద్
- స్థానిక భాషపై పట్టు ఉంటేనే ప్రజలతో మెరుగైన అనుసంధానం
- ప్రాంతీయ యాసలు, భాషా వైవిధ్యమే ప్రత్యేకత
- 'సురక్ష' దిన పత్రిక ప్రథమ వార్షికోత్సవంలో డిజిపి సి.వి. ఆనంద్

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 29:
మారుతున్న సమాచార వ్యవస్థలో పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలంగాణ డిజిపి, 'సురక్ష' దినపత్రిక ప్రధాన సంపాదకుడు సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. పోలీసులపై తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చినప్పుడు వాస్తవాలను ప్రజలకు వివరించడంతోపాటు, ప్రజా సమస్యలు, పోలీసు సేవలు, నేరాలపై అవగాహన కల్పించడంలో 'సురక్ష' కీలక పాత్ర పోషించాలని సూచించారు.తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్ష' దినపత్రిక ప్రథమ వార్షికోత్సవ సమావేశం గురువారం హైదరాబాద్‌లోని పేట్లబురుజులో ఉన్న సిటీ పోలీస్ కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమానికి డీజీపీ సి.వి. ఆనంద్ ప్రధాన సంపాదకుడి హోదాలో హాజరయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్, 'సురక్ష' కార్యనిర్వాహక సంపాదకుడు రమేష్ ఆయనకు స్వాగతం పలికారు. ప్రముఖ పాత్రికేయుడు పమిడికాల్వ మధుసూదన్, మామిడి హరికృష్ణ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, పోలీసు యూనిట్లకు చెందిన పీఆర్వోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సాంకేతికతతో మారుతున్న సమాచార వ్యవస్థ

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. సమాచార ప్రసార విధానంలో కాలానుగుణంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. గతంలో ఉర్దూ, ఆంగ్లం, తెలుగు పత్రికల ద్వారా ప్రజలకు వార్తలు చేరేవని, అనంతరం టీవీల ద్వారా పరిమిత సమయంలో వార్తలు ప్రసారమయ్యేవని గుర్తుచేశారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ప్రత్యక్ష ప్రసారాలు, సామాజిక మాధ్యమాలు విస్తృతమయ్యాయని చెప్పారు.ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉండటంతో సమాచారం క్షణాల్లో ప్రజలకు చేరుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను తక్షణమే తెలుసుకునే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. అయితే, సమాచారం వేగంగా వ్యాపిస్తున్న క్రమంలో అందులోని నిజానిజాలను నిర్ధారించడం సవాలుగా మారుతోందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత కారణాలతో పోలీసులపై తప్పుడు కథనాలు ప్రచురించడం, వాస్తవాలను వక్రీకరించడం జరుగుతోందన్నారు.

పోలీసుల సేవలు ప్రజలకు చేరాలి

పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొనే సవాళ్లు, సమాజం కోసం చేసే త్యాగాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని డిజిపి స్పష్టం చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల సందర్భంగా

నిర్వహించే రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు పోలీసుల సామాజిక బాధ్యతకు నిదర్శనమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు, ప్రత్యేక కథనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ోలీసు వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు, పెట్రోలింగ్ విధానాలు, కిడ్నాప్ కేసులు, వివిధ నేరాలకు సంబంధించిన వివరాలు, ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలను సురక్ష లో ప్రచురించాలని అన్నారు. కేసుల దర్యాప్తులో ఎదురయ్యే సవాళ్లు, తప్పిదాల నివారణ, సిబ్బంది మంచి పనులు, వివిధ నేరాల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతోపాటు, ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా ప్రత్యేక కథనాలు, వ్యాసాలు రూపొందించాలని తెలిపారు.

స్థానిక భాషపై పట్టు అవసరం

ప్రజలతో మాట్లాడేటప్పుడు స్థానిక భాషపై అవగాహన, పట్టు అధికారులకు ఎంతో అవసరమని డిజిపి అన్నారు. తెలుగు భాష ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. బ్రిటిష్ పాలనలో స్థానిక భాషల అధ్యయనానికి ప్రాధాన్యం ఇచ్చిన విధానాలను ప్రస్తావించారు. స్థానిక భాష తెలిసినప్పుడే ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలు, వారి ఆలోచనా విధానం, సామాజిక పరిస్థితులను అధికారులు అర్థం చేసుకోగలుగుతారని చెప్పారు.తెలుగు భాషకు విశేష సేవలందించిన సి.పి. బ్రౌన్ కడప ప్రాంతంలో పనిచేసిన సమయంలో తెలుగు సాహిత్య గ్రంథాల సేకరణ, ప్రచురణకు కృషి చేశారని గుర్తుచేశారు. ఇక్కడి విషయాలు, విశేషాలను ఇంగ్లీష్, జర్మన్ వంటి ఇతర భాషల్లోకి అనువదించడం ద్వారా భాషా సంపదను విస్తృతంగా పరిచయం చేసే అవకాశం కలిగిందన్నారు.తాను హైదరాబాద్‌లో జన్మించినందున ఇక్కడి ప్రాంతీయ భాషలు, యాసలు, సంస్కృతిపై తనకు ప్రత్యేక అవగాహన ఉందని డీజీపీ పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని ప్రాంతాలవారీగా భాషలో కనిపించే వైవిధ్యం, యాసలోని ప్రత్యేకత భాషకు మరింత అందాన్ని తెస్తాయని చెప్పారు. పోలీసు అధికారులు ప్రజలతో నేరుగా మాట్లాడే సమయంలో స్థానిక భాషపై పట్టు సాధిస్తే వారి సమస్యలను సులభంగా అర్థం చేసుకుని, మెరుగైన సేవలు అందించగలరని స్పష్టం చేశారు.

ప్రజలకు పోలీసు సేవలపై అవగాహన కల్పించాలి

పోలీసు శాఖలో చేపడుతున్న సంస్కరణలు, ప్రజలకు అందుబాటులో ఉన్న సేవలు, నేరాల నివారణకు తీసుకుంటున్న చర్యలను నిరంతరం ప్రజలకు తెలియజేయడమే 'సురక్ష' ప్రధాన లక్ష్యంగా ఉండాలని డీజీపీ సూచించారు. వార్తల ప్రచురణలో వాస్తవికత, స్పష్టత, ప్రజోపయోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. పోలీసు శాఖకు, ప్రజలకు మధ్య సమాచార వారధిగా 'సురక్ష' నిలవాలని ఆకాంక్షించారు.

అక్షర...సురక్ష..

పోలీసు శాఖ అందిస్తున్న సేవలు, నేరాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, విధి నిర్వహణలో పోలీసులు చేస్తున్న కృషిని ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా 'సురక్ష' దినపత్రికను ప్రారంభించినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్, సురక్ష కార్యనిర్వాహక సంపాదకుడు డా. యం. రమేష్ తెలిపారు. పోలీసు శాఖకు సంబంధించిన వార్తలను నిష్పక్షపాతంగా ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో ఈ పత్రికను తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.రాష్ట్రంలోని అన్ని పోలీసు యూనిట్లలో జరుగుతున్న కార్యక్రమాలు, సాధిస్తున్న విజయాలు, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ప్రచురించడం ద్వారా వివిధ జిల్లాలు, యూనిట్లలో జరుగుతున్న పరిణామాలు పోలీసు సిబ్బందితోపాటు ప్రజలకు కూడా తెలుస్తాయని వివరించారు. పోలీసు సేవలను ప్రజలకు చేరవేయడంలో 'సురక్ష' వారధిగా పనిచేస్తుందని అన్నారు.

పోలీసుల చరిత్రను వారే రాసుకోవాలి

బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రముఖ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వరరావు ఆలోచనలను ప్రస్తావించారు. తెలుగు భాష, జర్నలిజం, పత్రికల ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. కాలానుగుణంగా పత్రికలు తమను తాము ఆవిష్కరించుకుంటూ, పునర్నిర్మించుకుంటూ, పునరుజ్జీవనం పొందాలని పేర్కొన్నారు.
పోలీసుల సేవలు, త్యాగాలు, విజయాలను ప్రజలకు తెలియజేసేందుకు ప్రత్యేక పోలీసు పత్రిక అవసరమన్నారు. సింహాల చరిత్రను అవే రాసుకోకపోతే వేటగాడు రాసిందే చరిత్రగా మిగిలిపోతుందనే ఉదాహరణను ప్రస్తావిస్తూ.. పోలీసుల సేవలు, త్యాగాల గురించి పోలీసులే వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. డిజిటల్ రంగంలో 1957 నుంచి చోటుచేసుకున్న మార్పులను కూడా వివరించారు.

ఆకట్టుకునేలా భాష ఉండాలి

ప్రముఖ పాత్రికేయుడు పమిడికాల్వ మద్దతు మాట్లాడుతూ.. జర్నలిజంలో మాతృభాషపై అభిమానం, భాషపై పట్టు ఎంతో అవసరమన్నారు. మాట్లాడే భాషకు, రాసే భాషకు మధ్య తేడా ఉంటుందని, వార్తలు రాసే సమయంలో తగిన మెళకువలు నేర్చుకోవాలని సూచించారు. సరళమైన, మంచి భాషతో పాఠకులను ఆకట్టుకునేలా, ఆసక్తిగా చదివించే విధంగా వార్తలను వ్యక్తీకరించాలని పేర్కొన్నారు.

పోలీస్ మెగా హెల్త్ క్యాంప్

బషీర్ బాగ్ వెలుతురు 29 అక్టోబర్:
పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అబిడ్స్ డివిజన్ పరిధిలో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని అబిడ్స్ డివిజన్ పరిధిలోని నాంపల్లి రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్ నందు బృహత్ రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 'జీవనధార బ్లడ్ బ్యాంక్', నాంపల్లి మరియు అబిడ్స్ పోలీస్ స్టేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది.?ఈ రక్తదాన శిబిరంలో అబిడ్స్, నాంపల్లి పోలీస్ స్టేషన్ల సిబ్బందితో పాటు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, మొత్తం 80 మంది రక్తదానం చేశారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, సమాజ శ్రేయస్సు కోసం రక్తాన్ని అందించిన ప్రతీ ఒక్కరిని ఈ సందర్భంగా అబిడ్స్ ఏసీపీ శ్రీ పి. ప్రవీణ్ కుమార్ గారు అభినందించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీ పి. ప్రవీణ్ కుమాంఇ గారు మాట్లాడుతూ... సమాజ రక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి జ్ఞాపకార్థం రక్తదానం లాంటి మానవతా దృక్పథంతో కూడిన సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన పోలీస్ సిబ్బందికి, విద్యార్థులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబిడ్స్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కే. పరశురామ్, నాంపల్లి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సి.హెచ్. సైదులు, సబ్ ఇన్స్పెక్టర్లు (SIs) శ్రీకాంత్, శ్రీరాములు, తిరుమలేష్, ఆదిల్, పోలీసు సిబ్బంది మరియు జీవనధార బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై కళారూపాలతో ప్రజల్లో చైతన్యం:మంత్రి జూపల్లి

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తలెత్తే వర్షాభావం, నీటి ఎద్దడి, ఇతర దుష్పరిణామాల పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. పాటలు, కళా ప్రదర్శనలు, జానపద కళారూపాల ద్వారా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించుకోవడం, విద్యుత్ ఆదా చేయడం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళారూపాలు, పాటలు, నాటికలు, కళా ప్రదర్శనల ద్వారా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. కొన్ని జిల్లాల్లో సాంస్కృతిక సారథి కళాకారులు అందుబాటులో లేని విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆయా ప్రాంతాల్లో కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహించేందుకు ఇతర జిల్లాల కళాకారులను సర్దుబాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

బీసీ అధికారులకు ప్రాధాన్యత గల పోస్టింగుల్లో అవకాశం కల్పించాలి

- ప్రాధాన్యత గల శాఖలన్నీ ఒకే సామాజిక వర్గానికి కేటాయిస్తారా ?
- అనుభవం,నిజాయితీ,నిబద్ధత కలిగిన బీసీ అధికారులకు ప్రభుత్వం అండగా నిలవాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 29:
అనుభవం,నిజాయితీ, సిన్సియారిటీ,పరిపాలనా నైపుణ్యం కలిగిన బీసీ అధికారులకు ప్రభుత్వం అండగా నిలవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు ఈ సందర్భంగా ఆయన బీసీ భవన్ లో మాట్లాడుతూ బీసీ అధికారులకు ప్రాధాన్యత గల శాఖల్లో అవకాశాలు కల్పిస్తూ,వారి ప్రతిభకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు.పైరవీలకు తావు లేకుండా బీసీ వర్గాలకు చెందిన అధికారులు తమ ప్రతిభతో,కష్టపడి పనిచేసే తత్వంతో పరిపాలనా వ్యవస్థలో ముందుకు వస్తున్నప్పటికీ,వారికి కీలక బాధ్యతలు అప్పగించే విషయంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం వెనుకడుగు వేస్తుందన్నారు.అర్హతలు,అనుభవంపనితీరు ఆధారంగా బీసీ అధికారులకు కీలక పోస్టుల్లో అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లింగం గౌడ్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ బీసీ యువజన సంఘం నాయకులు గూడూరు భాస్కర్, చందూగౌడ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

ఆస్తి వివాదంలో తండ్రి పై కుమారుడు దాడి..

ఆస్తి వివాదం నేపథ్యంలో కన్నతండ్రిపై దాడికి పాల్పడిన కుమారుడికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.550 జరిమానా విధించింది. కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని నింబోలిఅడ్డలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డకు చెందిన మల్లేష్ యాదవ్‌పై ఆస్తి వివాదం కారణంగా ఆయన కుమారుడు నరేందర్(40) దాడి చేసి గాయపరిచాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కాచిగూడ పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం నరేందర్‌కు మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.550 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.

గర్భిణీ స్త్రీల , పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపండి

- గర్భిణీ స్త్రీలకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు, చికిత్స క్రమం తప్పకుండా చేయాలి
- పిల్లల వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను 100% పూర్తి చేయాలి
- జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 29:
పిల్లల వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను 100% పూర్తి చేయాలి క్యాచ్‌అప్ క్యాంపెయిన్ వ్యాక్సిలేషన్ ప్రోగ్రాం ద్వారా అసలే టీకాలు తీసుకొని పిల్లలకు , కొన్ని డోసులు తీసుకున్న పిల్లలకు ఈ క్యాంపైన్ ద్వారా అన్ని టీకాలు ఇవ్వాలని సూచించారు.. వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమీక్షించారు. బస్తీ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించండినాన్ కమ్యూనికేబుల్ డిసీస్ సర్వే, స్క్రీనింగ్, ఫాలో అప్ ప్రతిరోజు చేయాలి. హ్రూఎ వ్యాక్సిన్ ను అర్హులైన బాలికలకు గుర్తించి, ఇప్పించండి. మీ లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయండి. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు అవసరమైన అన్ని రకాల మందులు అందించాలి. ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నవి అని తెలియజేశారు. డా.పుట్ల శ్రీనివాస్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి , హైదరాబాద్ ఈ రోజు కంటోన్మెంటు క్లస్టర్ పరిధిలోని పికెట్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ సందర్శించారు. డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఐవీడనూ స్వయాన పిల్లల వైద్య నిపుణులు, సందర్శన సమయంలో

ఆరోగ్య కేంద్రానికి వచ్చిన పిల్లలకు స్వయాన పిల్లలకు పరీక్షలు చేసి చికిత్స అందించడం జరిగింది.
ఈ సందర్భంగా **DM&HO** గారు హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ కేంద్రాన్ని, వివిధ రికార్డులు మరియు పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. గర్భిణీ స్త్రీల, పిల్లల వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశారు. అన్ని వ్యాక్సిన్లు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిల్వ ఉంచుకోవాలని, వ్యాక్సిన్ శీతలీకరణను సమర్థవంతంగా నిర్వహించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. పిల్లలకు 100% వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని సూచించారు.
పట్టణ ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి నాణ్యమైన ఆరోగ్య సేవలు ప్రజలకు అందించాలి అనీ సూచించారు.
వైద్యులు ,సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు.
నాన్ కమ్యూనికేబుల్ డిసీస్ సర్వే, స్క్రీనింగ్, ఫాలో అప్ ప్రతిరోజు

చేసి తప్పకుండా సమాచారాన్ని అప్లోడ్ చేయాలని ఈ సందర్భంగా సూచించారు. అన్ని రకాల మందులను పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, బస్తీ దవాఖానలో నిల్వఉంచుకోవాలని కోరారు.
HPV వ్యాక్సిన్ ను అర్హులైన బాలికలకు త్వరితగతిన ఇప్పించండి. ఈ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి అని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో టీకాల కార్యక్రమాన్ని సమీక్షించి వైద్యులకు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గర్భిణీల స్త్రీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధులు నియంత్రణ, మలేరియా, డెంగీ, చికున్‌గునియా నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించి, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను డా.శ్రీధర్ ఐ×ూ తో కలిసి సందర్శించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము సందర్శించిన సమయంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారీ డా .విశాల్ మరియు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

రెండో పంట సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

బొమ్మలరామారం : రెండో పంట సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు.బొమ్మలరామారం మండలంలోని మర్యాల, చౌదర్ పల్లి, గ్రామంలో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో రెండో వరి పంట సాగులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.రైతులు కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుపై జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలన్నారు.అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలని సూచించారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ, తాసిల్దార్ రాధా, సింగిల్ విండో చైర్మన్ సింగర్తి మల్లేష్, ఆత్మ కమిటీ చైర్మన్ యనగండ్ల సుధాకర్, సింగిల్ విండో డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, మహిళా అధ్యక్షురాలు యంజాల కళ,రాజేష్ పైలెట్,పడమటి పావని, తిరుమల కవిత, శ్రీ రాములు నాయక్,రాజ మల్లారెడ్డి, సుదర్శన్,భగవంత్ రెడ్డి,ధనావత్ సునీత, సంగీత,ఎడమ పుష్ప, స్వప్న, సర్పంచులు గణేష్,రాములు, శంకరయ్య, వెంకటేష్, శ్రీను నాయక్, పావని, అద్ద మడుగు బాలకృష్ణ, గుండెబోయిన కుమార్

,మహిళ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అపోలో మెడికల్ కళాశాలలో 'వైట్ కోట్' వేడుక

- 152 మంది ఎంబీబీఎస్ విద్యార్థుల ప్రమాణం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29 : అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఏఐఎంఎస్ఆర్) ఆధ్వర్యంలో 'వైట్ కోట్' వేడుక నగరంలోని ఎమ్మెల్యే కాలనీలో ఉన్న రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలో 2026 బ్యాచ్‌కు చెందిన 152 మంది ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు వైట్ కోట్స్ అందజేశారు. రోగుల సంరక్షణ, వైద్య నైతికతకు కట్టుబడి ఉంటామని విద్యార్థులతో హిప్పోక్రటిక్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన అపోలో హాస్పిటల్స్ తెలంగాణ రీజియన్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ కే సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైట్ కోట్ వేడుక అనేది సైన్స్, మానవత్వం కలిసే ఒక ఉన్నతమైన వృత్తికి నాంది పలుకుతుందన్నారు. వైద్య రంగం కేవలం పరిజ్ఞానం, క్లినికల్ నైపుణ్యాన్ని మాత్రమే కాకుండా కరుణ, సానుభూతి, వినమ్రత, జవాబుదారీతనాన్ని కూడా కోరుకుంటుందన్నారు. వైద్య వృత్తిలో సుదీర్ఘ పని వేళలు, కుటుంబ వేడుకలను వదులుకోవడం వంటి ఎన్నో త్యాగాలు చేయాల్సి ఉంటుందన్నారు. అయితే, ఒక ప్రాణాన్ని కాపాడినప్పుడు కలిగే సంతృప్తి, రోగులు, వారి కుటుంబాల కృతజ్ఞత ఆ త్యాగాలకు సార్థకం చేకూరుస్తాయన్నారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా, వైద్యులు మానవజాతికి సేవ చేయాలనే తమ సంకల్పానికి కట్టుబడి ఉండాలన్నారు. అపోలో హాస్పిటల్స్ చైర్మన్, పద్మవిభూషణ్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి దార్శనికతతో 'హీల్ ఇన్ ఇండియా, హీల్ బై ఇండియా, హీల్ ఫ్రమ్ ఇండియా' అనే లక్ష్యంతో ఆరోగ్య సంరక్షణ రంగాన్ని ముందుకు తీసుకెళ్తోందన్నారు. అత్యుత్తమ క్లినికల్ సేవలు, వైద్య విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, డిజిటల్ హెల్త్‌కేర్ ద్వారా అపోలో భారతదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణను అందిస్తోందన్నారు. భవిష్యత్ వైద్యులుగా, విద్యార్థులు వైద్య పరిజ్ఞానం, క్లినికల్ నైపుణ్యాలు, వృత్తిపరమైన నైతికతలలో బలమైన పునాదిని ఏర్పరచుకోవాలన్నారు. వైద్య నైతికతకు మూలస్తంభాలైన నాలుగు సూత్రాలు స్వయంప్రతిపత్తి, ఉపకారం, హాని తలపెట్టకపోవడం, న్యాయమైన పంపిణీ ప్రతి నిర్ణయానికి మార్గదర్శకంగా నిలవాలన్నారు. రోగి హక్కులను గౌరవించడం, మంచి చేయడం, హాని కలిగించకుండా చూడటం, పరిమిత వైద్య వనరులను నిష్పక్షపాతంగా అందించడం వంటివి ముఖ్యంగా క్లిష్ట పరిస్థితుల్లో అత్యంత కీలకమైన బాధ్యతలన్నారు. వైద్య వృత్తి భావోద్వేగాలతో కూడుకున్నదన్నారు. వైద్యులు కొన్నిసార్లు ఎదురుదెబ్బలు, తీవ్రమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కోవచ్చున్నారు. పైగా ప్రతి ప్రాణాన్నీ కాపాడటం సాధ్యం కాకపోవచ్చున్నారు. అలాంటి సమయాల్లో తమ లక్ష్యాన్ని గుర్తు చేసుకోవడం, నైతిక ప్రమాణాలను పాటించడం, రోగులను గౌరవప్రదంగా చూసుకోవడం మరింత ముఖ్యమన్నారు. చికిత్స ఇక పని చేయని పరిస్థితుల్లో కూడా రోగి పట్ల కరుణతో కూడిన సంరక్షణ, ఉపశమన మద్దతు, వారి నిర్ణయాలకు గౌరవం ఇవ్వడం ఎంతో అవసరమన్నారు. వైద్యులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి సరికొత్త సాంకేతికతలను అందిపుచ్చుకోవాలన్నారు. అదే సమయంలో వైద్య రంగానికి ప్రాణమైన మానవీయ స్పర్శను కాపాడుకోవాలన్నారు. సాంకేతికత వైద్య రంగాన్ని మెరుగుపరుస్తుందని, కానీ సానుభూతికి, మానవ సంరక్షణకు ఏదీ ప్రత్యామ్నాయం కాలేదన్నారు. ప్రతి వైద్యుడూ గుర్తుంచుకోవాల్సిన ప్రధాన సూత్రం ఒక్కటేనన్నారు. రోగిని తమ కుటుంబ సభ్యుడిలా భావించి అంతే శ్రద్ధ, కరుణతో చికిత్స అందించడం అన్నారు. ఉన్నతమైన ఆశయాలతో, ఆత్మవిశ్వాసంతో శ్రేష్ఠత వైపు అడుగులు వేయాలన్నారు. కానీ వైద్య నైతికత విషయంలో ఎన్నడూ రాజీపడకూడదన్నారు. అన్నింటికంటే మిన్నగా వినమ్రంగా, సానుభూతితో మానవాళి సేవకు అంకితం కావాలన్నారు.

పరీక్ష ఫీజు అందించిన ఉన్నతి శిక్ష ఫౌండేషన్

తలకొండపల్లి వెలుతురు అక్టోబర్ 29: రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలంలోని 9 ప్రభుత్వ పాఠశాలలు, వెల్జాల్‌లో ఉన్న ఒకేషనల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 268 మంది విద్యార్థుల బోర్డు పరీక్ష రుసుమును ఉన్నతిడశిక్ష ఫౌండేషన్ నుండి చైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డి ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో వారికి అందజేయడం జరిగింది. చైర్మన్ సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాలను మరియు కళాశాలలను ప్రోత్సహిస్తే , నాణ్యమైన ఉచిత విద్యా అందుబాటులో ఉంటే విద్యార్థులు మంచి విజయాలు సాధించవచ్చు అనే ప్రేరణాత్మక లక్ష్యంతో మా ఫౌండేషన్ పనిచేస్తుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి పట్టుదలతో చదివి ఉత్తమ మార్కులు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తేవాలని మరియు ఉన్నతమైన స్థాయికి ఎదిగి సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ బండి రఘుపతి, సభ్యులు వసపుల రమేష్, మూడవత్ శివ, నితిన్, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాయుధ్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధభక్తులారా ఇప్పటికైనా మేల్కోండి!

- **దేశం కంటే ఏ పార్టీ గొప్పది కాదు!**
- **ధర్మం పేరుతో రాజకీయాలు కాదు భారతీయ ప్రజల కోసం పనిచేద్దాం!**
- **ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం! కాంగ్రెస్‌ను గెలిపిద్దాం!**
- **ఓటు హక్కు పరిరక్షణ కోసం నవంబర్ 1న ఢిల్లీలో జరిగే 'చలో ఢిల్లీ' మహా ర్యాలీలో పాల్గొనండి**
- **పి. ప్రసన్న కుమార్ శర్మ, జనరల్ సెక్రటరీ, టీపీసీసీ**

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 29, 2026: దేశభక్తి, హిందూ ధర్మం, సనాతన ధర్మం పేరుతో ప్రజలను భావోద్వేగాలకు గురిచేస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల విశ్వాసాలను ఉపయోగించుకునే ధోరణిని ప్రజలు ఇప్పటికైనా ప్రశ్నించాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ పి. ప్రసన్న కుమార్ శర్మ విజ్ఞప్తి చేశారు. భారతదేశం అంటే ఒక రాజకీయ పార్టీ కాదని, దేశభక్తి అంటే ఒక నాయకుడిని గుడ్డిగా సమర్థించడం కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, రాజ్యాంగ విలువలను గౌరవించడం, సామాన్య ప్రజల జీవితాలను మెరుగుపరచడం నిజమైన దేశసేవ అని ఆయన స్పష్టం చేశారు. దేశం కోసం… ధర్మం కోసం… అంటూ నిత్యం ఉపన్యాసాలు ఇచ్చే బీజేపీ నాయకులు, ఆ పార్టీ సానుభూతిపరులు, వాట్సాప్ గ్రూపులు మరియు సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేసే వారు ప్రజల ముందున్న వాస్తవ సమస్యలపై కూడా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఓడిపోతే దేశం ఓడిపోయినట్లా? బీజేపీ గెలిస్తేనే దేశం గెలిచినట్లా? అనే ప్రశ్నకు బీజేపీ నాయకులు సమాధానం చెప్పాలని ప్రసన్న కుమార్ శర్మ అన్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పార్టీని ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, ఎన్నికల్లో ఏ పార్టీని గెలిపించాలి, ఏ పార్టీని ఓడించాలి అనే నిర్ణయాధికారం పూర్తిగా ప్రజలదేనని పేర్కొన్నారు.

హిందూ ధర్మం ఏ ఒక్క రాజకీయ పార్టీ సొంతం కాదు!

హిందూ ధర్మం, సనాతన ధర్మం వేల సంవత్సరాలుగా కొనసాగుతున్న భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలు. వాటిని ఏ రాజకీయ పార్టీ సృష్టించలేదు. బీజేపీ పుట్టకముందు నుంచే ఈ దేశంలో దేవాలయాలు, పుణ్యక్షేత్రాలు, ఆధ్యాత్మిక గురువులు, వేద సంప్రదాయాలు, భక్తి ఉద్యమాలు ఉన్నాయి. కోట్లాది మంది ప్రజలు తమ విశ్వాసాలను తరతరాలుగా ఆచరిస్తున్నారు. అటువంటి ధార్మిక సంప్రదాయాలను ఒక రాజకీయ పార్టీకి పరిమితం చేయడం ఎంతవరకు సమంజసం? హిందువులమని చెప్పుకునే ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలనే భావనను ప్రజలపై రుద్దడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. హిందూ ధర్మాన్ని గౌరవించే వ్యక్తి కాంగ్రెస్‌లో ఉండకూడదా? సనాతన సంప్రదాయాలను విశ్వసించే వ్యక్తి మరో రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వకూడదా? ధర్మాన్ని గౌరవించడం ఒక వ్యక్తి విశ్వాసానికి సంబంధించిన విషయం. రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వడం ప్రజాస్వామ్య నిర్ణయం. ఈ రెండింటినీ కలిపి ప్రజలను భావోద్వేగాలకు గురిచేయడం సరికాదని ఆయన అన్నారు. ధర్మం పేరుతో ఓట్లు అడగడం ఒకటి; ధర్మాన్ని నిజంగా గౌరవించడం మరొకటి. ప్రజల మధ్య విద్వేషాలు పెంచకుండా, అన్ని మతాల ప్రజల హక్కులను కాపాడుతూ, సమానత్వం మరియు సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయడమే ప్రజాస్వామ్య ప్రభుత్వాల బాధ్యత.

SIR పేరుతో ఒక్క అర్హుడి
ఓటు హక్కు కూడా తొలగిపో కూడదు!

ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ప్రజలకు పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలని ప్రసన్న కుమార్ శర్మ డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలను శుద్ధి చేయడం, అనర్హుల పేర్లను తొలగించడం వంటి ప్రక్రియల పేరుతో నిజమైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడటం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. అర్హులైన పౌరుల ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. ఒక పౌరుడి ఓటు హక్కు అన్యాయంగా తొలగిపోతే, అది కేవలం ఒక పేరు జాబితా నుంచి తొలగిపోవడం మాత్రమే కాదు; ప్రజాస్వామ్య ప్రక్రియలో ఆ పౌరుడి భాగస్వామ్యానికి కలిగే నష్టం కూడా. సర్ ప్రక్రియలో పేర్లు తొలగించే ప్రమాణాలు ఏమిటి? అభ్యంతరాలు తెలియజేయడానికి ప్రజలకు తగిన సమయం ఇస్తున్నారా? తొలగించిన పేర్లకు సంబంధించి స్పష్టమైన సమాచారం అందిస్తున్నారా? అర్హులైన ఓటర్లు తమ హక్కును తిరిగి పొందేందుకు సరైన అప్పీల్ వ్యవస్థ ఉందా? అనే ప్రశ్నలకు ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ఓటర్ల పేర్ల తొలగింపు, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు సంబంధించిన ఆందోళనలను రాజకీయ విమర్శలుగా మాత్రమే కొట్టిపారేయకూడదు. వాటిని ఆధారాలతో పరిశీలించి, ప్రతి ఫిర్యాదుకు న్యాయమైన పరిష్కారం చూపాలి. ముఖ్యంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలకు సమాధానాలు రావాలి. ఎన్నికల సంఘం స్వతంత్రత, నిష్పాక్షికతపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టాల్సిన బాధ్యత రాజ్యాంగబద్ధ సంస్థలపై ఉంది. ఎన్నికల సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా పనిచేస్తోందనే అనుమానాలకు తావులేకుండా వ్యవహరించాలి. ఓటు ప్రజల హక్కు; అది ఏ ప్రభుత్వమూ, ఏ రాజకీయ పార్టీ కూడా ప్రసాదించే దానం కాదు. జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు, ఆయనను పదవి నుంచి తొలగించాలనే డిమాండ్లపై రాజ్యాంగబద్ధమైన, ప్రజాస్వామ్యబద్ధమైన చర్చ జరగాలి. అదే సమయంలో, సంబంధిత ఆరోపణలు మరియు ఫిర్యాదులను ఆధారాలతో పరిశీలించడం కూడా అవసరం. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి.

ఉత్తరప్రదేశ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ
ఎన్నికల ఫలితాలు బీజేపీకి హెచ్చరిక

ఇటీవల జరిగిన ఉత్తరప్రదేశ్ శాసన మండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలో ఉపాధ్యాయుల, పట్టభద్రుల నియోజకవర్గాల్లో సమాజ్‌వాదీ పార్టీ సాధించిన విజయాలు బీజేపీకి రాజకీయంగా ఎదురుదెబ్బగా నిలిచాయి. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆరు స్థానాలు గెలుచుకోగా, సమాజ్‌వాదీ పార్టీ ఐదు స్థానాలు సాధించింది. ఈ ఫలితాలను మొత్తం దేశ ప్రజల అభిప్రాయానికి ప్రతిబింబంగా చూడటం సరైంది కాకపోయినా, నిర్దిష్ట ప్రాంతాల్లో విద్యావంతులు, పట్టభద్రులు, ఉపాధ్యాయుల మద్దతును పొందడంలో రాజకీయ పార్టీలకు ఎదురవుతున్న సవాళ్లను ఇవి స్పష్టం చేస్తున్నాయి. నిరుద్యోగం, విద్యావ్యవస్థ, పోటీ పరీక్షల సమస్యలు, యువత భవిష్యత్తు, జీవన వ్యయం వంటి అంశాలు ప్రజల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి. దేశభక్తి నినాదాలు, మతపరమైన ప్రచారం మాత్రమే ఎన్నికల్లో శాశ్వత విజయాన్ని అందించలేవు. ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు తీసుకురావడం, వారి సమస్యలకు పరిష్కారాలు చూపడం ద్వారానే రాజకీయ పార్టీలు ప్రజల విశ్వాసాన్ని పొందగలవు.

కర్ణాటక ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు
ఎదురుదెబ్బ ఆత్మపరిశీలన అవసరం

ఇటీవల కర్ణాటకలో జరిగిన నాలుగు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోవడం ఆ పార్టీకి గట్టి రాజకీయ ఎదురుదెబ్బ. బీజేపీ మూడు స్థానాలు గెలుచుకోగా, జేడీఎస్ ఒక స్థానాన్ని సాధించింది. ఈ ఫలితాలను విస్మరించడం లేదా ఇతరులపై నిందలు వేయడం ద్వారా సమస్యను పరిష్కరించలేము. ప్రజల తీర్పును గౌరవిస్తూ, ఓటమికి దారితీసిన కారణాలను విశ్లేషించుకోవడం, క్షేత్రస్థాయిలో పార్టీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, పట్టభద్రులు మరియు ఉపాధ్యాయులతో నిరంతర సంబంధాలను కొనసాగించడం కాంగ్రెస్‌కు అవసరం. ఒక ఎన్నికలో ఎదురుదెబ్బ తగిలినంత మాత్రాన కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసేవా లక్ష్యాలు బలహీనపడవు. అయితే ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతర కృషి, బాధ్యతాయుతమైన నాయకత్వం, సమర్థవంతమైన సంస్థాగత నిర్మాణం తప్పనిసరి. తెలంగాణలోనూ, దేశవ్యాప్తంగానూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలపై మరింత చురుకుగా పనిచేయాలి. యువత, నిరుద్యోగులు, రైతులు, కార్మికులు, చిన్న వ్యాపారులు, మహిళలు మరియు సామాజికంగా వెనుకబడిన వర్గాల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలి. గెలుపు వచ్చినప్పుడు గర్వపడకూడదు; ఓటమి వచ్చినప్పుడు కుంగిపోకూడదు. ప్రజల తీర్పు నుంచి పాఠాలు నేర్చుకుని మరింత బలంగా ముందుకు సాగాలి.

డిజిటల్ ఇండియా ప్రచారం మాత్రమే కాదు
– ప్రజలకు నిజమైన ప్రయోజనం అందాలి

డిజిటల్ ఇండియా, డిజిటల్ చెల్లింపులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి అనుగుణంగా, ప్రజలకు వాస్తవంగా ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో కూడా పరిశీలించాలి. యూపీఐ, క్రెడిట్ కార్డు చెల్లింపుల విషయంలో కొన్ని వ్యాపార సంస్థలు విధిస్తున్న పరిమితులు, ఛార్జీలపై ప్రజల్లో ఉన్న సందేహాలకు స్పష్టత ఇవ్వాలి. ప్రతి డిజిటల్ లావాదేవీకి ఒకే విధమైన ఛార్జీ ఉంటుందని చెప్పడం సరైంది కాదు. చెల్లింపు విధానం, వ్యాపారి ఒప్పందం, వర్తించే నిబంధనల ఆధారంగా పరిస్థితులు మారవచ్చు. అయినప్పటికీ, వినియోగదారులకు పారదర్శకమైన సమాచారం అందించడం, చిన్న వ్యాపారులకు డిజిటల్ చెల్లింపులు సులభతరం చేయడం ప్రభుత్వ బాధ్యత. అలాగే అదానీ, అంబానీ వంటి పెద్ద కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ విధానాలు అనుకూలంగా ఉన్నాయనే ప్రతిపక్షాల విమర్శలపై కూడా కేంద్ర ప్రభుత్వం వాస్తవాల ఆధారంగా సమాధానాలు ఇవ్వాలి. సామాన్యుడి ఆదాయం, యువతకు ఉద్యోగాలు, చిన్న వ్యాపారుల పరిస్థితి, ధరల పెరుగుదల, ప్రజా సేవల నాణ్యత వంటి అంశాలపై ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందుంచాలి. పాకిస్థాన్, ఉగ్రవాదం, దేశ భద్రత వంటి అంశాలు ముఖ్యమైనవే. కానీ వాటితో పాటు నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, విద్య, ఆరోగ్యం, ధరల పెరుగుదల వంటి సమస్యలపైనా సమానంగా దృష్టి పెట్టాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారందరినీ దేశవ్యతిరేకులుగా చిత్రీకరించే ధోరణి ప్రజాస్వామ్యానికి మంచిది కాదు.

రామమందిరం పేరుతో రాజకీయాలు కాదు
– ప్రజలకు జవాబుదారీతనం కావాలి

రామమందిరం కోట్లాది హిందువుల విశ్వాసానికి సంబంధించిన పవిత్రమైన అంశం. ఆ విశ్వాసాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకుండా గౌరవించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. దేవాలయ నిర్మాణం కోసం సేకరించిన విరాళాలు, వాటి వినియోగానికి సంబంధించిన వివరాలపై ఎవరైనా ప్రశ్నలు లేవనెత్తితే, సంబంధిత సంస్థలు అందుబాటులో ఉన్న లెక్కలు, ఆడిట్ వివరాలు, అధికారిక సమాచారంతో సమాధానం ఇవ్వాలి. పారదర్శకతను కోరడం మతవ్యతిరేకత కాదు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం జవాబుదారీతనానికి నిదర్శనం. ధర్మం అంటే ప్రజల మధ్య విద్వేషాలు పెంచడం కాదు. ధర్మం అంటే న్యాయం, సత్యం, బాధ్యత, మానవత్వం. ఈ విలువలను రాజకీయాలకు అతీతంగా కాపాడినప్పుడే దేశం నిజమైన అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది.

2029 ఎన్నికలు – ప్రజాస్వామ్య
భవిష్యత్తును నిర్ణయించే అవకాశం

2029 సాధారణ ఎన్నికల దిశగా దేశ రాజకీయాలు కదులుతున్న తరుణంలో, కాంగ్రెస్ పార్టీతో సహా ప్రతిపక్షాలు ప్రజల విశ్వాసాన్ని సంపాదించేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేయాలి. బీజేపీ పాలనపై ప్రజలు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేసే వాతావరణం ఉండాలి. ప్రజలు ప్రభుత్వ పనితీరును పరిశీలించాలి. హామీలు ఎంతవరకు అమలయ్యాయి? యువతకు ఎన్ని ఉద్యోగాలు వచ్చాయి? సామాన్యుల జీవన వ్యయం తగ్గిందా? ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత కాపాడబడుతోందా? ఓటు హక్కుకు పూర్తి రక్షణ ఉందా? అనే ప్రశ్నలకు సమాధానాలు కోరాలి. బీజేపీని ఓడించాలా, మరో పార్టీకి అవకాశం ఇవ్వాలా అనే తుది నిర్ణయం ప్రజలదే. కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లి, రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, లౌకికవాదం, సమాన అవకాశాలు, ప్రజా సంక్షేమం కోసం కృషిచేయాలి. బీజేపీ దేశం కాదు. మోదీ దేశం కాదు. కాంగ్రెస్ కూడా దేశం కాదు. భారతదేశమే మనందరికీ ప్రథమ ప్రాధాన్యం. ఏ పార్టీ అయినా ప్రజల కోసం పనిచేసినప్పుడే ప్రజల మద్దతుకు అర్హత సాధిస్తుంది.

నవంబర్ 1న ఢిల్లీలో 'చలో ఢిల్లీ'

ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య పోరాటం

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ, ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల సంఘం నిష్పాక్షికతకు సంబంధించిన అంశాలపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనను బలోపేతం చేయడానికి నవంబర్ 1, 2026న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' మహా ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పి. ప్రసన్నకుమార్ శర్మ పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా తరలివెళ్లి, ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాలనే సందేశాన్ని దేశవ్యాప్తంగా వినిపించాలని ఆయన కోరారు. ఈ ర్యాలీ ఏ వ్యక్తి లేదా పార్టీపై వ్యక్తిగత ద్వేషాన్ని ప్రదర్శించడానికి కాదు; ప్రజాస్వామ్య సంస్థల జవాబుదారీతనం, ఎన్నికల పారదర్శకత, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న రాజకీయ నిరసనగా నిలవాలని పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా ఛానళ్లలో ప్రచారమయ్యే ప్రతి సందేశాన్ని గుడ్డిగా నమ్మవద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా బీజేపీకి అనుకూలంగా లేదా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వచ్చే సమాచారమైనా, దాని మూలాన్ని పరిశీలించి, విశ్వసనీయమైన ఆధారాలతో ధ్రువీకరించుకున్న తర్వాతే ఇతరులకు పంపాలని సూచించారు. అదే ప్రమాణం కాంగ్రెస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీల ప్రచారానికీ వర్తించాలి. దేశం కోసం… ధర్మం కోసం… అంటూ నినాదాలు చేయడం కంటే, భారతీయ ప్రజల కోసం పనిచేద్దాం. ప్రజల హక్కులను కాపాడుదాం. రాజ్యాంగాన్ని గౌరవిద్దాం. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం.

కేటీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన
కంచుకట్ల సుభాష్

హైదరాబాద్ వెలుతురు, అక్టోబర్ 29: గురువారం రోజున హైదరాబాదులో కల్వకుంట్ల తారక రామారావు ఐటి మరియు పట్టణాభివృద్ధి శాఖ తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు గారిని మర్యాదపూర్వకంగా తెలంగాణ భవన్ లో కలిసినాము. గతంలో నల్గొండ జిల్లాలో ఉన్న ఫ్లోరోసిస్ సమస్యను ఇంటింటికీ మిషన్ భగీరథ త్రాగునీటి పథకం దాని అమలు విధివిధానాల గురించి చర్చించడం జరిగింది. అదేవిధంగా ఫ్లోరోసిస్ వ్యాధిగ్రస్తుల జీవన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మిషన్ భగీరథ తాగునీరు అన్ని గ్రామాలకు సక్రమంగా అందుతున్నదా ఏమైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా? ప్రస్తుత ప్రభుత్వము క్రమం తప్పకుండా త్రాగునీటి సరఫరా అందుతుందా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా శివన్నగూడ ప్రాజెక్టు పనులు ఏ విధంగా జరుగుతున్నాయి వాటి వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వై .లక్ష్మణరావు శ్రామిక వికాస కేంద్రం కొల్లాపూర్, కంచుకట్ల సుభాష్ రాష్ట్ర కన్వీనర్ ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద పరిస్థితుల్లో
దళిత యువకుడి మృతి

- **సమగ్ర విచారణ జరపాలి: ఎమ్మెల్యే పాయల్ శంకర్**
- **మూడు రోజుల్లో నిష్పక్షపాత విచారణ పూర్తి చేయాలి**
- **బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.50 లక్షల పరిహారం అందించాలి**

ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 29: ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స కోసం చేరిన ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. యువకుడు రాసినట్లు చెబుతున్న సూసైడ్ నోట్‌లో వైద్యుల నిర్లక్ష్యం, పోలీసుల వేధింపుల గురించి ప్రస్తావించిన నేపథ్యంలో, ఈ అంశాలన్నింటిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిన్న రాత్రి తేలు కుట్టడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు వచ్చిన యువకుడు, అనంతరం ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చికిత్స అందించిన విధానం, వైద్యుల బాధ్యతలు, పోలీసుల వ్యవహారశైలి, సూసైడ్ నోట్‌లో పేర్కొన్న అంశాలపై ఎలాంటి పక్షపాతం లేకుండా విచారణ జరగాలని అన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతతో తీసుకొని మూడు రోజుల్లోగా నిష్పక్షపాత విచారణ పూర్తి చేసి, సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. విచారణ నివేదికను ఆదిలాబాద్‌లోని అన్ని దళిత సంఘాలకు అందజేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్నందున, వారికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఎమ్మెల్యే కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు రూ. 50 లక్షల ఆర్థిక పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు వైద్యం అందించాల్సిన వైద్య వ్యవస్థలోనూ, రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థలోనూ బాధ్యతాయుతమైన వ్యవహారశైలి ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విచారణలో ఎవరి నిర్లక్ష్యం లేదా తప్పిదం బయటపడినా, చట్టప్రకారం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నీటి ఎద్దడి నివారణకు
అమృత్ పథకం ద్వారా ప్రత్యేక చర్యలు

-ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 29: ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా అమృత్ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని డైట్ కళాశాల వద్ద అమృత్ పథకంలో భాగంగా చేపడుతున్న ఇంకుడు గుంత నిర్మాణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మున్సిపాలిటీలోని 10 వార్డుల్లో రూ. 50 లక్షల వ్యయంతో 10 ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో నీటి కొరతను తగ్గించవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా చెరువులు కలుషితం కాకుండా నివారించేందుకు, మురుగునీటిని శుద్ధి చేసే వ్యవస్థల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నీటి సరఫరాలో కొరత ఏర్పడకుండా అమృత్ పథకం కింద ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల (ఛ్చా=) నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ పనులను అధికారులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరారు.

జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామును కలిసిన

తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు డి.వి.వి.సత్యనారాయణ

జాతీయ శెట్టిబలిజ సంఘం నాయకులు భేటీ

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 29: గురువారం రోజున హైదరాబాదులో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రాము గారిని తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ చేరికల కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, తెలంగాణ జనసేన పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి, గడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేషనల్ బీసీ దళ్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు మరియు జాతీయ శెట్టిబలిజ సంఘం కన్వీనర్ డి.వి.వి. సత్యనారాయణ, జాతీయ శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు గుబ్బల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఛ జనసేన నాయకులు కె.వి. రావు , జాతీయ శెట్టిబలిజ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చింతపల్లి వెంకటేశ్వరరావు వర్కింగ్ ప్రెసిడెంట్ వాసంశెట్టి శ్రీనివాస్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జనసేన పార్టీ సీనియర్ నాయకులు గుండు విజయకుమార్ గారు తదితరులు మర్యాదపూర్వకంగా భేటీ..ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎలక్షన్ లో కాకినాడ మేయర్ బీసీ మహిళకు కేటాయించిన సందర్భంగా కాకినాడ ప్రాంతానికి చెందిన శ్రీమతి కదలి ఈశ్వరి గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, సీనియర్ జనసేన నాయకురాలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.. కావున వారి యొక్క సీనియారిటీ మరియు బీసీ శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకురాలు శ్రీమతి కదలి ఈశ్వరి గారికి జనసేన పార్టీ మరియు కూటమి భాగస్వామ్య పార్టీలు కాకినాడ మేయర్ సీటు కేటాయించాలని పవన్ కళ్యాణ్ గారికి మరియు ప్రధాన కార్యదర్శి గారికి జాతీయ శెట్టిబలిజ సంఘం తరపున వినతి పత్రం సమర్పించడం జరిగింది..

పాతిపెట్టిన డ్రమ్ముల్లో కట్టల కొద్దీ నగదు

-ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో స్వాధీనం

ప్రయాగ్ రాజ్, వెలుతురు అక్టోబర్ 29 : భూమిలో పాతిపెట్టిన డ్రమ్ముల్లో నుంచి కుప్పల కొద్దీ నోట్ల కట్టలు బయటపడడం కలకలం రేపింది. డ్రమ్ముల్లో నుంచి నగదు భారీ మొత్తంలో బయటపడడం చూసి పోలీసు అధికారులు సైతం నివ్వెరపోయారు. సుమారు 5 గంటల పాటు జరిగిన ఓ ఆపరేషన్లో కోట్ల రూపాయల సొమ్మును పోలీసులు స్వాధీనం చేసుకుని వాటిని సీజ్ చేశారు. ఈ సంఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్లో బుధవారం జరిగింది.

అసలేం జరిగింది?

పోలీసులు కథనం ప్రకారం, బరాయిపూర్ గ్రామానికి చెందిన రాకేశ్ యాదవ్ అలియాస్ మహాకాల్ అనే వ్యక్తికి చెందిన పూర్వీకుల ఇంట్లో దొంగిలించిన డబ్బును దాచి ఉంచారని పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో గంగానగర్ డీసీపీ సోమన్ కుమార్, గంగానగర్ ఏడీసీపీ పుష్కర్ వర్మలతో కూడిన పోలీసు బృందం సంఘటనా స్థలానికి చేరుకుని ఆపరేషన్ చేపట్టింది. అనుమానిత ఇంటి లోపల తవ్వకాలు జరపగా, భూమిలో పూడ్చిపెట్టిన మూడు పెద్ద డ్రమ్ములు బయటపడ్డాయి. ఆ డ్రమ్ములను తెరిచి చూసిన పోలీసు అధికారులు, అందులో కట్టల కొద్దీ ఉన్న నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నగదు మొత్తాన్ని సీజ్ చేసి, తదుపరి లెక్కింపు, దర్యాప్తు కోసం సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. భద్రతా చర్యల్లో భాగంగా అంతకుముందు, పోలీసులు గ్రామం మొత్తానికి విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు.

పోలీసుల అదుపులో నిందితుడు

ఈ రికవరీ అనంతరం, ఆ ఇంట్లో మరిన్ని ఆధారాలు సేకరించేందుకు రాకేశ్ యాదవ్‌కు చెందిన తోటలు, వ్యవసాయ భూములను కూడా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి రాకేశ్ యాదవ్ సోదరుడు బబ్లూను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అంత పెద్ద మొత్తంలో డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది, దాని మూలాలు ఏమిటనే దానిపై కుటుంబ సభ్యులను సుదీర్ఘంగా విచారణ జరుపుతున్నారు. ఈ కేసు తీవ్రత దృష్ట్యా, ఆ ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అదనపు బలగాలను మోహరించి గట్టి భద్రతను ఏర్పాటు చేశారు పోలీసులు.

పశ్చిమాసియాలో నెలకొన్న

ప్రతిష్ఠంభనకు ముగింపు పలకాలి

- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పిలుపు
- ఇరాన్- అమెరికా యుద్ధం వేళ కీలక పరిణామం

టెహ్రాన్, వెలుతురు, అక్టోబర్ 29 : అవసరమైతే ఇరాన్‌పై మళ్లీ సైనిక దాడులు చేపడతామని అమెరికా హెచ్చరించిన నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న ప్రతిష్ఠంభన స్థితి ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. ఇరాన్ ఇకపై సందిగ్ధ స్థితిలో ఉండకూడదని, స్పష్టమైన వైఖరి తీసుకోవాలని కోరింది అని ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు. సుప్రీం లీడర్ ఖమేనీ జారీ చేసిన ఈ ఆదేశాన్ని అమలు చేయడానికి, నెరవేర్చడానికి పూర్తి సామర్థ్యంతో, చిత్తశుద్ధితో తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఆ దేశ మంత్రి వర్గానికి తెలియజేశారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సన్నద్ధత అవసరం : పెజెష్కియన్

దేశంలోని ప్రస్తుత పరిస్థితులు, దాని నిర్వహణ, జాతీయ స్థితిస్థాపకతను పెంపొందించడం, శత్రువుల ముప్పులను ఎదుర్కోవడంపై ఇరాన్ మంత్రివర్గం బుధవారం చర్చించిందని మసూద్ పెజెష్కియన్ తెలిపారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి నిరంతరం సన్నద్ధత అవసరమని అన్నారు. "మంత్రులు, అన్ని విభాగాలు అవసరాలకు అనుగుణంగా పూర్తి సంసిద్ధతను కొనసాగించాలి. ఏదైనా బెదిరింపులు, ఆంక్షలు, బాహ్య ఒత్తిడి ఎదురైనప్పటికీ దేశ ఉత్పాదకతను పెంచి జాతీయ శక్తిని, స్థితిస్థాపకతను బలోపేతం చేయాలి. శత్రువులు ఇరాన్ ప్రజల సంకల్పాన్ని బలహీనపర్చగలమని, దేశాన్ని లొంగిపోయేలా బలవంతం చేయగలమని భావించకూడదు." అని పెజెష్కియన్ పేర్కొన్నారు.

'వికసిత్ భారత్ యువ సంవాద్ నో యువర్ వోట్' నిర్వహించిన మై భారత్

- ఎన్నికలపై అవగాహన పెంపొందించడానికి 14 రాష్ట్రాలు, యూటీల్లో నిర్వహణ
- ప్రజాస్వామ్య విలువలను నిలబెడతామని, పౌర భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తామని ప్రజాస్వామ్య ప్రతిజ్ఞ చేసిన యువత

హైదరాబాద్ పిఐబి వెలుతురు 29 అక్టోబర్ 2026: గురువారం రోజున వికసిత్ భారత్ యువ సంవాద్ నో యువర్ వోట్ కార్యక్రమాన్ని యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖకు చెందిన యువజన వ్యవహారాల విభాగం పరిధిలోని మేరా యువ భారత్ (మై భారత్) నిర్వహించింది. ప్రజాస్వామ్యంలో ఎన్నికలపై అవగాహనను పెంపొందించడానికి, సమాచారంతో కూడిన బాధ్యతాయుతమైన యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ప్రచారంలో భాగంగా 10 రాష్ట్రాలు, 4 కేంద్రపాలిత ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఓటు హక్కులు, పౌర బాధ్యతలు, ప్రజాస్వామ్య విలువలపై చర్చించడానికి విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, యూత్ ఐకాన్లు, ప్రముఖ క్రీడాకారులు, సంస్థల అధిపతులను ఈ కార్యక్రమాలు ఒకే వేదికపైకి తీసుకువచ్చాయి. 26.10.2026 నుంచి 05.11.2026 వరకు దేశవ్యాప్తంగా ఉన్న 500 విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, సంస్థల్లో ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులతో నేరుగా సంభాషించే, వికసిత్ భారత్—2047 దిశగా సాగే ప్రయాణంలో ప్రజాభాగస్వామ్యంపై తమ ఆలోచనలను పంచుకొనే వేదికను తొలిసారి ఓటు వేస్తున్న వారితో సహా యువతకు అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం. అక్టోబర్ 28 నాటికి దేశవ్యాప్తంగా మొత్తం 27 యువ సంవాద్ కార్యక్రమాలను నిర్వహించారు. వీటిలో 5,856 మంది యువత పాల్గొన్నారు.ఉత్తర భారతదేశంలో ఢిల్లీ, గురుగ్రామ్, పంచకుల, రాజౌరీ, జమ్ములో ఉన్న విద్యాసంస్థల్లో ఈ రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ తరన్‌జిత్ సింగ్ సంధు, క్రీడాకారులు శ్రీ అర్జున్ సింగ్ నాగ్రా, శ్రీ అజీత్ యాదవ్ హాజరయ్యారు. పంచకుల, సుందర్నగర్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత పాల్గొన్నారు.మధ్య భారతంలో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన కార్యక్రమాలు ఎన్నికల అవగాహన, యువజన నాయకత్వం, బాధ్యతాయుతమైన పౌరసత్వంపై దృష్టి సారించాయి. షియోపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులతో పార్లమెంట్ సభ్యులు శ్రీ శివమంగళ్ సింగ్ తోమర్ సంభాషించారు. రాయ్‌గఢ్‌లో లోక్‌సభ ఎంపీ శ్రీ రాధేశ్యామ్ రాథియా, మై భారత్ జాయింట్ డైరెక్టర్ శ్రీ రమణ్ పటేల్ సమక్షంలో ఈ చర్చతో పాటు నెహ్రూ యువ పోర్టల్ నమోదును కూడా నిర్వహించారు.తూర్పు భారతంలో ఫన్నీదేవాలో మై భారత్ డార్జిలింగ్ ఆధ్వర్యంలో యువ సంవాద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (వీబీవైఎల్‌డీ) పై ప్రెజెంటేషన్, నో యువర్ వోట్‌పై చర్చలు, ఓటరు అవగాహన ప్రతిజ్ఞ, ప్రజాస్వామ్య విలువల పట్ల పౌరుల నిబద్ధతను చాటే సిగ్నేచర్ వాల్ ఉన్నాయి. ఇవే కాకుండా బీహార్, పశ్చిమ బెంగాల్‌లోని ఇతర ప్రాంతాల్లో కూడా కార్యక్రమాలు జరిగాయి.

జహీరాబాద్ హోటళ్లలో కుళ్లిన కూరగాయలు

- వంటగదుల్లో అపరిశుభ్రత.. తాగునీటి ట్యాంకుల్లోనూ లోపాలు
- నాసిరకం టీ పొడి స్వాధీనం.. యాజమాన్యాలకు ఏడు రోజుల గడువు
- లోపాలు సరిచేయకుంటే లైసెన్సులపై చర్యలు ఆహార భద్రతాధికారి రాజేశ్వరి

సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 29 : ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ కల్తీ, నాసిరకం ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆహార భద్రతాధికారులు హెచ్చరించారు. గురువారం జహీరాబాద్ పట్టణంలోని పలు హోటళ్లు, భోజనశాలలు, మిఠాయి దుకాణాల్లో జిల్లా ఆహార భద్రతాధికారులు తనిఖీలు నిర్వహించారు.ఆహార భద్రతాధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో పలు హోటళ్లలో పాడైపోయిన కూరగాయలు, నాసిరకం సరుకులను గుర్తించారు. అలాగే, కొన్ని దుకాణాల్లో విక్రయిస్తున్న నాసిరకం టీ పొడిని స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులకు హెచ్చరికలతో కూడిన నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ప్రజలకు హానికరమైన ఆహార పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యాపారులు పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ, నాణ్యమైన ఆహార పదార్థాలనే విక్రయించాలని సూచించారు.

లోపాలను గుర్తించిన అధికారులు

జహీరాబాద్ లోని ఆయా దాబాల్లో, హోటలలో వంటగది నేల ఎగుడుదిగుడుగా, మురికిగా ఉండటం, గోడలకు రంధ్రాలు ఏర్పడటం, గోడలపై పెచ్చులు ఊడిపోవడం, కార్మికులు తల టోపీలు, చేతితొడుగులు ధరించకపోవడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. తాగునీటి నిల్వ ట్యాంకు పగిలి ఉండటంతోపాటు, నీటిలో ధూళి కణాలు కనిపించినట్లు పేర్కొన్నారు. మరుగుదొడ్డి అపరిశుభ్రంగా ఉండటం, నేల జారే విధంగా ఉండటం, మురిగిపోయిన వంకాయలు, క్యాబేజీ, టమాటాలను వినియోగించడం, నిల్వ గదిలో కుళ్లిన టమాటాలు కనిపించడం, మూతలు లేని చెత్తబుట్టలు ఉండటం వంటి అంశాలను నోటీసులో ప్రస్తావించారు. ఈ లోపాలపై ఏడు రోజుల్లోగా వివరణ సమర్పించాలని మెస్ యాజమాన్యాన్ని ఆదేశించారు. సంబంధిత ఆహార భద్రతా లైసెన్సును ఎందుకు నిలిపివేయకూడదో వివరించాలని, ఆహార భద్రత, ప్రమాణాల చట్టం--2006లోని 54, 56 సెక్షన్ల కింద తదుపరి చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలియజేయాలని నోటీసులో పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌లో రష్యా డ్రోన్ దాడి

- దిన్‌ప్రో రైల్వే స్టేషన్‌లో 13 మంది మృతి
- పది మందికి గాయాలైనట్లు అధ్యక్షుడు జెలెన్స్కీ వెల్లడి

దిన్‌ప్రో, వెలుతురు అక్టోబర్ 29 : ఒకవైపు యుద్ధానికి ముగింపు పలికేందుకు దౌత్య ప్రయత్నాలు.. మరోవైపు ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న దాడులు. కొన్ని ప్రాంతాల్లో మానవతా సహాయం అందించేందుకు తాత్కాలిక కాల్పుల విరమణ అమలవుతున్నప్పటికీ, ఇతర ప్రాంతాల్లో దాడులు ఆగడం లేదు. తాజాగా ఉక్రెయిన్‌లోని డ్నిప్రో నగర ప్రధాన రైల్వే స్టేషన్‌పై రష్యా జెట్ ఇంజిన్‌తో నడిచే డ్రోన్ దాడి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రయాణికులు రైలు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో జరిగిన ఈ దాడిలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో పది మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్స్కీ వెల్లడించారు. తొలుత ఐదుగురు గాయపడినట్లు ప్రాంతీయ గవర్నర్ ప్రకటించగా, అనంతరం వెలువడిన సమాచారం ప్రకారం క్షతగాత్రుల సంఖ్య పెరిగింది.

రైలు బయలుదేరే వేళ.. మృత్యుదాడి

ఉక్రెయిన్ ప్రభుత్వ రైల్వే సంస్థ ఉక్ర్‌జలిజ్నిట్సియా వెల్లడించిన వివరాల ప్రకారం.. డ్నిప్రో నగరం నుంచి దక్షిణ ప్రాంతంలోని జపోరిజ్జియా నగరానికి వెళ్లేందుకు ఓ ప్రయాణికుల రైలు సిద్ధంగా ఉంది. రైలు ఎక్కేందుకు ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌పై వేచి ఉన్నారు. ఈ సమయంలో జెట్ ఇంజిన్‌తో నడిచే రష్యా డ్రోన్ ప్లాట్‌ఫామ్‌ను ఢీకొట్టింది. ఈ దాడిలో 13 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు.డ్నిప్రో ప్రాంతీయ గవర్నర్ ఒలెక్సాండర్ హంజా తొలుత కనీసం ఐదుగురు గాయపడినట్లు తెలిపారు. నగర మేయర్ బోరిస్ ఫిలాటోవ్ కూడా ఘటన తీవ్రతను ప్రస్తావించారు. అనంతరం అధ్యక్షుడు జెలెన్స్కీ ప్రయాణికుల రైళ్లపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, పది మంది గాయపడినట్లు వెల్లడించారు. రైలు ఎక్కేందుకు వచ్చిన ప్రయాణికులను లక్ష్యంగా మారడం ఈ ఘటనలో అత్యంత విషాదకరమైన అంశం. ఉద్యోగాలు, కుటుంబ అవసరాలు, వైద్య చికిత్సలు, ఇతర అత్యవసర పనుల కోసం ప్రజలు నిత్యం రైళ్లలో ప్రయాణిస్తుంటారు. యుద్ధ పరిస్థితుల్లోనూ సాధారణ జీవితం కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్న పౌరులు ఇలాంటి దాడులతో ప్రాణభయాన్ని ఎదుర్కొంటున్నారు.

కన్న కూతురిని గొంతు నులిమి చంపిన తల్లి

- ఉరివేసుకున్నట్లు చిత్రీకరించి హత్యను కప్పిపుచ్చే యత్నం
- పోస్టుమార్టం నివేదికతో వెలుగులోకి నిజం.. నిందితురాలు అరెస్ట్

రంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 29 : కన్న కూతురి మరణాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించి తప్పించుకోవాలనుకున్న తల్లి బండారం పోస్టుమార్టం నివేదికతో బయటపడింది. మొబైల్ ఫోన్ అధికంగా వినియోగించడం, మాట వినడం లేదనే కారణాలతో తరచూ గొడవ పడుతున్న తల్లి.. చివరకు ఆగ్రహంతో కుమార్తె గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 14 ఏళ్ల బాలిక సువర్ణ అలియాస్ లక్కీ హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమె తల్లి ముయ్యాది విజయలక్ష్మి (34)ను పోలీసులు అరెస్ట్ చేశారు.కొత్తూరులోని హనుమాన్ టెంపుల్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ముయ్యాది రాజు కుమార్తె సువర్ణ అలియాస్ లక్కీ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈ నెల 27న బాలిక ఇంట్లో ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. కుటుంబ సభ్యులు తొలుత ఆమెను కొత్తూరులోని ఆసుపత్రికి, అనంతరం వైద్యుల సూచన మేరకు షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కొత్తూరు పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గొంతు నులిమి.. ఉరేసుకున్నట్లు చిత్రీకరణ

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఆధారాలు సేకరించి, మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. గొంతు నులిమివేయడం వల్లే బాలిక మృతి చెందినట్లు సూచించే వైద్య నివేదిక రావడంతో కేసు కీలక మలుపు తిరిగింది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తును వేగవంతం చేశారు. పోలీసుల విచారణ ప్రకారం, అక్టోబర్ 27న సాయంత్రం సుమారు 5.30 గంటలకు ఇంట్లో తల్లీకూతుళ్ల మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన విజయలక్ష్మి బాలిక గొంతును రెండు చేతులతో నులిమినట్లు, దీంతో ఆమె మరణించినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. అనంతరం హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు బాలిక మెడకు చీర కట్టి ఉరివేసుకున్నట్లు కనిపించేలా చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. ఆ తర్వాత కూరగాయలు కొనుగోలు చేయడానికి బయటకు వెళ్లిన ఆమె, తిరిగి వచ్చాక కుమార్తె ఆత్మహత్య చేసుకుందని కేకలు వేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

వైద్య నివేదిక ఆధారంగా అరెస్ట్

పోస్టుమార్టం నివేదికతో పాటు ఇతర ఆధారాలను పోలీసులు విశ్లేషించి విచారించారు. విచారణలో ఆమె ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. నిందితురాలికి చెందిన మొబైల్ ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. సేకరించిన ఆధారాలు పరిశీలించిన అనంతరం నిందితురాలిని అక్టోబర్ 29న ఆమెను అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల అనంతరం న్యాయస్థానంలో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. షాద్‌నగర్ జోన్ డీసీపీ ఎస్. శిరీష, షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ పి. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో కొత్తూరు పోలీసులు కేసును దర్యాప్తు చేశారు.

బీజేపీ పోరుబాట..

(మొదటిపేజీ తరువాయి)

గుర్తుచేశారు. సింగరేణిలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలు, 22ఏ భూముల వ్యవహారం, ధరణి-భూ భారతి అంశాలపై బీజేపీ చేస్తున్న పోరాటాలకు కూడా ఆయన అండగా నిలిచారని పేర్కొన్నారు.

ధరణి, భూ భారతి పేర్లతో భూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వాలు, భూముల వ్యవహారాల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రూ.2,000 పింఛన్‌ను రూ.4,000కు పెంచుతామని, మహిళలకు స్కూటీలు ఇస్తామని, విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అయితే వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.

కిలో బియ్యం ధర రూ.100 వరకు పెరిగే పరిస్థితి వస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించడం సిగ్గుచేటని మహేశ్వర్ రెడ్డి అన్నారు. ధరలు పెరుగుతాయని ప్రకటించడం కాకుండా, వాటిన నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తే మిల్లర్ల అక్రమాలు, బియ్యం దారి మళ్లింపు, అక్రమ నిల్వలకు సంబంధించిన కోట్ల రూపాయల విలువైన బియ్యం వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ అక్రమాలను అరికట్టకుండా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జవహర్‌నగర్ డంప్ యార్డ్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు న్యాయం జరిగే వరకు, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని తెలిపారు.

దేశం కోసం యువత నడుం బిగించాలి

ఎంపీ డీకే అరుణ

పాలమూరు వెలుతురు 29, అక్టోబర్, 2026:

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ లైబ్రరీ ఆడిటోరియంలో మేరా యువ భారత్ మహబూబ్‌నగర్, ఉద్భవ్ సేవా సంసద్ ఆధ్వర్యంలో "యువ సంసాద్" కార్యక్రమం విజయవంతంగా జరిగింది. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలనే ఉద్దేశంతో 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్' నినాదంతో పాటు 'ఎస్ఐఆర్'పై యువతకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశం కోసం యువత నడుం బిగించాలని, ఉన్నత చదువులపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. మత్తుకు బానిసై తమ అమూల్యమైన జీవితాలను చిత్తు చేసుకోవద్దని హితవు పలికారు. చాలా మంది 'ఎస్ఐఆర్' అంశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, దీనిద్వారా అర్హులైన వాస్తవికులకు ఓటు హక్కు లభించి దేశ అభివృద్ధికి తోడ్పడుతుందని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీ కోసం కాదని, కేవలం దేశ భద్రత కోసం మాత్రమే పనిచేస్తుందని అవగాహన కల్పించారు.

ఈ అవగాహన సదస్సులో పాలమూరు యూనివర్సిటీ వీసీ వీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్ బాబు, డీన్ మధుసూదన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సెల్ అధికారి డాక్టర్ ప్రవీణా పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా యువజన అధికారి కోటా నాయక్, జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్, ఉద్భవ్ సేవా సంసద్ అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి, ప్రొఫెసర్ అర్జున్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

డిజిటల్ మోసాలకు బ్యాంకులదే బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైతే తాత్కాలికంగా నిలిపివేయడం బ్యాంకుల బాధ్యతగా ఉండాలని కోర్టు పేర్కొంది. అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధారించేందుకు భౌతిక ధ్రువీకరణ వంటి నివారణ చర్యలను అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. మోసానికి గురవుతున్న ఖాతాదారుల అసాధారణ లావాదేవీలపై సమీప పోలీస్‌స్టేషన్లను అప్రమత్తం చేయాలని సూచించింది. గత ఏడాదితో పోలిస్తే డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50 శాతం తగ్గాయని కేంద్రం తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ విభాగాల సమన్వయం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల కారణంగా ఈ తగ్గుదల సాధ్యమైందని వివరించారు.

చదువుకున్నవారూ ఎందుకు మోసపోతున్నారు?

ప్రజా చైతన్య కార్యక్రమాలు, మీడియా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ విద్యావంతులు సైతం డిజిటల్ అరెస్టు మోసాలకు బలవుతుండటంపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. మొబైల్ ఫోన్ ద్వారా ఎవరినీ అరెస్టు చేయలేరనే ప్రాథమిక విషయాన్ని ప్రజలు గుర్తించాలని సూచించారు. ఈ తరహా మోసాలు ఇంకా కొనసాగుతున్నాయని అమికస్ క్యూరీ సీనియర్ న్యాయవాది ఎన్.ఎస్. నాప్పినై కోర్టుకు తెలిపారు. ఇటీవల ఓ మహిళ ఇలాంటి మోసంలో రూ.2.5 కోట్లు కోల్పోయిన ఘటనను ప్రస్తావించారు. డిజిటల్ అరెస్టు పేరుతో ఎవరైనా బెదిరింపులకు గురైతే భయపడకుండా వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోర్టు సూచించింది.

తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ

(మొదటిపేజీ తరువాయి)

రంగాల్లో హైదరాబాద్ ఇప్పటికే ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిందని గోయల్ అన్నారు. తెలంగాణలోని తాండూరు కందులు, నిజామాబాద్ పసుపు వంటి ప్రత్యేక ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో మంచి అవకాశాలున్నాయని చెప్పారు. జీఐ ట్యాగ్ కలిగిన తాండూరు కందులను ఆస్ట్రేలియాకు ఎగుమతి చేసినట్లు తెలిపారు. ఫార్మా, బయోటెక్‌తో పాటు ఏరోస్పేస్, డిఫెన్స్, క్వాంటం కంప్యూటింగ్ రంగాలపై తెలంగాణ మరింత దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ విజయగాథలో కేంద్ర ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని స్పష్టం చేశారు.

3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యమే మా గమ్యం : రేవంత్

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్రం నిర్దేశించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగానే తెలంగాణ ముందుకు సాగుతోందన్నారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంలో తెలంగాణ 10 శాతం వాటా అందించేలా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగే దిశగా సాగుతోందని, ఈ ప్రయాణంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

రాష్ట్రానికి రెండు కొత్త విమానాశ్రయాలకు కేంద్రం అనుమతులు ఇవ్వడం అభివృద్ధికి మరింత ఊతమిస్తుందన్నారు. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి కేంద్రం ఇప్పటికే హామీ ఇచ్చిందని, ఇది హైదరాబాద్ అభివృద్ధికి మరో గేమ్ ఛేంజర్‌గా మారుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఏరోస్పేస్ రంగానికి మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, ఆర్థిక సంస్కరణలకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పునాదులు వేశారని గుర్తుచేశారు. పీవీ తెలంగాణకు చెందిన వ్యక్తి కావడం గర్వకారణమన్నారు.

ఐటీ, ఫార్మాలో నాయకత్వం: శ్రీధర్‌బాబు

తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ ఇప్పటికే నాయకత్వ స్థానంలో ఉందని, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లోనూ నగరం తన ప్రత్యేకతను చాటుతోందన్నారు. వచ్చే తరాలను నైపుణ్య శక్తిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. పెట్టుబడులకు అనుకూల వాతావరణం, మౌలిక వసతులు, నైపుణ్యమున్న మానవ వనరులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వివరించారు. డిసెంబర్‌లో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరై రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలకు శ్రీధర్‌బాబు ఆహ్వానం పలికారు.

పెట్టుబడుల సాధనలో తెలంగాణ ముందంజ

కొత్త రాష్ట్రం అయినప్పటికీ పెట్టుబడుల సాధనలో తెలంగాణ దేశంలోనే ముందువరుసలో ఉందని భారత్ బయోటెక్ సీఎండీ సుచిత్ర ఎల్లా అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పెట్టుబడులను ఆకర్షించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆమె ప్రశంసించారు. జీనోమ్ వ్యాలీ నుంచే కోవాగ్జిన్ వంటి ప్రపంచస్థాయి టీకా అభివృద్ధి చెందిందని గుర్తుచేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో హైదరాబాద్‌కు అపార అవకాశాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పారిశ్రామికవేత్తలు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణలో వివిధ రంగాల్లో సాధించిన పురోగతి, పెట్టుబడులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రజంటేషన్ ఇచ్చారు.

మోదీ కంచుకోటల్లో బీజేపీకి బిగ్ షాక్..

(మొదటిపేజీ తరువాయి)

కేవలం 307 ఓట్ల మెజారిటీతో గట్టెక్కిందని గుర్తుచేశారు.

వారణాసి ఓటమిపై మోదీ సమాధానం చెప్పాలి

కర్ణాటకలో కాంగ్రెస్ ఓటమిని చూపిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న బీజేపీ నేతలు, వారణాసి, నాగ్‌పూర్ ఫలితాలపై కూడా అదే ప్రమాణంతో స్పందించాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మోదీకి నైతికత ఉంటే ఈ ఫలితాలకు బాధ్యత వహించి, ప్రజల తీర్పును అంగీకరించాలని అన్నారు. మీడియాను ఎదుర్కొనే ధైర్యం ప్రధానికి లేదని విమర్శిస్తూ, ట్వీట్లకే పరిమితం కాకుండా ప్రెస్‌మీట్ నిర్వహించి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. యువత, విద్యావంతులు, ఉద్యోగుల్లో బీజేపీ పాలనపై అసంతృప్తి పెరుగుతోందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో బీజేపీ వ్యతిరేక శక్తులకు ప్రజా మద్దతు బలపడుతోందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు.

ఓట్ల తొలగింపుపై పోరు ఆగదు.. నవంబర్ 1న ఢిల్లీలో భారీ నిరసన

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (సర్) పేరుతో ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు నవంబర్ 1న ఢిల్లీలో రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ఆటంకాలు సృష్టించినా వెనక్కి తగ్గబోమన్నారు. తెలంగాణ నుంచి వేలాది మంది, దేశవ్యాప్తంగా లక్షలాది మంది తరలివస్తారని తెలిపారు.

రాష్ట్రానికి అమిత్ షా పర్యటనతో ఒరిగేదేమీ లేదని వ్యాఖ్యానించారు. ప్రకృతి విపత్తులపై రాజకీయాలు చేయడం తగదని, ఎల్‌నినో వంటి పరిణామాలపై బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. కొండా సురేఖకు కాంగ్రెస్ అండగా ఉంటుందని, అనిరుధ్ నిధుల అంశాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో నిధుల కొరతకు గత బీఆర్ఎస్ పాలనే కారణమని విమర్శించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు

మందమర్రి, వెలుతురు 29, అక్టోబర్, 2026:

స్థానిక ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించిన డిసిసి అధ్యక్షుడు రఘునాథ రెడ్డి.ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ..చెన్నూరు,పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాలలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మంత్రి వివేక్ వెంకటస్వామి,ఎంపీ వంశీ క్రిష్ణ లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బిజెపి నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నరని అన్నారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారని కాంగ్రెస్ మంత్రులు,ఎంపీలు నిరసనలు ధర్నాలు చేపడితే బిజెపి నాయకులు తప్పు పట్టడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు.పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధి కి కృషిచేసిన దివంగత నేత కాకా వెంకటస్వామి కుటుంబాన్ని విమర్శించే ముందు బిజెపి నాయకులు నిజ నిజాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు.కాంగ్రెస్ ఓటు బ్యాంకును తగ్గించాలనే ఉద్దేశంతోనే బిజెపి ప్రభుత్వం సర్ ప్రక్రియను తీసుకొచ్చిందని,నవంబర్ ఒకటవ తేదీ న సర్ ప్రక్రియను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు భారీఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

అర్నబ్ తుపాన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం

అయినా ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం: వైయస్ జగన్ ధ్వజం

తాడేపల్లి. వెలుతురు 29, అక్టోబర్, 2026:

వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్, అర్నబ్ తుపాన్ ప్రభావిత జిల్లాల పార్టీ అధ్యక్షులతో విషయాలు ఆరా తీశారు. ఈ పరిస్థితుల్లో రైతులు, ప్రజలకు పూర్తి అండగా ఉండాలినాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో మమేకం కావాలిప్రతి అడుగులో రైతులు, ప్రజలకు తోడుగా నిలబడాలని అన్నారు.. వ్యవస్థలన్నీ దిగజారాయి. దీంతో అంతా డ్రామా: అర్నబ్ తుపాన్ ఇంకా పూర్తిగా తగ్గలేదు. ఎక్కడా నష్టం అంచనా జరగలేదు. ఎక్కడా పూర్తిగా సహాయ కార్యక్రమాలు లేవు. విద్యుత్ సరఫరా కూడా పునరుద్ధరణ లేదు. వాలంటీర్లు లేకపోవడం వల్ల గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారింది. ఆర్బీకేలు లేవు. ఉచిత పంటల బీమా లేదు. దీంతో వ్యవస్థలన్నీ దిగజారిపోయాయి. ఇంత జరుగుతున్నా చంద్రబాబు ఏమంటున్నారు

సీసీ కెమెరాల ద్వారా పంట నష్టం అంచనా చేస్తున్నారంట. ఇక్కడ ఆర్‌టీజీఎస్‌లో కూర్చుని మానిటర్ చేస్తే సరిపోతుందా? మరోవైపు పంట నష్టాలపై ఇష్టానుసారం లెక్కలు చెబుతున్నారు. ఒకసారి వరి పంట 1.70 లక్షల ఎకరాల్లోనూ, ఉద్యాన పంటలు 24 వేల ఎకరాల్లోనూ నష్టపోయాయని చెబుతారు. మళ్లీ సాయంత్రానికి ఆ లెక్కలన్నీ మారిపోతున్నాయి. ఎక్కడా సీరియస్‌నెస్ లేదు.

నష్టాన్ని తక్కువగా చూపే ప్రయత్నం చేస్తున్నారు:

ప్రాథమిక సమాచారం ప్రకారం దాదాపు 12 లక్షల ఎకరాల్లో తీవ్ర నష్టం జరిగింది. కోనసీమ, ఉభయ గోదావరి, అనకాపల్లి జిల్లాల్లో వరి పంట నష్టం చాలా ఎక్కువగా ఉంది. వరి పంట ఇప్పుడు పొట్టకొచ్చింది. తుపాన్ వల్ల పంటలు మునిగిపోగా, రైతులకు చాలా నష్టం కలుగుతోంది. ఉచిత పంటల బీమా లేక నష్టం మరింత ఎక్కువైంది. ఇంకా కొబ్బరి, అరటి.. ఆక్వాకు చాలా నష్టం కలిగింది.

ఏరియేటర్లు నడవక ఆక్వా పంట దెబ్బ తింది. ఇవన్నీ కళ్లెదుటే కనిపిస్తున్నా, నష్టం పెద్దగా జరగలేదని ప్రచారం చేస్తున్నారు. అస్సలు పట్టించుకోవడం లేదు. వరి పంటలో ఎకరాకు రూ.40 వేలు, అరటిపై ఎకరాకు రూ.2 లక్షలు, ఆక్వా ఎకరాకు దాదాపు రూ.45 లక్షల వరకు నష్టపోతున్నా, ప్రభుత్వం చాలా తక్కువగా చూపే ప్రయత్నం చేస్తోంది.రైతులను ఆదుకోని కూటమి ప్రభుత్వం: గత ఏడాది మొంథా తుపాన్ వల్ల కలిగిన నష్టంలో దాదాపు రూ.600 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పటికీ, ఇంకా ఇవ్వలేదు. సున్నా వడ్డీ పంట రుణాలు లేవు. ఉచిత పంటల బీమా లేదు. మొన్నటిదాకా కరవు. ఇప్పుడు తుపాన్. రెండింటి వల్ల రైతులకు చాలా నష్టం కలిగింది.

తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో బలవన్మరణాలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు, ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి, అంటే 2024 జూన్ నుంచి ఒక్క రూపాయి సాయం చేయలేదు. నాడు మన ప్రభుత్వ హయాంలో ఏదైనా సీజన్‌లో పంట నష్టం జరిగితే, ఆ తర్వాత పంటకు ఉచిత విత్తనాలు ఇచ్చాం. ఇప్పుడు అది లేదు. అన్నదాత సుఖీభవలో మూడేళ్లలో రూ.60 వేలు ఇస్తామని చెప్పి కేవలం రూ.19 వేలు ఇచ్చి, రూ.41 వేలు బకాయి పడ్డారు. ఆర్బీకేలతో పాటు, ఈ?క్రాప్ నిర్వీర్యం చేశారు. సున్నా వడ్డీ పంట రుణాలు లేవు.

సిండికేట్‌గా మారి దోపిడి:

మరో వైపు కేజీ బియ్యం రూ.80 నుంచి రూ.90 వరకు ఉంది.మొత్తం సిండికేట్‌గా మారి బియ్యం ఎగుమతి చేస్తున్నారు. సీజ్ ది షిప్ అన్నారు. సీజ్ లేదు. షిప్ లేదు. నాదెండ్ల మనోహర్. చినబాబుకు కమిషన్లు. వ్యాపారం చేసేది పయ్యావుల కేశవ్ తదితరులు. కృష్ణా, గోదావరి డెల్టాలో పండించిన పంటలు చేతికి రాక, ఇంకా నష్టం జరుగుతోంది. దీంతో బియ్యం ధరలు ఇంకా ఎంత పెరుగుతాయో అన్న భయం అందరిలో ఉంది.ఇప్పుడు దారుణమైన పాలన.

తుపాన్ బాధితుల చేయి పట్టుకుని నడిపించాలి:

మనం ప్రతి అడుగులో తుపాన్ బ్యాధితులైన ప్రజలు, రైతులకు అండగా ఉండి, చేయి పట్టుకుని నడిపించాల్సిన అవసరం ఉంది. మరీ ముఖ్యంగా జోన్?1 లో ప్రభావం చాలా ఎక్కువగా ఉంది. అయినా ప్రతి చోటా మనం ప్రజలు, రైతులకు అండగా నిలబడాలి. రంగు మారిన ధాన్యం, తడిసిన ధాన్యం కొనిపించే ప్రయత్నం చేయాలి.

తుపాన్ వస్తే ఒక్కరూ చనిపోకూడదు అంటారు. ఇక్కడ 8 మంది చనిపోయినా, చంద్రబాబు మాత్రం అంతా సవ్యంగా ఉందంటాడు. ఆర్‌టీజీఎస్‌లో కూర్చుని సీసీ కెమెరాల్లో చూసి, పంట నష్టం తెలుసుకున్నా అంటాడు. మొత్తం సహాయ కార్యక్రమాలు చూశానంటాడు. అందుకే ఇంత దారుణమైన పాలన గతంలో ఎక్కడా చూడలేదన్న శ్రీ వైయస్ జగన్.. గ్రామాల్లో రైతులు, ప్రజలకు తోడుగా, అండగా ఉండాలని, ఈ విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని దిశా నిర్దేశం చేశారు.

పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం, రైతు సంక్షేమం) ఎంవీయస్ నాగిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మండలి డిప్యూటీ ఛైర్మన్ తూమాటి మాధవరావు తదితరులు వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి హాజరు కాగా.. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీవీ మిథున్‌రెడ్డి, కురసాల కన్నబాబు. గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు. ఆళ్ల అయోధ్యరామిరెడ్డితో పాటు.. పార్టీ జిల్లాల అ్యధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి (కోనసీమ), దాడిశెట్టి రాజా (కాకినాడ), చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (తూర్పు గోదావరి), ముదునూరి ప్రసాదరాజు (పశ్చిమ గోదావరి), బి.ప్రసాద్ (అనకాపల్లి), పేర్ని వెంకట్రామయ్య (నాని) (కృష్ణా), మత్స్య విశ్వేశ్వరరాజు (అల్లూరి సీతారామరాజు), పరీక్షిత్‌రాజు (పార్వతీపురం మన్యం), బెల్లాన చంద్రశేఖర్ (విజయనగరం), ధర్మాన కృష్ణదాస్ (శ్రీకాకుళం), అంబటి రాంబాబు (గుంటూరు), మేరుగు నాగార్జున (బాపట్ల), దేవినేని అవినాష్ (ఎన్టీఆర్), కెకె రాజు (విశాఖ) తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు

జనగణనలో ఓబీసీ కాలమ్ తప్పనిసరి

మంత్రి పొన్నం ప్రభాకర్

- కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి కులగణన అమలుకు కృషి చేయాలి
- రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యకు మంత్రి విజ్ఞప్తి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29:

దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో కులగణనను కూడా నిర్వహించి, ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీలకు ప్రత్యేక కాలమ్‌ను తప్పనిసరిగా చేర్చాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు బీసీ సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీసీ ప్రజాప్రతినిధులు సమష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

సచివాలయంలో రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో ఓబీసీ కులగణన ప్రాధాన్యతను వివరించిన మంత్రి, జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ లేకపోవడంపై తన ఆందోళనను వ్యక్తం చేశారు. గతంలో జనగణనలో కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆగస్టు 14న వెల్లడించిన 40 ప్రశ్నల్లో ఎస్సీ, ఎస్టీ, ఇతరులు అనే విభజన ఉందని, ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ లేదని మంత్రి పేర్కొన్నారు. కులాల వారీగా జనాభా వివరాలు సేకరించినప్పుడే ఓబీసీల వాస్తవ జనాభా ఎంత ఉందో స్పష్టంగా తెలుస్తుందని అన్నారు.

రిజర్వేషన్లకు కచ్చితమైన గణాంకాలు అవసరం

రిజర్వేషన్లను 50 శాతానికి మించి అమలు చేయాల్సిన సందర్భాల్లో న్యాయస్థానాలు కులాల వారీగా కచ్చితమైన జనాభా వివరాలు, అనుభవాధారిత గణాంకాలను కోరుతున్నాయని మంత్రి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్‌ను చేర్చడం ద్వారా అవసరమైన గణాంకాలను సేకరించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. 2011 తర్వాత ప్రస్తుతం జనగణన చేపడుతున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని వినియోగించుకుని కులగణనను కూడా సమగ్రంగా నిర్వహించాలని ఆయన కోరారు. జనగణనలో కులగణనను చేర్చాలని తెలంగాణ శాసనసభ ఇప్పటికే ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని గుర్తుచేశారు.

అమిత్ షాను కలిసి డిమాండ్ చేయాలని విజ్ఞప్తి

త్వరలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణకు రానున్న నేపథ్యంలో, రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, బీసీ సంఘాల ప్రతినిధులను సమన్వయం చేసుకుని ఆయనను కలవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. జనగణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్‌ను చేర్చాలనే ఒకే డిమాండ్‌తో కేంద్ర హోంమంత్రికి విజ్ఞప్తి చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యను కోరారు.

బీసీలకు సామాజిక న్యాయం కల్పించేందుకు కీలకం

జనగణనలో ఓబీసీ కాలమ్‌ను చేర్చడం ద్వారా బీసీల జనాభాకు సంబంధించిన కచ్చితమైన వివరాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ గణాంకాల ఆధారంగా చట్టసభల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల పెంపుపై విధాన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు బడ్జెట్ కేటాయింపులు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలుకు అవసరమైన ప్రక్రియను సులభతరం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా వారికి న్యాయం జరగాలంటే కచ్చితమైన కులగణన గణాంకాలు అవసరమని పేర్కొంటూ, ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి అన్ని వర్గాల నుంచి సమష్టిగా విజ్ఞప్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

ఉస్మానియా ఆస్పత్రి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- కీలక ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి దామోదర ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29:

నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్, గోషామహల్‌లో నిర్మిస్తున్న ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ రెండు కీలక ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతిపై గురువారం సెక్రటేరియట్‌లో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టుల కింద ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణ పనుల పురోగతి, తదుపరి చేపట్టాల్సిన పనులపై మంత్రి అధికారులతో చర్చించారు. గోషామహల్‌లో ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నూతన భవన నిర్మాణ పనులు 23 శాతం పూర్తయ్యాయని, నిమ్స్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్‌లో భాగంగా భవన నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఈ రెండు ప్రాజెక్టులు కీలక పాత్ర పోషించనున్నాయని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పనులు ముందుకు సాగేలా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు.

సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి మంత్రి వెంకన్న అండ

- ఈనాడు జర్నలిస్ట్ దివంగత దత్తురెడ్డి భార్య ప్రియాంకకు న్యాక్‌లో అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఉద్యోగం
- సంగారెడ్డిలో ఉద్యోగ అవకాశం కల్పించిన మంత్రి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29:

ఒక కుటుంబానికి కష్టం వచ్చినప్పుడు అండగా నిలబడటమే కాదు.. మానవీయకోణంలో ఇచ్చిన మాట ప్రకారం భరోసాగా నిలిచే నిజమైన నాయకుడు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి. అందులో భాగంగానే దివంగత ఈనాడు జర్నలిస్ట్ దత్తురెడ్డి కుటుంబానికి అండగా నిలిచి, గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చి మరోసారి తన మానవతా హృదయాన్ని చాటుకున్నారు. గతేడాది ఈనాడు జర్నలిస్ట్ దత్తురెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కామారెడ్డి జిల్లాలోని దత్తురెడ్డి స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ క్లిష్ట సమయంలో కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు, తక్షణ సాయంగా రూ.4 లక్షలు అందజేశారు. అంతటితో తన బాధ్యత ముగిసిందని భావించకుండా.. కుటుంబానికి భవిష్యత్తులోనూ అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. దత్తురెడ్డి భార్య ప్రియాంకకు తన శాఖ పరిధిలో ఉద్యోగం కల్పిస్తానని నాడు హామీ ఇచ్చారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి, తాజాగా ప్రియాంకకు న్యాక్‌లో అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్‌గా సంగారెడ్డిలో ఉద్యోగ అవకాశం కల్పించారు. అంతేకాకుండా, ఆమె ఉద్యోగాన్ని పర్మినెంట్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రియాంకకు భవిష్యత్తులోనూ అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

తమ కష్టకాలంలో అండగా నిలిచి, ఇచ్చిన హామీని నెరవేర్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రియాంకతో పాటు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి చూపిన మానవత్వం, జర్నలిస్టు కుటుంబం పట్ల ఆయన తీసుకున్న చొరవపై పలువురు జర్నలిస్టులు సైతం ధన్యవాదాలు తెలిపారు. కష్టాల్లో ఉన్న జర్నలిస్ట్ కుటుంబానికి భరోసా కల్పిస్తూ, ఒక కుటుంబ భవిష్యత్తుకు అండగా నిలవడం అభినందనీయమని వారు హర్షం వ్యక్తం చేశారు.

అర్నబ్ తుఫాన్ దెబ్బకు వంజంగి రహదారి ధ్వంసం

- కొండచరియలు, భారీ బండరాళ్లతో రాకపోకలకు అంతరాయం..
- ఏజెన్సీ ప్రాంతంలో ఇబ్బందులు

అల్లూరి, వెలుతురు అక్టోబర్ 29:

ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం వంజంగి మేఘాల కొండకు వెళ్లే ప్రధాన రహదారి అర్నబ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్నది. భారీ వర్షాల ధాటికి కొండచరియలు విరిగిపడి, పెద్ద పెద్ద బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తుఫాన్ ప్రభావంతో అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతంలోని పలు మండలాల్లోనూ రహదారులు దెబ్బతినడం, చెట్లు కూలిపడటం, వాగులు పొంగిపొర్లడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వంజంగి మేఘాల కొండకు వెళ్లే మార్గంలో పరిస్థితి పర్యాటకులు, స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. దెబ్బతిన్న రహదారిని పరిశీలించి, కొండచరియలు, బండరాళ్లను తొలగించి రాకపోకలు పునరుద్ధరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు

ఆర్.కె.పురం చెరువు ఆక్రమణలకు హైడ్రా అడ్డుకట్ట

12 ఎకరాల ఎఫ్‌టీఎల్ పరిధిని కాపాడుతూ ఫెన్సింగ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 29:

నగరంలో మినీ ట్యాంక్‌బండ్‌గా ఆర్.కె. పురం చెరువు(ముక్కిడికుంట) పేరుగాంచింది. ఈ చెరువు కబ్జాలకు హైడ్రా గురువారం చెక్ పెట్టింది. 12 ఎకరాల మేర ఆక్రమణలను తొలగించి కంచె వేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఎవరికి వారు ప్రీకాస్ట్ వాల్స్ నిర్మించుకుని, కంచెలు వేసుకుని తలా కొంత అని పంచేసుకున్నట్టు జరిగిన కబ్జాలకు హైడ్రా చెక్ పెట్టింది. ఆక్రమణలకు పాల్పడి కబేలాలుగా వినియోగించుకుని.. చెరువులోకి వ్యర్థాలను పారబోసిన వారిని నియంత్రించింది. ప్రికాస్ట్ వాల్స్‌తో వేసిన ప్రహరీలను తొలగించింది. చెరువులో ముందు ముందు ఆక్రమణలకు ఆస్కారం లేకుండా హైడ్రా గురువారం ఫెన్సింగ్ వేసింది. అలాగే చెరువు ఎఫ్‌టీఎల్ భూములుగా సూచిస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరి మండలం, మౌలాలి సర్కిల్ పరిధిలోని ఆర్.కె. పురం చెరువు మొత్తం 75 ఎకరాలు. ఈ చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దారు. ఇందులో 11 ఎకరాల మేర శాశ్వత నిర్మాణాలు వచ్చేశాయి. మరో 12ఎకరాల మేర ఆక్రమణల పర్వం మొదలైంది. చెరువు పరిధిలో పందుల వధశాల నిర్వహణ, వ్యర్థాల వల్ల కాలుష్యం, నిర్మాణాల అంశాలపై స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో పరిశీలించిన హైడ్రా గురువారం ఆక్రమనలు తొలగించి.. చెరువు పరిధిని కాపాడుతూ ఫెన్సింగ్ వేసింది.

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు బీజేపీకి గుణపాఠం

- మోదీ ప్రాతినిధ్యం వహించే వారణాసిలో రెండుచోట్లా ఓటమి
- ఆర్ఎస్ఎస్ మెయిన్ ఆఫీసున్న నాగపూర్ లోనూ పరాజయమే..
- రాజ్యాంగ బద్ధ పాలన కోసం రాహుల్ నేతృత్వంలో రెండో స్వాతంత్ర్య సంగ్రామం
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను పదవి నుంచి తప్పించాలి
- తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్ మల్లు రవి

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 29:

దేశవ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి ప్రజలు చెప్పిన గుణపాఠమని తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి విమర్శించారు. సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహించే వారణాసి స్థానంలో రెండుచోట్లా బీజేపీ ఓడిపోవడం, చివరికి ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగపూర్‌లోనూ ఘోర పరాజయం పాలుకావడం బీజేపీ గ్రాఫ్ వేగంగా పడిపోతోంద అనడానికి స్పష్టమైన నిదర్శనమని స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇద్దరూ నాగపూర్‌కు చెందిన వాళ్లేనని, కానీ అక్కడ కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండియా కూటమి 10 స్థానాలు, ఇద్దరు ఇండిపెండెంట్లు గెలిచారని, అంటే దేశంలో బీజేపీకి ఏ స్థాయిలో వ్యతిరేకత ఏర్పడిందో తెలుస్తోందన్నారు. "ప్రధాని మోదీ వారణాసిలో రెండు సీట్లు ఓడిపోయిన విషయాన్ని మీడియా ఎందుకు ప్రముఖంగా రాయలేదు?" అని మల్లు రవి ప్రశ్నించారు.

నేడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కీలక భేటీ

నేడు మధ్యాహ్నం 3:30 గంటలకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కీలక సమావేశం జరగనుందని తెలిపారు. సీఈసీపై పార్లమెంటులో ఇంపీచ్‌మెంట్ తీర్మానం ప్రవేశపెట్టే అంశంపై ఈ భేటీలో తుది నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి హెచ్చరించారు. స్వాతంత్ర్యం రాకముందు మహాత్మా గాంధీ నాయకత్వంలో దేశ ప్రజలంతా ఏకమై ఏ విధంగా పోరాడారో, ఇప్పుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో రాజ్యాంగ రక్షణ మరియు 'రూల్ ఆఫ్ లా' కోసం అదే తరహా పోరాటం జరుగుతోందని పేర్కొన్నారు.

రామ్‌లీలా మైదాన్ కు పార్టీలకు అతీతంగా తరలిరండి

రాబోయే ఒకటో తేదీన ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్ వేదికగా 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ ఈ సభకు తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి, న్యాయవ్యవస్థకు స్పష్టమైన సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడటం వల్లే న్యాయవ్యవస్థలో కదలిక వచ్చిందని, ఈ రోజు సుప్రీంకోర్టు కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) తీవ్ర స్థాయిలో మొట్టికాయలు వేసిందని గుర్తుచేశారు.

ఆ 550 ఎకరాలు ప్రభుత్వానివే..

- మియాపూర్ భూముల కేసులో సుప్రీం తీర్పు
- తెలంగాణ ప్రభుత్వం విజయం
- ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేత
- ప్రభుత్వం చూపిన చొరవకు ప్రశంసలు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబరు 29:

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 100, 101కు సంబంధించిన భూ వివాదంలో సుప్రీం కోర్టు కీలకతీర్పు వెలువరించింది. సుమారు 550 ఎకరాలకిపైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. దీంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములపై సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న న్యాయ వివాదానికి ముగింపు లభించింది.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్‌లోని సర్వే నంబర్ 100లో 277 ఎకరాల 5 గుంటలు, సర్వేనంబర్ 101లో 273 ఎకరాల 34 గుంటల ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఆ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ కేసుల్లో 1997లో ప్రత్యేక న్యాయస్థానం, 2003లో హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పుఇచ్చింది. ఆ తీర్పును సవాల్‌చేస్తూ ప్రైవేట్ వ్యక్తులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. దాదాపు 23 ఏళ్లుగా ఈ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

550 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కోరుతూ ప్రైవేట్ వ్యక్తులు దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేస్తూ జస్టిస్ సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఆ భూములను జాగీర్దార్ కైసరుద్దీన్ చట్టబద్ధమైన వారసులైన అమీరున్నిషా, ఇతరుల నుంచి చట్టబద్ధంగా పొందామని తమ పేరిట ఉన్న జీపీఏ, సనద్ హక్కులకు ఆటంకం కలగకుండా చూడాలని పిటిషన్‌దారులు కోరారు. రిజిస్టర్డ్ పత్రాలని రద్దు చేసే అధికారం తహసీల్దార్‌కు లేదని వాదించారు.

23 ఏళ్ల భూ వివాదానికి తెర

ప్రభుత్వ పక్షాన వాదించిన సీనియర్ న్యాయవాది శ్రీ వైద్యనాథన్ మియాపూర్ భూములు సర్కారుకే చెందుతాయని స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన రెవెన్యూ రికార్డులు, సేత్వార్, క్లాసర్ రిజిస్టర్ గత న్యాయస్థానాల తీర్పులను ఆధారాలుగా సమర్పించారు. ప్రైవేట్ వ్యక్తులు హక్కులు కోరుతూ చూపిన రెవెన్యూ ఎంట్రీల్లో అవకతవకలున్నాయని గత న్యాయస్థానాలు గుర్తించిన అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం కోట్లాది రూపాయల విలువైన భూములు ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేందుకు కోర్టు అనుమతించబోదని స్పష్టంచేసింది. ఇలాంటి విషయాల్లో కోర్టు మౌనంగా ఉండలేదని పేర్కొంది. ఈ భూముల విషయంలో ప్రభుత్వం చూపిన చొరవని సుప్రీంకోర్టు ప్రశంసించింది. మియాపూర్ భూముల విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా రావడంపై అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లుగా చేసిన పోరాటానికి ఫలితం దక్కిందని వ్యాఖ్యానించారు.

ప్రజలకు పోలీసు సేవలను చేరవేయడమే 'సురక్ష' లక్ష్యం

- సాంకేతికతతో మారుతున్న సమాచార వ్యవస్థ
- స్థానిక భాషపై పట్టు ఉంటేనే ప్రజలతో మెరుగైన అనుసంధానం
- 'సురక్ష' దిన పత్రిక ప్రథమ వార్షికోత్సవంలో డిజిపి సి.వి. ఆనంద్

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 29:

మారుతున్న సమాచార వ్యవస్థలో పోలీసుల సేవలు, త్యాగాలు, ప్రజలకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలంగాణ డిజిపి, 'సురక్ష' దినపత్రిక ప్రధాన సంపాదకుడు సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. పోలీసులపై తప్పుడు వార్తలు ప్రచారంలోకి వచ్చినప్పుడు వాస్తవాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రజా సమస్యలు, పోలీసు సేవలు, నేరాలపై అవగాహన కల్పించడంలో 'సురక్ష' కీలక పాత్ర పోషించాలని సూచించారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్ష' దినపత్రిక ప్రథమ వార్షికోత్సవ సమావేశం గురువారం హైదరాబాద్‌లోని పేట్లబురుజులో ఉన్న సిటీ పోలీస్ కాలేజీలో జరిగింది. ఈ కార్యక్రమానికి డీజీపీ సి.వి. ఆనంద్ ప్రధాన సంపాదకుడి హోదాలో హాజరయ్యారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్, 'సురక్ష' కార్యనిర్వాహక సంపాదకుడు రమేష్ ఆయనకు స్వాగతం పలికారు. ప్రముఖ పాత్రికేయుడు పమిడికాల్వ మధుసూదన్, మామిడి హరికృష్ణ, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, పోలీసు యూనిట్లకు చెందిన పీఆర్వోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సాంకేతికతతో మారుతున్న సమాచార వ్యవస్థ

ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. సమాచార ప్రసార విధానంలో కాలానుగుణంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయని వివరించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉండటంతో సమాచారం క్షణాల్లో ప్రజలకు చేరుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను తక్షణమే తెలుసుకునే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. సమాచారం వేగంగా వ్యాపిస్తున్న క్రమంలో నిజానిజాలను నిర్ధారించడం సవాలుగా మారుతోందని చెప్పారు. కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత కారణాలతో పోలీసులపై తప్పుడు కథనాలు ప్రచురించడం, వాస్తవాలను వక్రీకరించడం జరుగుతోందన్నారు.

పోలీసుల సేవలు ప్రజలకు చేరాలి

పోలీసులు విధినిర్వహణలో ఎదుర్కొనే సవాళ్లు, సమాజం కోసం చేసే త్యాగాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని డిజిపి స్పష్టం చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల సందర్భంగా నిర్వహించే రక్తదాన శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు పోలీసుల సామాజిక బాధ్యతకు నిదర్శనమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు, ప్రత్యేక కథనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com